


WWW.nindam.co.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

గురువారం, అక్టోబర్ 31, 2024 | సంపుటి - 21 | సంచిక 43 | వెల - 7 | పేజీలు - 12

Published from Hyderabad and Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Anantapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam





## ఎస్ఆర్ఆర్ ట్రేడర్స్‌లో
# తనిఖీలు

- స్టాకు, క్రయవిక్రయ వివరాల సేకరణ
- నినాదం వరుస కథనాలతో కదలిక
- బిల్లుల వ్యవహారంలో సిటీఓ సీరియస్



స్టాకును పరిశీలిస్తున్న అధికారులు

**పెద్దపల్లి, అక్టోబరు 30(నినాదం):**

జిల్లా కేంద్రంలో నిబంధనలు అతిక్రమించి సాగుతున్న టపాసుల దందాపై నినాదం ప్రచురించిన కథనాలకు స్పందనలభించింది. ఈమేరకు బుధవారం రాజన్న సిరిసిల్ల జిల్లా సిటిఓ శైలజ తన బృందంతో పట్టణ శివారులోగల ఎస్ ఆర్ ఆర్ ఫైర్ ట్రేడర్స్ ను సందర్శించారు.

తరువాయి2లో

## దేశానికి రోల్‌మోడల్‌గా
# బిసి కులగణన

- కులగణన హామీని నిలబెట్టుకుంటున్న కాంగ్రెస్
- సోనియాకు ఇచ్చిన హామీ అమలుచేసే యత్నం
- భవిష్యత్ జన గణనకు ప్రామాణికంగా సర్వే
- గాంధీభవన్‌లో పార్టీ సమావేశంలో సిఎం రేవంత్



**హైదరాబాద్,అక్టోబర్30(నినాదం):**

ప్రభుత్వం చేపట్టబోతున్న బిసి కులగణన దేశానికే రోల్ మోడల్‌గా మార్చాలని పార్టీ శ్రేణులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. బిసి కులగణన హామీని నిలబెట్టుకోవడం ద్వారా తెలంగాణను ఆదర్శంగా నిలుపుదామని అన్నారు. రాజకీయంగా ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సోనియాగాంధీ ఇచ్చిన మాటను నిలబెట్టి తీరుతామని స్పష్టం చేశారు. కులగణనపై గాంధీభవన్‌లో జరిగిన ఉన్నతస్థాయి పార్టీ సమావేశంలో పాల్గొన్న సీఎం.. ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో మన తెలంగాణను మోడల్‌గా పరిగణనలోకి తీసుకునేలా డాక్యుమెంటును కేంద్రానికి పంపుతామని వివరించారు.

తరువాయి2లో

### గమనిక

పాఠకులు గమనించగలరు... దీపావళి పండుగ సందర్భంగా నేడు (గురువారం) నినాదం కార్యాలయానికి సెలవు. కావున శుక్రవారం సంచిక వెలువడదు. పునఃదర్శనం శనివారం.

- ఎడిటర్, నినాదం



# టీడీపీ వైపు యువనేత చూపు

పదేండ్లుగా సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు చేరువ

**ఓనమాలు నేర్పించిన పార్టీ నీడకే బుర్ర సంజయ్ కుమార్**

**సామాన్య కుటుంబం నుంచి విద్యార్థి నేతగా ప్రస్థానం**

- ఏపీ సీఎం చంద్రబాబుతో ఎన్నో ఏండ్ల అనుబంధం
- వస్తున్నా మీకోసం, రైతు పోరుబాటలో బాబు వెంటే..
- త్వరలోనే అనుచరులతో కలిసి ఆర్భాటంగా చేరిక?
- తెలంగాణలో పార్టీ బలోపేతానికి దోహదం
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలతో అనుబంధం

సామాన్య కుటుంబంలో జన్మంచి.. కళాశాల స్థాయి నుంచే విద్యారంగ సమస్యలపై పోరాడి విద్యార్థి నేతగా ఎదిగిన బుర్ర సంజయ్ కుమార్, తనకు రాజకీయంగా మొదట అండనిచ్చిన, నీడనిచ్చిన టీడీపీలోనే తిరిగి చేరాలని భావిస్తున్నారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై సంజయ్ పోరాటాన్ని గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అతడిని 2009లో టీడీపీలో చేర్చుకున్నారు.

02

## భూపాలపల్లి జిల్లాలో... మావోయిస్టు లేఖ
# కలకలం

- బిఆర్ఎస్ నాయకులకు మావోయిస్ట్ అధికార ప్రతినిధి హెచ్చరింపులు..
- దోచుకున్న సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్
- లేకుంటే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరిక
- తీరుమార్చుకోని ప్రజల మధ్యలో సన్నిహితంగా ఉండాలని సూచన

వివరాలు 12లో..

## బోనస్‌పై ఆశలు
# నెరవేరేనా?

33 రకాల సన్నాలకు రూ.500 బోనస్

- మైక్రో మీటర్లతో వడ్లను కొలిచేందుకు ఏర్పాట్లు
- 6 మిల్లీ మీటర్ల పొడవు.. 2 మిల్లీమీటర్ల వెడల్పు
- మార్గదర్శకాలపై అన్నదాతల్లో ఆందోళన

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో (నినాదం):**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రైతులకు అమలు చేస్తామన్న హామిలో రైతులకు బోనస్ అమలుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే రూ. 2 లక్షల లోపు రైతు రుణమాఫీ చేసిన ప్రభుత్వం మరో హామీ రూ.500బోనస్ చెల్లింపుపై కసరత్తు ప్రారంభించింది. ఈ క్రమంలో రైతులు పండించిన సన్న రకం వరి ధాన్యానికి బోనస్ చెల్లించేందుకు మార్గదర్శకాలు విడుదల చేసింది ప్రభుత్వం. క్వింటాల్ సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వనుంది. రాష్ట్రంలో రైతులు వర్షాకాలంలో పండించిన

తరువాయి2లో









## ఎస్ఆర్ఆర్ ట్రేడర్స్‌లో తనిఖీలు

**మొదటిపేజీ తరువాయి**

అక్కడ గల స్టాకు,అప్పటివరకు జరిగిన అమ్మకాలు తదితర వివరాలను అధికారులు సేకరించారు.అమ్మకాలకు సంబంధించి నిర్వాహకులు వినియోగదారులకు బిల్లులు ఇవ్వటం లేదని గుర్తించారు.ఇకపై అలా జరగకూడదని,నిబంధనల్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.సేకరించిన వివరాల పూర్తి పరిశీలన అనంతరం చర్యలుంటాయని తెలిపారు.

**గంట గడవకముందే..**

కాగా తనిఖీ అధికారులు అక్కడినుండి వెళ్లారోలేదో సదరు షాపులో బిల్లు రహిత వ్యాపారం మళ్లీ మొదలైంది.అమ్మకాలకు సంబంధించి తప్పకుండా బిల్లులు మెయిన్ టేన్ చేయాలని అధికారులు స్పష్టంగా చెప్పినా నిర్వాహకులు వారిపనివారు కానిస్తున్నారు. వీరి బరితెగింపు నేపధ్యంలో సంబంధిత శాఖ అధికారులతీరుపైనా పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యాపారం సాగిస్తూ ప్రభుత్వానికి ఈ తరహాలో ట్యాక్స్ ఎగ్గొడుతున్న వీరిపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచిచూడాలి.

## ఆ ఏరివేతల వెనుక హోంశాఖ మంత్రి అమిత్ షా

**కెనడా ప్రభుత్వం ఆరోపణ**

**న్యూఢిల్లీ:** కెనడాలో ఉన్న సిక్కు వేర్పాటువాదల ఏరివేతకు ప్లాన్ వేసింది భారత హోంశాఖ మంత్రి అమిత్ షా అని కెనడా ప్రభుత్వం ఆరోపించింది. ప్రధాని మోదీకి సన్నిహితుడైన అమిత్ షా సిక్కు వేర్పాటువాదులను టార్గెట్ చేసినట్లు ఆ దేశం పేర్కొన్నది. కెనడా చేసిన ఆరోపణలను భారత ప్రభుత్వం కొట్టిపారేసింది. ఖలిస్తానీల ఏరివేత వెనుక అమిత్ షా పాత్ర లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. సిక్కు వేర్పాటువాదులను షా టార్గెట్ చేసిన విషయాన్ని కెనడా విదేశాంగ శాఖ మంత్రి డేవిడ్ మారిసన్ తొలుత అమెరికాకు చేరవేశారు. అమెరికాకు చెందిన వాషింగ్టన్ పోస్టు పత్రికకు ఆ సమాచారం ఇచ్చింది తానే అని డేవిడ్ పార్లమెంటరీ ప్యానెల్ భేటీలో తెలిపారు. సిక్కు వేర్పాటువాదుల హత్యకు ప్లాన్ వేసిన వ్యక్తి షానేనా అని ఓ జర్నలిస్టు అడిగారని, అయితే ఆ వ్యక్తికి అవునని తాను సమాధానం ఇచ్చినట్లు మారిసన్ తెలిపారు.

## నేటి నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు

**గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకెళ్లాలి**

**అమరావతి :** ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలు చేస్తోంది. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించింది. ఇప్పటికీ కొందరికీ ఫ్రీ గ్యాస్ ఎలా తీసుకోవాలనే సందేహం కలుగుతుంది. ఏయే పత్రాలు ఇవ్వాలి..? అని అడుగుతున్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్ కోసం ధరఖాస్తు దారుని వద్ద ఎల్పీజీ కనెక్షన్, ఆధార్ కార్డ్, తెల్ల రేషన్ కార్డు ఉండాలి. ఎప్పటిలాగే మొబైల్ నంబర్ ద్వారా గ్యాస్ బుకింగ్ చేయాల్సి ఉంటుంది. గ్యాస్ బుక్ చేసిన తర్వాత 24 గంటల్లో గ్రామాల్లో.. రెండు రోజుల్లో సిలిండర్ డెలివరీ అవుతుంది. ఒకవేళ సిలిండర్ డెలివరీ సమయంలో గ్యాస్ డెలివరీ ఏజెంట్ డబ్బులు తీసుకుంటే రెండురోజుల్లో లబ్దిదారుల ఖాతాల్లో రూ.851 జమ అవుతుంది. గ్యాస్ కనెక్షన్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని డీలర్ వద్దకెళ్లి ఈ-కేవైసీ చేయించుకోవాలి. ఈ కేవైసీ చేసిన తర్వాత రెండు, మూడు రోజుల్లో అప్ డేట్ అవుతుంది. ఆ లోపు సిలిండర్ వస్తే డబ్బులు చెల్లించాలి. కేవైసీ పూర్తయిన తర్వాత.. సిలిండర్‌కు లబ్దిదారుడు ఇచ్చిన నగదు వారి ఖాతాలో జమ అవుతుంది. ఫ్రీ గ్యాస్ సిలిండర్‌కు సంబంధించి సమస్య ఉంటే 1967 నంబర్‌కు కాల్ చేయాలని అధికారులు సూచించారు. ఫస్ట్ సిలిండర్ మార్చి 31వ తేదీ లోపు బుక్ చేసుకోవాలి. రెండో సిలిండర్ జూలై 31వ తేదీ లోపు బుక్ చేయాలి.. చివరి సిలిండర్ నవంబర్ 30వ తేదీలోపు బుక్ చేయాల్సి ఉంటుంది.

## విద్యుత్ చార్జీలు పెంచకుండా అడ్డుకున్నాం

**రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ సంబురాలు**

**హైదరాబాద్:** కరెంట్ చార్జీలను పెంచాలన్న ప్రభుత్వ ప్రయత్నానికి చెక్ పెట్టించ గలిగామని బీఆర్ఎస్ చెబుతోంది. ఇఆర్‌సిని కలి వాదనలు సక్రమంగా వినిపించడం వల్లనే పెంపు సాధ్యం కాలేదని అంటున్నారు. సామాన్యుడిపై విద్యుత్ భారం పడకుండా ఎలక్ట్రిసిటీ రెగ్యులటరీ కమిషన్ ముందు తమ వాదనలు బలంగా వినిపించి పేద ప్రజలపై భారం పడకుండా చూడడంలో బీఆర్ఎస్ పార్టీ సాధించిన గొప్ప విజయం సాధించిందని అంటున్నారు. విద్యుత్ బిల్లుల తగ్గింపుపై విజయం సాధించిన సందర్భంగా పార్టీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. స్వీట్లు పంచిపెట్టారు. కేసీఆర్, కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు.

# టీడీపీ వైపు యువనేత చూపు

## ఓనమాలు నేర్పించిన పార్టీ నీడకే బుర్ర సంజయ్ కుమార్

### సామాన్య కుటుంబం నుంచి విద్యార్థి నేతగా ప్రస్థానం



**సామాన్య కుటుంబంలో జన్మించి.. కళాశాల స్థాయి నుంచే విద్యారంగ సమస్యలపై పోరాడి విద్యార్థి నేతగా ఎదిగిన బుర్ర సంజయ్ కుమార్, తనకు రాజకీయంగా మొదట అండనిచ్చిన, నీడనిచ్చిన టీడీపీలోనే తిరిగి చేరాలని భావిస్తున్నారు. విద్యార్థులు, విద్యారంగ సమస్యలపై సంజయ్ పోరాటాన్ని గుర్తించిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అతడిని 2009లో టీడీపీలో చేర్చుకున్నారు. అదే సంవత్సరంలో ఎస్ ఆర్ ఆర్ ఎస్ పాలిటెక్నిక్ కళాశాలకు టీ ఎన్ ఎస్ ఎఫ్ అధ్యక్షుడిగా, 2010 లో సిరిసిల్ల డివిజన్ అధ్యక్షుడిగా, 2011లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడుగా, 2012 లో కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా 2013 లో తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ గా పనిచేశారు. 2014 లో అనివార్య కారణాల వల్ల టీడీపీకి రాజీనామా చేసిన అయిన సొంతంగా నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్ టీ ఎస్ ఎఫ్)ను స్థాపించి ప్రస్తుతం రాష్ట్ర అధ్యక్షుడు గా ఉన్నారు. ఏ రాజకీయ పార్టీలోనూ చేరకుండా పదేండ్ల నుంచి స్వతంత్రంగానే ఉంటూ విద్యార్థుల సమస్యలపై గళమెత్తుతూ.. పోరాడుతూ తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు.**



### చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు

సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం కల్లేపల్లి గ్రామానికి చెందిన సంజయ్ కుమార్ చిన్నప్పటి నుంచే నాయకత్వ లక్షణాలు కలిగి ఉన్నాడు. 2008లో ప్రస్తుత రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అగ్రహారంలో ఉన్న ఎస్ఆర్ ఆర్ ఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చేరినప్పటి నుంచే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు చూసి కలతచెందేవాడు. విద్యార్థులకు నాణ్య మైన విద్య, సరైన మౌలిక వసతులు అందాలనే సంకల్పంతో అప్పటి నుంచే విద్యారంగ సమస్యలపై ఉద్యమం మొదలు పెట్టాడు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కేంద్రంగా సమకాలీన అంశాలపై పట్టు సాధించి, అంచెలంచెలుగా విద్యార్థి నేతగా ఎదిగాడు. తన నాయకత్వ లక్షణాలను, పోరాట పటిమను చూసి అప్పటి టీడీపీ నాయకులు అతడికి టీఎన్ ఎస్ ఎఫ్ లో వివిధ బాధ్యతలు అప్పగించగా సంజయ్ వాటిని సమర్థవంతంగా నిర్వర్తించారు. తెలంగాణ మలిదశ ఉద్యమ నేపథ్యంలో టీఎన్ఎస్ఎఫ్ కు రాజీనామా చేశారు.

### రాష్ట్రవ్యాప్తంగా విద్యారంగ సమస్యలపై పోరాటం

తెలంగాణ మలిదశ ఉద్యమంలో సంజయ్ కుమార్ కీలక పాత్ర పోషించారు. ఉమ్మడి పాలనలో తెలంగాణ ప్రాంతానికి, ముఖ్యంగా ఇక్కడి విద్యార్థులు, యువతకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తాడు. తోటి విద్యార్థుల్లో అవగాహన కల్పించి ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించాడు. తెలంగాణ ఆందోళన ల్లో చురుగ్గా పాల్గొనేందుకు విద్యార్థులను, యువతను ప్రోత్సహించాడు. టీఎన్ఎస్ఎఫ్ కు రాజీనామా చేసిన తర్వాత ఏ రాజకీయ పార్టీకీ అనుబంధంగా ఉండకూడదని భావించి 2014 జూన్ లో సొంతంగా నవ తెలంగాణ స్టూడెంట్ ఫెడరేషన్ ను స్థాపించాడు. దీని ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ, విద్యార్థుల సమస్యల పరిష్కారానికి విశేషంగా పాటుపడుతున్నాడు. ఎక్కడ విద్యార్థులకు సమస్య ఉన్నా అక్కడికి వెళ్లి వారి తరపున గొంతు వినిపిస్తున్నాడు.

### విద్యార్థుల్లో గుర్తింపు

ఓవైపు విద్యార్థి నేతగా విద్యారంగ సమస్యలపై పోరాడుతూ, మరోవైపు సామాజిక వేత్తగా బీ ఎస్ కే ఫౌండేషన్ ద్వారా సేవలందిస్తూ బుర్ర సంజయ్ కుమార్ రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకోవడమే కాకుండా ముఖ్యంగా విద్యార్థులతో అనుబంధాన్ని పెంపొందించుకున్నాడు. వివిధ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీ వేదికలపై ఆయన ప్రసంగాలు విద్యార్థులను ఆకట్టుకున్నాయి. ఎక్కడ సమస్య ఉన్నదని తెలిసినా అక్కడికి వెంటనే వెళ్లి విద్యార్థుల తరఫున గళమెత్తేవాడు. ఇలాంటి ఎందరికో తలలో నాలుకలా మారాడు.

### తిరిగి సొంత గూటికి

టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు వద్ద రాజకీయ ఓనమాలు నేర్చిన బుర్ర సంజయ్ కి టీడీపీలో మంచి పలుకుబడి ఉన్నది. 2014లో టీడీపీకి రాజీనామా చేసినా ఆ తర్వాత సంజయ్ ఏ పార్టీలోనూ చేరలేదు. స్వతంత్రుడిగానే కొనసాగారు. విద్యారంగ సమస్యలపైనా సొంతంగానే పోరాడారు. చంద్రబాబు వద్ద సంజయ్ కి ఉన్న పలుకుబడి ద్వారానే గతంలో చంద్రబాబు నిర్వహించిన పాదయాత్రల్లోనూ సంజయ్ పాల్గొన్నారు. చంద్రబాబు నాయుడు చేపట్టిన వస్తున్నా మీకోసం, రైతు పోరుబాటలో బాబు వెంట సంజయ్ నడిచారు. తెలుగుదేశం పార్టీని తెలంగాణలో కూడా బలోపేతం చేయాలని చంద్రబాబు నాయుడు చూస్తున్న క్రమంలో బుర్ర సంజయ్ కుమార్ భారీ బలగంతో టీడీపీలో చేరేందుకు సిద్ధమైనట్లు ప్రచారం జరుగుతున్నది. విద్యార్థి వర్గాల్లోనూ ఈ విషయంపై చర్చ నడుస్తున్నది. టీడీపీలో




చేరి పార్టీని పల్లెపల్లెనా ముందుకు తీసుకెళ్లేందుకు సంజయ్కుమార్ ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు. బలమైన కేడర్ ఉన్న వ్యక్తి కావడంతో టీడీపీకి కూడా సంజయ్కుమార్ చేరిక తెలంగాణలో అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. ఇటీవల ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా అభిమానులు సంజయ్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా జరుపుకొని సంజయ్పై తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తర తెలంగాణలో ఎక్కడ చూసినా సంజయ్ బర్త్ డే ఫ్లెక్సీలే దర్శనమిచ్చాయి. ముఖ్యంగా హైదరాబాద్ మహానగరంలోనూ ఎన్టీఆర్ భవన్ సమీపంలో, హైటెక్ సిటీ, బంజారాహిల్స్, సెక్రెటేరియట్ పరిధి ప్రధాన రోడ్ల వెంబడి సంజయ్ ఫ్లెక్సీలు విరివిగా దర్శనమిచ్చాయి. సంజయ్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఆయన అభిమానులు దవాఖానలు, అనాథాశ్రమాల్లో పండ్లు, బ్రెడ్, మిఠాయిలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఇప్పుడు టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభం కాగా, తెలంగాణలోనూ 26 నుంచి ఈ కార్యక్రమం మొదలైంది. ఈ క్రమంలో పెద్ద ఎత్తు అనుచరులతో తరలివెళ్లి సంజయ్ టీడీపీలో చేరేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నారని సర్వత్రా చర్చ కొనసాగుతున్నది. తనకు రాజకీయంగా అండనిచ్చిన టీడీపీ గ్రామగ్రామన బలోపేతానికి పాటుపడుతానని తన అనుచరుల వద్ద సంజయ్ చర్చిస్తున్నట్టు తెలిసింది.

## స్థానిక ఎన్నికల్లో బిసి రిజర్వేషన్లకు కమిషన్

**- తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

**హైదరాబాద్:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బిసి రిజర్వేషన్లను త్వరగా తేల్చితే స్థానిక ఎన్నికల్లో లబ్ధి ఉంటుందని పిటిషనర్ వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. ఈ క్రమంలో బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒక జీవో విడుదల చేసింది. బీసీ రిజర్వేషన్లపై అధ్యయనం చేసే బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం బీసీ కమిషన్‌కు అప్పగించింది. దీనిని సవాల్ చేస్తూ బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ జీవో ప్రకారం ఒకటి రెండు నెలల పాటు రాష్ట్రంలో బీసీ కమిషన్ అధ్యయనం చేసి నివేదిక అందిస్తుంది. గతంలో మహారాష్ట్రలో ఇలాగే బీసీ కమిషన్ చేసిన అధ్యయనాన్ని అక్కడి హైకోర్టు కొట్టివేసింది.



## దేశానికి రోల్‌మోడల్‌గా బిసి కులగణన

**మొదటిపేజీ తరువాయి**

కులగణనపై సమన్వయం చేసుకునేందుకు 33 జిల్లాలకు 33 మంది ప్రత్యేక అబ్జర్వర్లను నియమించాలని రేవంత్ రెడ్డి సూచించారు. బాధ్యతగా పనిచేయాలని కష్టానికి తగిన ఫలితం తప్పకుండా ఉంటుందని స్పష్టం చేశారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట అమలు చేసే క్రమంలో ఎవరు అభ్యంతరకరంగా వ్యవహరించినా పార్టీ క్షమించదని హెచ్చరించారు. నవంబర్ 31లోగా పక్రియ పూర్తి చేసి భవిష్యత్తు యుద్దానికి సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. తెలంగాణ నుంచి నరేంద్ర మోదీపై యుద్ధం ప్రకటించాల్సి ఉందని స్పష్టం చేశారు. కులగణన ఎక్స్‌రే మాత్రమే కాదని అది మెగా హెల్త్ చెకప్ లాంటిదని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ ఆదాయాన్ని సామాజిక న్యాయం ప్రకారం పంచడమే కాంగ్రెస్ విధానమని స్పష్టం చేశారు. నవంబర్ 6 నుంచి తెలంగాణలో కులగణన పక్రియను ప్రారంభించనున్నారు. దేశంలో తొలిసారిగా ఇక్కడ కులగణన చేపట్టనున్నారు. నవంబర్ 6న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఆహ్వానించాలని రాష్ట్ర నాయకత్వం యోచిస్తోంది. ఈమేరకు గాంధీ భవన్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పాల్గొన్నారు. కులగణన తర్వాత ఏయే సంక్షేమ కార్యక్రమాలకు ఎంత నిధులు కేటాయించాలో తెలిసే అవకాశం ఉంది. త్వరలో దీనిపై అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తామని మంత్రులు తెలిపారు. త్వరలో అన్ని జిల్లాల్లో కులగణనపై సమావేశాలు ఏర్పాటు చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వారిని ఆదుకోవడానికి ఈ సర్వే ఉపయోగపడుతుందని చెప్పారు. రాహుల్ గాంధీ హామీ మేరకు కులగణన చేస్తున్నామన్నారు. సర్వేతో అందరి సామాజిక, ఆర్థిక పరిస్థితులు తెలుస్తాయని పేర్కొన్నారు. భవిష్యత్‌లో దేశమంతా తెలంగాణను అనుసరిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలు సమావేశంలో పాల్గొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్నది బీసీ కులగణన కాదు.. సమగ్ర కులగణన అని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ స్పష్టం చేశారు. కులగణన సర్వేను కాంగ్రెస్ అత్యంత ప్రాధాన్యం ఉన్న విషయంగా తీసుకుందన్నారు. కులగణన ఎక్స్ రే మాత్రమే కాదు మెగా హెల్త్ చెకప్ లాంటిదన్నారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ అన్ని పరిస్థితులు చూశారు... కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో కులగణన చేయాలని నిర్ణయించారు. కులగణన నిష్పక్షపాతంగా నిర్వహిస్తామని అన్నారు. నవంబర్ 2న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

ఈ సమావేశాలకు అన్ని వర్గాల ప్రజలను ఆహ్వానిస్తామని తెలిపారు. డిసెంబర్ 7 నాటికి కాంగ్రెస్ ఏడాది పాలన పూర్తవుతుందని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఆలోపు సమగ్ర కులగణన సర్వేను హైకోర్టుకు అందిస్తామన్నారు. రాహుల్ ఇచ్చిన మాటను నెరవేర్చబోతున్నామన్నారు. రాహుల్ ప్రధాని కావడానికి తెలంగాణ మోడల్ ఉపయోగపడుతుందన్నారు. నవంబర్ 31 లోగా కులగణన పూర్తి చేస్తామన్నారు.

# బోనస్‌పై ఆశలు నెరవేరేనా..?

**మొదటిపేజీ తరువాయి**

వరి ధాన్యాన్ని పౌర సరఫరాల, సహకార, ఐకేపీ,మార్కెట్ కమిటీ, ఇతర సంస్థలు ఇప్పటికే అక్కడక్కడ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి సేకరిస్తున్నారు. ఈ క్రమంలో అనేక మంది రైతులు వివిధ రకాల వడ్లను సాగు చేశారు. ప్రభుత్వం ప్రకటించిన మార్గదర్శకాలతో తమకు బోనస్ వర్తిస్తుందా? లేదా? అను మానాలు వ్యక్తం చేస్తున్నారు.

**అధునాథన టెక్నాలజీతో..**

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సాధారణంగా కాంటాల ద్వారానే వరి ధాన్యం కొనుగోలు చేసేవారు. కాంటాల్లో తేడాలు వస్తున్నాయనే ఆరోపణల నేపధ్యంలో డిజిటల్ కాంటాలను ఏర్పాటు చేసి కొనుగోళ్లు చేస్తున్నారు. కానీ ఈసారి అందుకు బిన్నంగా ఆధునాథన టెక్నాలజీని కొనుగోలు కేంద్రాల్లో ఉపయోగించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సన్నరకం ధాన్యంకు రూ.500 బోనస్ ప్రకటించిన ప్రభుత్వం కొన్ని రకాలకే చెల్లిస్తామని ప్రకటించింది. ఈ క్రమంలో ఏ రకం వరి ధాన్యమని తెలుసుకునేందుకు యంత్రాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

**ధాన్యాన్ని కొలిచి లెక్కకట్టుడే...**

ప్రభుత్వం ఏర్పాటు చేసే ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం గింజ పొడవు, వెడల్పు నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా? అని తెలుసుకోవడానికి మైక్రో మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. పొడవు 6 మిల్లీ మీటర్ల కంటే తక్కువ, వెడల్పు 2 మిల్లీ మీటర్ల కంటే ఎక్కువ కాకుండా ఉండాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ధాన్యం ఉంటేనే బోనస్ వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. అలాగే ధాన్యం తేమ 17 శాతానికి మాత్రమే కొనుగోలుకు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇలా నిబంధనల ప్రకారం ఉన్నసన్నరకం వడ్లకే క్వింటాలుకు రూ.500 బోనస్‌ను ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

**రికార్డు స్థాయిలో వరి పంట సాగు..**

ఈ వానాకాలంలో తెలంగాణ రాష్ట్రంలో వరి సాగులో రికార్డు సాధించింది. ఈసారి కాలం కలిసి రావడంతో ఎన్నడూ లేనంతగా రైతులు 65.49 లక్షల ఎకరాల్లో వరి నాట్లు వేశారు. అయితే ప్రభుత్వం సన్న రకాలకు బోనస్ ఇస్తామని ప్రకటన చేయడంతో సగానికి పైగా రైతులు సన్నాలు సాగు చేశారు. 2023 వానాకాలం సీజన్‌లో 65 లక్షల 873 ఎకరాల్లో వరి సాగవగా, తాజాగా మరోసారి 65 లక్షల ఎకరాల మార్కును దాటి 65 లక్షల 49 వేల 230 ఎకరాల్లో సాగైంది. వానాకాలం సీజన్‌లో సాధారణ పంటల సాగు 1.29 కోట్ల ఎకరాలు కాగా, ఇప్పటికే కోటి 29లక్షల 89వేల 397ఎకరాల్లో పంటలు సాగైనట్లు వ్యవసాయశాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. అంటే వానాకాలం సీజన్‌లో పంటల సాగు అంచనాలకు మించి 100.44 శాతానికి చేరుకున్నది.

**అయోమయంలో అన్నదాతలు..**

ప్రభుత్వం ప్రకటించిన రూ.500 బోనస్‌పై అన్నదాతల ఆనందం అంతలోనే అవిరై పోయింది.



ప్రభుత్వం బోనస్ వర్తింపుపై మార్గదర్శకాలు ప్రకటించిన నేపథ్యంలో అన్నదాతలు అయోమయానికి గురవుతున్నారు. తాము ఏ రకం పంట సాగు చేశామో? దానికి బోనస్ వస్తుందా? రాదా? అని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ముందుగానే సన్నరకంలో ఏఏ సన్న రకాలు పండించాలి ప్రకటిస్తే బాగుండేదనే అభిప్రాయాలు కూడా వ్యక్తం అవుతున్నాయి. గత ప్రభుత్వం కూడా ముందుగా సన్నరకం పంట సాగుచేయాలని చెప్పినప్పటికి దొడ్డు రకం పంటను కూడా సేకరించిందని, అదే క్రమంలో ఇప్పటి ప్రభుత్వం కూడా అన్ని రకాలకు బోనస్ ఇస్తుందని బావించామని పలువురు రైతులు చెబుతున్నారు. సన్నరకం పంటకు బోనస్ ఇస్తామంటూ మళ్లీ అందులో రకాలను ప్రకటించడం సరికాదనే అభిప్రాయాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.

**బోనస్ వర్తించే సన్నరకాలివే..**

- ★ కంపసాగర్ వరి-1 (కేపీఎస్ 2874)
- ★ సిద్ధి(డబ్ల్యు జీఎల్ 44)
- ★ జగిత్యాల్ వరి- 3(జేజీఎల్ 27356)
- ★ సాంబ మసూరి (బీపీటీ 5204)
- ★ జగిత్యాల్ వరి- 2(జేజీఎల్ 28545)
- ★ వరంగల్ సన్నాలు (డబ్ల్యుజీఎల్ 32100)వరంగల్
- ★ సాంబ(డబ్ల్యుజీఎల్ 14)
- ★ పొలాస ప్రభ (జేజీఎల్384)
- ★ వరంగల్ వరి- 2 (డబ్ల్యుజీఎల్ 962)
- ★ వరంగల్ వరి - (1119)
- ★ జగిత్యాల్ మసూరి (జేజీఎల్11470)
- ★ జేజీఎల్ 33124 (పీఆర్సీ)
- ★ తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్ 15048)
- ★ మానేరు సోనా (జేజీల్ 3828)
- ★ కృష్ణ (ఆర్ఎన్ఆర్ 2458)
- ★ కూనారం వరి- 2 (కేఎన్ఎం 1638)
- ★ ఎంటీయూ 1271
- ★ కూనారం వరి- 1 (కేఎన్ఎం 733)
- ★ రాజేంద్రనగర్ వరి - 4 (ఆర్ఎన్ఆర్ 21278)
- ★ కరీంనగర్ సాంబ (జేజీఎల్ 3855)
- ★ అంజన (జేజీఎల్ 11118)
- ★ జగిత్యాల సాంబ (జేజీఎల్ 3844)
- ★ జగిత్యాల సన్నాలు (జేజీఎల్ 1798)
- ★ సోమా నాధ్ (డబ్ల్యుజీఎల్ 347)
- ★ 55 31479 (2)
- ★ శోభిని (ఆర్ఎన్ఆర్ 2354)
- ★ ప్రత్యుమ్న (జేజీఎల్ 17004)
- ★ సుగంధ సాంబ (ఆర్ఎన్ఆర్ 2465)
- ★ నెల్లూరు మసూరి (ఎన్ఎల్ఆర్ 34449)
- ★ హెచ్ఎంటీ సోనా 55 31479(2)
- ★ కేపీఎస్ 6251 (పీఆర్సీ)
- ★ మార్టేరు మసూరి (ఎంటీయూ 1262)

## దీపాల వెలుగుల
# పరమార్థమే దీపావళి

సంపాదకీయం

దీపావళి అంటే దీపముల వరుస. చీకటి నుంచి వెలుగులోకి రావడం అనేది అంతరార్థం. మనచుట్టూ ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళి. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి. నరక చతుర్దశి రోజున అభ్యంగన స్నానం చేయాలి. అమావాస్య కనుక ప్రపంచమంతా చీకట్లు ఆవరించి ఉంటాయి. ఈ చీకట్లను పాదోలేందుకు దీపాలు వెలిగించాలన్న ఆలోచనతోనే దీపావళి జరుపుతారు. దీపాల వెలుగుల కారణంగా చీడపీడలు, పురుగూ పుట్రా, అడవి జంతువుల భయం ఉండదన్న భావన కూడా ఉంది. నరకాసురుడు మరణించిన రోజుగా నరకచతుర్దశినీ, దీపావళినీ వేడుక చేసుకుంటాం. ఈ పండుగ నుంచి మనం గ్రహించాల్సిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ఈ పండుగను నరకాసుర వధకు సంకేతంగా కాదు, మన లోపల ఉన్న దోషాలను తొలగించుకోవడానికి ఒక సంకల్పంగా జరుపుకోవాలి. అప్పుడే అది నిజమైన దీపావళి అవుతుంది. లేకపోతే డబ్బు ఖర్చు, నూనె ఖర్చు, టపాకాయల ఖర్చు తప్ప ప్రయోజనం ఉండదు. నరకం వలన భయం లేకుండా నరక చతుర్దశి నాడు స్నానం చెయ్యాలని నరక చతుర్దశి గురించి యమధర్మరాజుని ఉద్దేశించి చెప్పినట్లు భవిష్య పురాణం చెబుతోంది. శ్రీరాముడు ఆశ్వయుజ మాసంలో విజయదశమి రోజున శమీ వృక్షాన్ని పూజించి అయోధ్యకు వచ్చి పట్టాభిషిక్తుడయ్యాడు. మహావిష్ణువు వామనావతారం ఎత్తి బలిచక్రవర్తిని పాతాళ లోకానికి పంపించాడు. అయినప్పటికీ బలి శ్రీహరినే ధ్యానిం చాడు. దానికి సంతోషించిన శ్రీహరి 'నీవు దీపావళి రోజున పాతాళ లోకం నుంచి భూలోకానికి వచ్చి ఈ ఒక్కరోజు పరిపాలన చెయ్యి' అన్నాడు. ఆ రోజు వెలిగించే దీపాలకే బలిదీపం అని పేరు. వరాహావతారం లో విష్ణుమూర్తికి, భూదేవికి జన్మించినవాడే నరకాసురుడు. బ్రహ్మ వల్ల వరాలు పొంది దేవతల్ని బాధ పెట్టాడు. దేవతలందరూ దేవేంద్రుని వద్దకు వెళ్లి తమ బాధ చెప్పుకోగా దేవేంద్రుడు దేవతలందరితో కలిసి విష్ణు మూర్తి వద్దకు వెళ్లి ప్రార్థించగా శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకుడిని వధించారు. భూదేవి కూడా నరకుడి మరణానికి బాధపడలేదు. ఆమె అతనొక్కడికే తల్లి కాదు, భూమి మీద జీవించే ప్రతివారికి తల్లే కదా. పుత్ర శోకాన్ని మరచి నరకుని పేరు మీద పండుగగా ప్రజలు జరుపుకోవాలని శ్రీమహావిష్ణువుని ప్రార్థించింది. అదే నరక చతుర్దశి. ఆ తర్వాత రోజే ఆనందోత్సాహాలతో జరుపుకునే దీపావళి పండుగ. ప్రతి ఇంటా దీపాల వెలుగులు నింపే పండుగ దీపావళి. చీకటిపై వెలుగు, చెడుపైన మంచి, అజ్ఞానం మీద జ్ఞానం సాధించిన గెలుపునకు ప్రతీక ఈ పండుగ. దీపావళి పండుగ అంటే ప్రముఖంగా గుర్తొచ్చేవి పట్టుబట్టలు, పిండివంటలు, బాణాసంచా, దీపాల కాంతులు. దేశ ప్రజలు తమదైన శైలిలో పండుగను ఒక్కో చోట ఒక్కో విధంగా చేసుకుంటారు. ఉత్తర, దక్షిణ భారత ప్రజలు తమదైన సంప్రదాయాలతో, భక్తి శ్రద్ధలతో పండుగ జరుపుకుంటారు. అయితే ఉత్తర, దక్షిణ ప్రాంతాలలో పండుగ జరుపుకునే పద్ధతులలే కాదు అందుకు గల కారణాలు కూడా వేరు. పండుగ ఎందుకు జరుపుకుంటున్నారనే దానిపై ఒక్కో ప్రాంతంలో ఒక్కో కథ ప్రచారంలో ఉంది. శ్రీ మహావిష్ణువు వరాహ అవతారంలో ఉండగా వరాహస్వామి, భూదేవిలకు అసుర సంధ్యా సమయంలో నరకుడు జన్మిస్తాడు. తపస్సుతో శివుడి చేత వరం పొంది దేవమానవులను చిత్రహింసలకు గురి చేస్తుంటాడు. నరకాసురుడు తల్లి చేతుల్లోనే చంపబడాలనే వరం పొందిన కారణంగా ఎదురులేని వాడై లోకాలను ముప్పతిప్పలు పెడుతుంటాడు. దీంతో భయాందోళనకు గురైన దేవతలు శ్రీ మహావిష్ణువుని శరణువేడుతారు. వారికి అభయమిచ్చిన విష్ణువు భూదేవీ సమేతంగా శ్రీ కృష్ణ సత్యభామలుగా భూలోకంలో జన్మిస్తారు. నరకుని దురాగతాలు పెచ్చుమీరిన అనంతరం శ్రీకృష్ణుడు నరకుడిపై యుద్ధం ప్రకటిస్తాడు. భార్య సత్యభామను వెంటతీసుకెళతాడు. అక్కడి ఇరు వర్గాలకు భీకర యుద్ధం జరుగుతుంది. చివరకు నరకుడి వరం కారణంగా తల్లి అయిన సత్యభామ చేతిలోనే మరణిస్తాడు. దీంతో అతడి చెరలో ఉన్న దేవమానవులకు విముక్తి దొరకుతుంది. నరకాసురుడు మరణించాడన్న ఆనందంలో ప్రజలు దీపాలు వెలిగించి, బాణాసంచా పేల్చి పండుగ చేసుకున్నారు. శ్రీ మహావిష్ణువు ఏడవ అవతారమైన రామచంద్రుడు.. సీతను అపహరించిన రావణుడితో భీకర యుద్ధం చేస్తాడు. ఈ యుద్ధంలో రావణుడు మరణిస్తాడు. అప్పటికే రాముడి 14 ఏళ్ల వనవాసం ముగుస్తుంది. దీంతో రాముడు.. సీత,లక్ష్మణ,ఆంజనేయ సమేతంగా అయోధ్యకు తిరిగి వెళతాడు. అనంతరం రాముడు పట్టాభిషిక్తుడవుతాడు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు ఆనందంతో పండుగ జరుపుకున్నారు. గదిని ఆవరించిన అంధకారం దీపం వెలిగించగానే మాయమైనట్లు అనేక జన్మలలో చేసిన పాపాలు భగవంతుని కరుణాకటాక్షాలతో దూరం అవ్వడమే దీపావళ అని పెద్దల ఉవాచ. ప్రతి సంవత్సరం ఆశ్వయుజ మాస ప్రారంభంలో దేవీ నవరాత్రులు, నరక చతుర్దశి, దీపావళి పండుగలు రావడం విశేషం. త్రయోదశి రోజు రాత్రి అపమృత్యు నివారణ కోసం దీపాలు వెలిగించి ఇంటిముందు ఉంచాలి.

# జాతీయ ఐక్యత దినోత్సవం..



## నవభారత నిర్మాత పటేల్ జయంతి

**భారతదేశ రాజకీయ ఏకీకరణలో ప్రధాన పాత్ర పోషించిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న జాతీయ ఐక్యతా దినోత్సవం లేదా రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను జరుపుకుంటున్నాం, భారతదేశం యొక్క 565 రాచరిక రాష్ట్రాల ఏకీకరణలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారు మరియు భారతదేశ తొలి ఉప ప్రధాన మంత్రిగా కూడా గుర్తింపు పొందిన ఈ ప్రముఖ వ్యక్తి యొక్క విశేషమైన సహకారానికి జాతీయ ఐక్యత దినోత్సవం నివాళిగా ఉపయోగపడుతుంది.సర్దార్ వల్లభాయ్ పటేల్ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొనేవారు మరియు రాజ్యాంగ పరిషత్‌లో కీలక సభ్యుడు.**

అక్టోబరు 31, 2014న, సర్దార్ పటేల్‌కు గౌరవం మరియు నివాళిగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు.

దేశాన్ని ఏకతాటిపైకి తీసుకురావడానికి ఆయన చేసిన విశేషమైన ప్రయత్నాలకు గుర్తింపుగా ఆయనను భారతదేశపు ఉక్కు మనిషి అని పిలుస్తాం. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కీలక పాత్ర పోషించినందుకు నివాళులర్పించేందుకు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని జరుపుకుంటారు మరియు ఆ తర్వాత ఒకే, సంఘటిత దేశంగా ఏకీకృతం చేయబడింది.

అతను న్యాయవాది, రాజకీయ నాయకుడు మరియు దేశ అభివృద్ధి కోసం ప్రజల ఐక్యతను విశ్వసించిన రాజనీతిజ్ఞుడు.భారతదేశ స్వాతంత్ర్యం మరియు ఐక్యత కోసం ఆయన చేసిన కృషిని గుర్తించడానికి ఈ రోజును జరుపుకుంటారు. జాతీయ ఐక్యతా దినోత్సవ వేడుకల వెనుక ప్రధాన కారణం దేశ ఐక్యతను పెంపొందించడం మరియు దేశానికి సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి గురించి అవగాహన కల్పించడం.

దేశం యొక్క బలం దాని ఐక్యత, సమగ్రత మరియు స్థితిస్థాపకతలోనే ఉంటుంది అని పేర్కొన్నారు --సర్దార్ వల్లభాయ్ పటేల్

**జాతీయ ఐక్యత దినోత్సవం - ప్రాముఖ్యత...**

రాష్ట్రీయ ఏక్తా దివస్ ఆచారం ఐక్యత, సమగ్రత మరియు పొరుగు ప్రాంతాలను సమర్థించడం ద్వారా దేశం యొక్క బలం మరియు స్థితిస్థాపకతను వర్ణిస్తుంది. బ్రిటీష్ వలస పాలన నుండి స్వాతంత్ర్యం పొందిన తర్వాత 565 స్వయం ప్రతిపత్తి కలిగిన రాచరిక రాష్ట్రాలను భారతదేశంలో చేరడానికి పటేల్ విజయవంతంగా ఒప్పించారు. ఇది మాత్రమే కాదు, సర్దార్ వల్లభాయ్ పటేల్ యొక్క విపరీతమైన కృషికి గౌరవసూచకంగా, భారతదేశంలోని ఐక్యత యొక్క బలాన్ని వర్ణించేందుకు భారతదేశ ప్రభుత్వం గుజరాత్‌లోని నర్మదా నది సమీపంలో ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన సర్దార్ వల్లభాయ్ పటేల్ (182 మీటర్లు) విగ్రహాన్ని కూడా ప్రారంభించింది. దీనిని " స్టాట్యూ ఆఫ్ యూనిటీ " అని పిలుస్తారు మరియు దీనిని ప్రపంచంలోని 8వ అద్భుతంగా పిలుస్తారు. భారతీయ శిల్పి రామ్ వి సుతార్ ఈ విగ్రహాన్ని రూపొందించారు.

**రాచరిక రాష్ట్రాల ఏకీకరణలో పటేల్ పాత్ర..**

సర్దార్ పటేల్ తన ఆరోగ్యం మరియు వయస్సు విఫలమైనప్పటికీ, యునైటెడ్ ఇండియాను సృష్టించే పెద్ద లక్ష్యాన్ని ఎన్నడూ కోల్పోలేదు. భారతదేశం యొక్క మొదటి హోం మంత్రి మరియు ఉప ప్రధాన మంత్రిగా, సర్దార్ పటేల్ సుమారు 565 సంస్థానాలను భారత యూనియన్‌లో విలీనం చేయడంలో కీలక పాత్ర పోషించారు.ట్రావెన్‌కోర్, హైదరాబాద్, జునాగఢ్, భోపాల్ మరియు కాశ్మీర్ వంటి కొన్ని రాచరిక రాష్ట్రాలు భారత రాష్ట్రంలో చేరడానికి ఇష్టపడలేదు. సర్దార్ పటేల్ సంస్థానాధీశులతో ఏకాభిప్రాయం సాధించడానికి అవిశ్రాంతంగా పనిచేశాడు, అయితే అవసరమైన చోట సామ, దామ, దండ మరియు భేద్ పద్ధతులను ఉపయోగించడంలో వెనుకాడలేదు. నవాబు పాలించిన జునాగఢ్ మరియు నిజాం పాలించిన హైదరాబాద్ రాచరిక రాష్ట్రాలను విలీనం చేయడానికి అతను బలాన్ని ఉపయోగించాడు, వీరిద్దరూ తమ తమ రాష్ట్రాలను భారత యూనియన్‌లో విలీనం చేయకూడదని కోరుకున్నారు.సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ బ్రిటీష్ ఇండియా భూభాగంతో పాటు రాచరిక రాష్ట్రాలను కుట్టి భారతదేశం యొక్క బాల్కనైజేషన్‌ను నిరోధించాడు

**భారతదేశ స్వాతంత్ర్యం తర్వాత జీవితం**

స్వాతంత్ర్యం తరువాత, అతను భారతదేశ సమగ్రతలో ప్రముఖ పాత్ర పోషించాడు. సుదూర ప్రాంతాలకు మరియు సరిహద్దు ప్రాంతాలకు ప్రయాణించడం ద్వారా అతను రాచరిక రాష్ట్రాల పాలకులను ఐక్యంగా ఉండాలని మరియు ఒకే భారతదేశం – ఒకే దేశంలో భాగం కావాలని ఒప్పించాడు. ప్రారంభంలో, స్వాతంత్ర్యం తరువాత, అతను భారతదేశం యొక్క 1వ హోం మంత్రిగా మరియు అదే సమయంలో భారత సాయుధ దళాలకు కమాండర్ ఇన్ చీఫ్‌గా నియమించబడ్డాడు. తర్వాత అతను భారతదేశానికి 1వ ఉప ప్రధానమంత్రి కూడా అయ్యాడు. 1947 నుండి 1950 వరకు భారతదేశానికి నాయకత్వం వహించిన ముగ్గురు నాయకులలో ఆయన ఒకరు. డిసెంబర్ 15, 1950న గుండెపోటు, అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పటేల్ తుది శ్వాస విడిచారు.



**జాజుల దినేష్.**
**సామాజిక విశ్లేషకులు..**
**ఎంఏ. ఏంఎడ్, సెట్, పిజిడిసిఎ.**
**నల్గొండ జిల్లా..**

# ధరలతో కళతప్పుతున పండగలు



## బాణా సంచా ధరల మోత

**హైదరాబాద్:**

ధరల నేపథ్యంలో పండగలకు కళ తప్పింది. అన్ని పండగల్లాగే దీపావళి కూడా ఇంటికే పరిమితం కానుంది. బాణాసంచా కాల్చితేనే దీపావళి కాదు. అయితే దీపవాళి ప్రత్యేకతే వేరు. అయితే బాణాసంచా ధరలు కూడా విపరీతంగగా పెరిగాయి. దీపాలతో ఇల్లంతా వెలగించి కొత్త కాంతులను ఆహ్వానించడం ద్వారా పండగ జరుపుకోవాలి. అలాగే ధరలు దాడి చేస్తున్న వేళ కలసి పండగ జరుపుకోవాలని, బాణాసంచా కాల్చాలన్న ఆలోచన నుంచి బయటకు రావాలి. దీపావళి రోజు దీపాలు వెలిగించి, లక్ష్మీ పూజలతో, ఇంటి పిండి వంటలకే ప్రాధాన్యం ఇస్తూ పండగ జరుపుకోవడం ఉత్తమం. ఏటా దీపావళి పర్వదినాన్ని పిల్లాపెద్దలు కసలి ప్రజలు ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. చెడుపై మంచి గెలుపునకు చిహ్నంగా దీపాల పండుగను జరుపుకొంటారు. దీపాల పండుగ వేడుకలకు ప్రజలు ముందుగానే దీపాలు వెలిగించేందుకు సిద్ధం కావడం ఈ యేడాది విశేషంగా చెప్పుకోవాలి. తగంలో ఎప్పుడూ లేనంతగా ఇప్పుడు ప్రజలు దీపాలను వెలిగించేందుకు సిద్ధం అవుతున్నారు. ఈ మేరకు మహిళలు ప్రమిదలను కొనుగోలు చేస్తున్నారు. ధరలు పెరిగిన నేపథ్యంలో పరిమిత ఖర్చుతోనే ప్రజలు గ్రీన్ దీపావళి జరుపుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. పటాసులు కొనుగోలు చేయకుండా మట్టి ప్రమిదలలో దీపాలు వెలిగించి ఆనందాన్ని అందరితో పంచుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. ధరల దెబ్బంతో వెలుగుల పండుగ దీపావళి కళ తప్పుతోందన్న భావన రాకుండా దీపాలను వెలగించి పూజలలో భక్తిప్రపత్తులు చాటడం ముఖ్యం. అయితే తారాజువ్వల వెలుగులు, టపాసుల మోతలతో సందడిగా సాగాల్సిన పండుగ రోజు ఈసారి నిశబ్దంగా గడిచిపోనుందన్న భావన పిల్లల్లో ఉండడం సహజం. పర్యావరణహితం కూడా దృష్టిలో పెట్టుకోవాలి. ఏటా పండుగకు వారం ముందునుంచే బాణాసంచా విక్రయాలతో సందడి ప్రారంభమవుతుంది. బాణాసంచా దుకాణాలకు అనుమతి పక్రియలో భాగంగా ఒక్కో దుకాణదారుడు రూ.30వేల వరకు ఖర్చు చేసినట్లు సమాచారం. ఇక ఒక్కో దుకారణదారుడు సుమారు లక్ష నుంచి రూ.5లక్షల వరకు బాణసంచా కొనుగోలు చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అమ్మకాలు సాగుతాయా లేవా అన్న భయం ఉంది.



# బౌద్ధ మతంలో విభిన్నంగా దీపావళి
## దీపాల వరుసతో భిక్షులకు స్వాగతం

**అమరావతి :**

దీపావళికి ఒక్కోచోట ఒక్కో విధమైన కథ ప్రచారంలో ఉంది. అలాగే బౌద్ధంలోనూ ఓ కత ప్రచారంలో ఉంది. ప్రతి ఆషాఢ మాసంలో బౌద్ధ భిక్షువులకు వర్షావాసం ప్రారంభమవుతుంది. ఆ కాలంలో మూడు నెలల పాటు భిక్షువులు ప్రజల వద్దకు భిక్ష కోసం వెళ్ళరు. అడవుల్లో, గుహల్లో ఉండి... దొరికింది తింటూ, ధ్యానంలో, విద్యలో ప్రత్యేక స్వయం శిక్షణ సాగిస్తారు. ఇలా వర్షావాసం పూర్తి చేసి, ఆశ్వయుజ మాసంలో తిరిగి గ్రామాలకు బయలుదేరుతారు. గ్రామాలకు వచ్చే భిక్షువులకు దారి పొడవునా దీపాలతో ప్రజలు స్వాగతం పలుకుతారు. అదే దీపావళిగా, బౌద్ధుల ధర్మ దీపావళిగా ప్రసిద్ధం చెందింది. బౌద్ధులు మరణాన్ని నిర్వాణం అంటారు. నిర్వాణం అంటే దీపం ఆరిపోవడం. ప్రమిదలోని నూనె, వత్తీ పూర్తిగా మండిన తరువాత ఇక దీపం వెలుగదు. అదే నూనె, అదే వత్తి ఇక ఉండవు. అంటే... అదే దీపాన్ని ఇక ఎప్పటికీ వెలిగించలేం. మనిషి నిర్వాణం తరువాత కూడా అంతే! ఇలా అనిత్యత్వాన్నీ, అనాత్మవాదాన్నీ దీపంతో పోల్చి చెబుతుంది బౌద్ధం. మరణించిన వ్యక్తి తల దగ్గర దీపం ఉంచే సంప్రదాయం బౌద్ధ భిక్షువుల నిర్వాణం నుంచి పుట్టినదే! స్తూపాల మీద దీపాలు ఉంచే ఆచారం కూడా దాన్నుంచి వచ్చిందే! అందుకే మరణాన్ని దీపం ఆరడంతో పోలుస్తాం. మనుషులు చీకటి నుంచి వెలుగులోకి, వెలుగు నుంచి వెలుగులోకి నడవాలని అంటుంది బౌద్ధం. చీకటి నుంచి వెలుగులోకి నడవడం అంటే అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు పయనించడం అని అర్థం. వెలుగు నుంచి వెలుగులోకి' అంటే 'విజ్ఞానం నుంచి శీలం వైపు పయనించడం' అని అర్థం. ఇలా మనిషికి శీలం, విజ్ఞానం ఈ రెండూ కలిసి ఉంటేనే పరిపూర్ణత. వేల ఏళ్ల క్రితమే బౌద్ధంలో దీప పూజ మొదలయింది. బౌద్ధ స్తూపాల దగ్గర, బౌద్ధ ఆరామాల్లో వందలాది దీపాలు వెలిగించేవారు. బౌద్ధ ధర్మోపన్యాసాలు, దాన కార్యక్రమాలు జరిగే ప్రదేశాలను దీపాలతో నింపేవారు. తమ గ్రామానికి బుద్ధుడు భిక్షువులతో కలిసి వచ్చిన సందర్భాల్లో ఇంటింటా దీపాలను వెలిగించి, ఆహ్వానం పలికే సంప్రదాయం బలీయంగా సాగింది. ఇల్లు వదలి వచ్చిన సిద్ధార్థుడు ఆరేళ్ళు కృషి చేసి, చివరకు జ్ఞానోదయం పొంది బుద్ధుడయ్యాడు. సారనాథ్‌లో మొదటి వర్షావాసం ముగించి రాజగృహకు వచ్చాడు. ఆ సమయంలో... బుద్ధుడైన తన బిడ్డను కపిలవస్తు నగరానికి తీసుకురావాలని మంత్రుల్ని ఆయన తండ్రి శుద్ధోధనుడు ఆదేశిస్తాడు. చివరకు సిద్ధార్థుడి బాల్య మిత్రుడైన కాలు ఉదాయిని పంపుతాడు. కాలు ఉదాయి బుద్ధుణ్ణి వెంటబెట్టుకొని కపిలవస్తుకు వస్తాడు. ఆ సందర్భంలో బుద్ధునికి శుద్ధోదనుడు దారిపొడవునా దీపాలు వెలిగించి స్వాగతం పలికాడు. ఆ రోజు రాజ్యమంతటా దీపాలు వెలిగించారు. అలా బుద్ధుడి కపిలవస్తు నగర పునరాగమనానికి సంకేతంగా దీపాలవెల్లి బౌద్ధ సంప్రదాయంగా నిలిచిపోయిందని అంటారు.

# నేడు హోరతులు..లక్ష్మీ పూజలు

## నోములు, వ్రతాలకు నేడే ముఖ్యం

**యాదాద్రి భువనగిరి:**

చతుర్దశి నాడు వేకువజామునే తైలాభ్యంగన స్నానం చేసే సంప్రదాయం అనాదిగా వస్తున్నది. అంతేకాదు, నువ్వుల నూనెలో లక్ష్మీ కళలు ఆవహించి ఉంటాయి. చతుర్దశి తెల్లవారు జామున నువ్వులతో తలంటుకొని తలస్నానం చేస్తే లక్ష్మీప్రదం. నరక దుర్గతి నుంచి విముక్తి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. ప్రదోషకాలంలో దీపారాధన చేయాలి. ఈ దీపాలు లక్ష్మీకటాక్షం కలిగించడంతోపాటు పితృదేవతలకు నరకబాధను విముక్తిచేస్తాయని నమ్మకం.దీపావళి నాడు హోరతులు ప్రధానమైన వేడుక. పుట్టింటికి వచ్చిన ఆడకూతుళ్లు ఇంట్లో ఉన్న మగవాళ్లందరికీ హోరతులు ఇస్తారు. సంప్రదాయబద్ధంగా కొనసాగే ఈ పక్రియ గురువారం సూర్యోదయానికి ముందుచేసుకోవాలని సిద్ధాంతులు సెలవిస్తున్నారు. సూర్యోదయానికి ముందు కుదరని పక్షంలో, వర్జ్యం వెళ్లిపోయిన తర్వాత ఇవ్వొచ్చు. ఏటా అమావాస్య నాడు వచ్చే ఈ పండుగ ఈసారి ఒకేరోజు జరుపుకోనున్నారు. అమావాస్య తిథి గురువారం పరివ్యాప్తమై ఉన్నందున గురువారం ఉదయం హోరతులు, సాయంతరం లక్ష్మీపూజలుఉ చేసుకోవాలని సూచిస్తున్నారు. దీంతో హోరతులు, లక్ష్మీపూజలు ఒకేరోజు చేసుకోవాలని పంచాంగకర్తలు సూచిస్తున్నారు. ఆశ్వీయుజ బహుళ చతుర్దశి, అమావాస్య తిథులు కలిసి వచ్చాయి. రాత్రంతా అమావాస్య తిథి పరివ్యాప్తమై ఉండటంతో దీపావళి గురువారమే చేసుకోవాలి. నోముల విషయంలోనూ పండితులు పలు సూచనలు చేస్తున్నారు. లక్ష్మీపూజలకు ఎలాగైతే సాయంత్రం అమావాస్య ఉండాలన్న నియమం ఉన్నదో.. నోములు నిర్వహించాలంటే సూర్యోదయానికి అమావాస్య తిథి ఉండాలని చెప్తున్నారు. దీపావళి పండుగ విశేషాలలో ముఖ్యమైంది లక్ష్మీపూజలు. వ్యాపారస్తులంతా దీపావళి సాయంత్రం లక్ష్మీదేవికి పూజలు చేసి, కొత్త ఖాతా పుస్తకాలు ప్రారంభిస్తారు. ఒక రకంగా చెప్పాలంటే లక్ష్మీపూజలతోనే కొత్త ఆర్థిక సంవత్సరాన్ని మొదలుపెడతారు. రాత్రిపూట అమావాస్య తిథి ఉన్నప్పుడే లక్ష్మీ పూజలు చేసుకోవాలని పండితులు చెప్తున్నారు. గురువారం సాయంత్రం లక్ష్మీపూజలు చేసుకోవాలని సూచిస్తున్నారు. దీపావళికి కొత్త అల్లుడిని ఇంటికి పిలిచి కొత్తబట్టలు, కానుకలు సమర్పించే సంప్రదాయం తెలుగువారికి ఉంది.



## మరిపెడ ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**- మునిసిపల్ చైర్ పర్సన్ గుగులోత్ సింధూర డాక్టర్ రవి నాయక్**



**డోర్నకల్ /మరిపెడ అక్టోబర్ 30(నినాదం న్యూస్)**
మహబూబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గం మరిపెడ మండల ప్రజలకు దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని మరిపెడ మునిసిపాలిటీ చైర్ పర్సన్ గుగులోత్ సింధూర,మరిపెడ ప్రభుత్వ ప్రాథమిక హాస్పిటల్ వైద్యాధికారి డాక్టర్ రవి నాయక్ ప్రజా ప్రతినిధులు, అధికారులు,శ్రేయోభిలాషులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు .దీపావళి పర్వదిననా ప్రజల కష్టాలు తొలగి వారి కుటుంబాలలో ఆనందోత్సమైన రోజులు రావాలని కోరుకున్నారు. పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా తక్కువ మోతాదులో టపాసులు కాల్చుకోవాలని ప్రమాద బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## మహబూబాద్ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

**- కిసాన్ పరివార్ సంస్థ అధినేత నానవత్ భూపాల్ నాయక్, సీఈఓ డాక్టర్ వివేక్**




**డోర్నకల్ అక్టోబర్ 30(నినాదం న్యూస్)**
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకొని కిసాన్ పరివార్ సంస్థ అధినేత యువ దళపతి ప్రజలకు సేవ చేయాలని ఎల్లప్పుడూ పరితపించే ప్రజా నాయకుడు నానవత్ భూపాల్ నాయక్,ప్రజల పక్షాన నిలబడి ప్రజల సమస్యలను తీర్చాలనే సంకల్పంతో పని చేస్తున్న సీఈఓ డాక్టర్ వివేక్ మహబూబాద్ జిల్లా డోర్నకల్ నియోజకవర్గ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, శ్రేయోభిలాషులకు, అభిమానించే ప్రజానీకానికి దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. చెడుపై సాధించిన విజయానికి గుర్తుగా దీపావళి పర్వదినాన్ని జరుపుకుంటారని తెలిపారు. ప్రజల జీవితాల నుండి కష్టాల చీకట్లు తొలగి ఆనందపు వెలుగులు ఉండాలని కోరారు.

## దేగ బాబుకు ఘన సన్మానం



**కోదాడ( అనంతగిరి),అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**
అనంతగిరి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ క్రి భ్ కో ప్రాంతీయ మహాజన సభ మెంబర్గా ఏకగ్రీవంగా ఎన్నికైన దేగ బాబును సంఘ సభ్యులు అమీనాబాద్ మాజీ సర్పంచ్ బుధవారం అనంతగిరి ప్రాథమిక వైఎస్ఆర్ సహకార సంఘంలో ఘనంగా సన్మానించారు. అనంతరం అనంతగిరి సొసైటీ చైర్మన్ క్రిబ్ కో మెంబర్ దేగ బాబు మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర నీటిపారుదల పౌరా సరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాలలో సంఘ సభ్యులు పి.వీరయ్య, సి హెచ్.విశ్వేశ్వరావు, బి.సత్యనారాయణ, కె.దాసు, కాశయ్య, అమీనా బాద్ మాజీ సర్పంచ్ ఎం.కోటేశ్వరరావు, సంఘ ఉద్యోగులు ఎన్.రామకృష్ణ మాజీ సీఈఓ ఎన్.సైదులు, వై. చిన్న కృష్ణ, బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 17వ రోజు అయ్యప్ప స్వాములకు అన్నదానం



**కోదాడ (అనంతగిరి ),అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**
తెలంగాణ శబరిమల గా పేరుగాంచిన అనంతగిరి శ్రీ హరిహరపుత్ర అయ్యప్ప స్వామి సన్నిధానంలో 17వ రోజు బుధవారం సైతం అన్నదానం కొనసాగింది. దాతల సహకారంతో 48 రోజులపాటు అన్నదాన కార్యక్రమం కొనసాగుతుందని దాతలు ఎవరైనా ఉంటే సహాయ సహకారాలు అందించేందుకు దేవాలయ కమిటీని సంప్రదించవలసిందిగా దేవాలయ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి వాసు తెలిపారు. ఈ కార్యక్రమం లో చైర్మన్ కొండపల్లి వాసు, పందిరి వీరయ్య,యరసాని రవి,కక్కిరేణి శరణం , ఐతానబోయిన వెంకటేశ్వర్లు కక్కిరేణి రామారావు, కక్కిరేణి ప్రభాకర్, గాదం శ్రీను, జంగా శ్రీను, అర్వపల్లి సత్యేనారాయణ, జగిని ప్రసాద్, యత్తపు యశ్వంత్ తదితరులు, సుమారుగా 380 మందికీ పైగా అయ్యప్పలు పాల్గొన్నారు.

## కులగణనకు సన్నద్ధం కావాలి

**నూతనకల్ అక్టోబర్ 30 నినాదం న్యూస్**
కులగణనకు సర్వం సిద్ధం కావాలని, నవంబర్ 6వ తేదీ నుంచి ప్రతి గ్రామంలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలని మండల కేంద్రంలోని బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ట్రైనింగ్ ఆఫ్ ట్రైలర్స్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. తాసిల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవో సునీత మాట్లాడుతూ.. శిక్షణలో భాగంగా ప్రజలకు అడగాల్సిన 50 ప్రశ్నలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఏయే ఇళ్లకు వెళ్లాలనే జాబితాలను ముందుగానే తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎన్యూమరేటర్ బ్లాకులుగా విభజించి అందులో 150 కుటుంబాలకు ఒక బ్లాక్ నెంబర్ కేటాయించామన్నారు. ఈ సర్వే ద్వారా ప్రతి పేదవాడికి ప్రభుత్వ పథకాలు చేరెందుకు దోహదపడతాయని ప్రజలు సామాజిక, ఆర్థిక, ఆదాయ, విద్య రాజకీయ స్థితిగతుల వివరాలన్నీ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈనాటి కార్యక్రమంలో విద్యాధికారి రాములు నాయక్, వ్యవసాయ అధికారి మురళి, ఎంపీఓ శశికళ, తదితర శాఖకు సంబంధించిన ఉద్యోగస్తులు పాల్గొన్నారు.



# బొగ్గు ఉత్పత్తిలో లక్ష్యాలను సాధిస్తాం

**మణుగూరు సింగరేణి జీఎం వెల్లడి**



జీఎం కార్యాలయంలో వివరాలను వెల్లడిస్తున్న జీఎం రామచంద్ర

**మణుగూరు అక్టోబర్ 30(నినాదం న్యూస్) :**
మణుగూరు సింగరేణి కాలనీ ఏరియాలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించి తీరుతామని మణుగూరు సింగరేణి కాలరీస్ సంస్థ జీఎం దుర్గం రామచందర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక జీఎం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణుగూరు సింగరేణి కాలరీస్లో అక్టోబర్ నెలలో బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 11 లక్షల 16 వేల 500 టన్నులు బొగ్గు ఉత్పత్తి లక్ష్యం గాను,9 లక్షల 30 వేల 351 టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని అన్నారు. అక్టోబర్ నెలలో బొగ్గు ఉత్పత్తి 83% బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని, ఏప్రిల్ ఫస్ట్ 2024 నుంచి అక్టోబర్ 30 వరకు ప్రోగ్రెస్ యు బొగ్గు ఉత్పత్తి 69 లక్షల 81 వేల టన్నుల లక్ష్యానికి గాను, 61 లక్షల 26 వేల 639 టన్నులు బొగ్గు ఉత్పత్తి సాధించిన జరిగిందని ఆయన తెలిపారు. దీన్ని బట్టి చూస్తే 88% బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందని ఆయన తెలిపారు. అక్టోబర్ నెలలో మణుగూరు ఏరియాలో 9, లక్షల 22 వేల 423 టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అలాగే ఏప్రిల్ ఫస్ట్ నుంచి అక్టోబర్ 30 వరకు ప్రోగ్రెస్ యుగా 61 లక్షల 19 వేల 97 టన్నుల బొగ్గు రవాణా చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అక్టోబర్ నెలలో ఓవర్ బర్డెన్ డిపార్ట్మెంటల్ ద్వారా 15 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను, 87% శాతంతో 13 లక్షల 5000 క్యూబిక్ మీటర్లు మట్టిని వెలికి తీయడం జరిగిందని పేర్కొన్నారు. అలాగే ఏప్రిల్ ఫస్ట్ నుంచి అక్టోబర్ 30 వరకు ప్రోగ్రెస్ యుగా 96 లక్షల క్యూబిక్ మీటర్ల లక్ష్యానికి గాను 71 లక్షల 44 వేల క్యూబిక్ మీటర్లు ఓబి మట్టి వెలికి తీయడం జరిగిందని జీఎం పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎస్ఓటిజియం శ్యామ్ సుందర్ జీఎం పర్సనల్ రమేష్ ఇన్చార్జి జనరల్ మేనేజర్ లక్ష్మీపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ చార్జీలపై వెనక్కి తగ్గిన రాష్ట్ర ప్రభుత్వం

- బిఆర్ఎస్ సంబరాలు
- అంతిమ విజయం తమదే అంటూ స్వీట్లు పంపిణీ







**మణుగూరు అక్టోబర్ 30(నినాదం న్యూస్) :**
రాష్ట్రంలో ఏడాది కాలం పాలన కూడా సాగించని కాంగ్రెస్ పార్టీ విద్యుత్ చార్జీలు పెంచేందుకు సిద్ధమై వెనక్కు తగ్గిందని. బుధవారం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ సంబరాల్లో మునిగింది. దీనిలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సంబరాలు చేసుకుంటూ అంతిమ విజయం తమదేనంటూ వాట్సప్ మెసేజ్ ద్వారా ట్వీట్ చేస్తూ స్వీట్లు పంపిణీ చేస్తూ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు బిఆర్ఎస్ కార్యాలయంలో కార్యకర్తలు నాయకులు ఒకరినొక స్వీట్లు తినిపించుకొని సంబరాలు చేసుకున్నారు. రేగా కాంతారావు మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ 6 గ్యారంటీలు పేరుతో ప్రజలను మోసం చేసిన సీఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కొత్త కొత్త హామీలతో ప్రజల్ని మరోసారి బురిడీ కొట్టించేందుకు సీఎం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఏడాది కాలం కూడా రాష్ట్రంలో పాలని సాగించలేని కాంగ్రెస్ పార్టీ విద్యుత్ చార్జీలను పెంచేందుకు సిద్ధమైందని అన్నారు. సీఎం నిర్ణయాన్ని వ్యతిరేకించిన కెసిఆర్ రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన నిర్మిస్తామని హెచ్చరికలు జారీ చేయడంతో, రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు ఆయన అన్నారు. విద్యుత్ చార్జీలు పెంపు అనే నిర్ణయంపై రాష్ట్రవ్యాప్తంగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించామని దీనితో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుమోటుగా వెనక్కి తీసుకున్నట్లు అని వెల్లడించారు. ఎన్నికల హామీల్లో భాగంగా వృద్ధాప్య పెన్షన్ 4000 ఇస్తామని, రైతుబంధు ఎకరానికి 15000 ఇస్తామని రుణమాఫీ రెండు లక్షలు రూపాయలు చేస్తామని నమ్మబలికారు అని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఏ ఒక్కటీ అమలు కాకపోగా ప్రతిపక్ష పార్టీలపై ఎదురుదాడి దిగుతూ భయాందోళన గురి చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ప్రతిపక్ష పార్టీలను భయభ్రాంతులకు గురి చేసేందుకు పోలీసులు ద్వారా దొంగ కేసులు పెట్టించేందుకు కూడా వెనకాడటం లేదని ఆయన ఆరోపించారు. పదేళ్ల కెసిఆర్ పరిపాలనపై లేని ఆరోపణలను చేస్తూ దర్యాప్తు సంస్థలు అంటూ కాళేశ్వరం అంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలలో జిల్లా వ్యాప్తంగా ప్రజలు వ్యతిరేకిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా మద్దతు కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లో రాష్ట్రంలో తీవ్ర వైఫల్యం చెందినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రశ్నించే ప్రతిపక్ష పార్టీలను గొంతు నొక్కుతూ తన వైఫల్యం మరుగున పడేస్తూ ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారని ఆయన అన్నారు. అనంతరం కెసిఆర్ వర్ధిల్లాలి కెసిఆర్ పాలన జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# మాదిగల ధర్మ యుద్ధ సదస్సును విజయవంతం చేయాలి



**కోదాడ, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**
మునగాల మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షత ఎంఎస్పి మునగాల మండల అధ్యక్షులు లంజపల్లి శ్రీను మాదిగ వహించగా ముఖ్య అతిథులుగా ఏపూరి రాజు మాదిగ , ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్చార్జి,ఎంఎస్పి జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి అంజయ్య మాదిగలు హాజరై మాట్లాడారు. సుప్రీంకోర్టు ఏడుగురు జడ్జిలు ఇచ్చిన తీర్పును స్వాగతించి నిండు అసెంబ్లీలో వర్గీకరణకు మేము కట్టుబడి ఉన్నామని అన్నారు. భారతదేశంలోనే మొట్టమొదటిగా వర్గీకరణ చేస్తానన్న సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమల్లోకి తీసుకురాకుండా ఉద్యోగాలు భర్తీ చేస్తూ మాదిగ జాతికి ద్రోహం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఎదుర్కోవడానికి మరో పోరాటానికి సిద్ధం కావాలన్నారు. మాదిగ, ఉపకులాల ప్రజలను గ్రామ, మండల స్థాయిలో ప్రజలను సిద్ధం చేయడం కోసం వచ్చే నెల 4న ఉమ్మడి నల్గొండ జిల్లా కేంద్ర ఫంక్షన్ హాల్లో నిర్వహించబోయే మాదిగల ధర్మ యుద్ధ మహసభకు ముఖ్య అతిథులుగా మహాజన నేత మందకృష్ణ మాదిగ విచ్చేస్తున్నందున పెద్ద ఎత్తున మండల పరిధి మరియు నియోజకవర్గం నుండి జాతి ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి పాతకోట్ల నాగరాజ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి కుక్కల కృష్ణ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు గుడిపాటి కనకయ్య మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ లంజపల్లి శ్రీను, ఎమ్మార్పీఎస్ మండల నాయకులు కత్తి శ్రీను, గ్రామశాఖ అధ్యక్షులు గుడిపాటి పెద్ద కనకయ్య, ఉపాధ్యక్షులు జిల్లేపల్లి శ్రీకాంత్ మాదిగ మునగాల పట్టణ నాయకులు వెంకన్న,లింగయ్య, సైదులు పాల్గొన్నారు.

# ధరలను అదుపు చేయడంలో కేంద్రం వైఫల్యం

**సిపిఎం జిల్లా కార్యదర్శి, ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి**



**చింతపల్లి, అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
నిత్యావసర సరుకుల ధరలు పెంచి పేదలపై విపరీతమైన భారం మోపుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం నాడు మండలంలోని వింజమూరు గ్రామంలో జరిగిన గ్రామ శాఖ మహాసభకు ముఖ్యఅతిథిగా హాజయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిత్యవసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయని, ప్రపంచ మార్కెట్లో డీజిల్, పెట్రోల్, గ్యాస్, క్రూడాయిల్ ధరలు తగ్గినా గాని దేశంలో తగ్గించడం లేదని ఆరోపించారు. నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేసే శ్రీశైలం సొరంగ మార్గం, డిండి ఎత్తిపోతల పథకాలకు బిఆర్ఎస్ ప్రభుత్వం తగినన్ని నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టుల పనులు నత్త నడకన సాగాయని ఆయన ఆరోపించారు. పెండింగ్ ప్రాజెక్టు పనులను కాంగ్రెసు ప్రభుత్వం యుద్ధ ప్రాతి పదికన పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ మహసభలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, జిల్లా కమిటీ సభ్యులు కంబాలపల్లి ఆనంద్, మండల కార్యదర్శి ఉడుగుండ్ల రాములు, గ్రామ కార్యదర్శి పోలే యాదయ్య, పెద్దయ్య, జంగయ్య, అమృత చారి, బ్రహ్మం, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రజలందరికీ దీపావళి శుభాకాంక్షలు

**- జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారంగుల అంజన్ గౌడ్**



**కోదాడ, అక్టోబర్ 31 (నినాదం న్యూస్):**
దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ టిడబ్ల్యూజేహెచ్ 143 యూనియన్ జిల్లా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కారంగుల అంజన్ గౌడ్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ టపాసుల వెలుగులతో, దీప కాంతుల జ్యోతులతో, సిరిసంపదల రాసులతో ఈ దీపావళి ప్రతి ఇంట సిరుల పంట కురిపించాలని అభిలాషించారు. కారు చీకట్లను దీపాల కాంతులు తరిమేసినట్లుగా ప్రజల కష్టాలను తరిమేయాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. జిల్లా ప్రజలు చీకట్లను చెరిపేసే దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు తేవాలని అన్నారు. ఒక్కొక్క దీపం వెలిగిస్తూ చీకట్లని పారద్రోలినట్లు.. మన జీవితాలలో మార్పు సాధించుకుంటూ బంగారు భవిష్యత్ను నిర్మించుకుందామని సూచించారు. తెలుగింటి లోగిళ్లన్నీ దీప కాంతులతో వెలుగులు నింపాలని తెలిపారు. ఈ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలని, టపాసులు కాల్చేటప్పుడు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలని ఆయన సూచించారు.

## సమగ్ర ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలి

**- తాసిల్దార్ రవికుమార్, ఎంపీడీవో ధన్ సింగ్**





**ఇల్లందు,అక్టోబర్30(నినాదం న్యూస్):**
సమగ్ర ఇంటింటి సర్వే పక్కాగా చేపట్టాలని తాసిల్దార్ రవికుమార్,ఎంపీడీవో ధన్ సింగ్ ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. బుధవారం పట్టణంలోని స్థానిక సిఈఆర్ క్లబ్ లో నిర్వహించి ఇల్లందు మున్సిపాలిటీ నుండి 81 మంది, మండలం నుంచి 139 మంది ఎన్యూమరేటర్లకు, 22 మంది సర్వీ సర్లకు శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రశ్నావళికి సంబంధించిన వివరాలను ఇంటింటికి వెళ్లి సేకరించాలని సూచించారు. శిక్షణ తీసుకున్న ఎన్యూమరేటర్లు నవంబర్ 6 నుంచి సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి,మున్సిపల్ డిఈ మురళి,ఏపీఎం దుర్గారావు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## అప్రమత్తతతో అగ్ని ప్రమాదాల నివారణ : ఎస్సై



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
అప్రమత్తతతో అగ్ని ప్రమాదాలను నివారించవచ్చని పట్టణ ఎస్సై ఏడుకొండలు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన క్రాకర్స్ దుకాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణదారులు అప్రమత్తంగా ఉండాలని,మంటలను నిలువరించే పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ప్రతి దుకాణం ముందు 1000 లీటర్లతో నీటి డ్రమ్ములు, ఇసుక, నీటి బకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. టపాసుల నిల్వకు పలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్ మేగ్య నాయక్, హెూంగార్డు రమేష్ తదితరులు ఉన్నారు.

## రిటైర్మెంట్ నూతన జీవితానికి పునాది

**- కార్యనిర్వాహణాధికారి కే మనోహర్**



**చౌటుప్పల్ అక్టోబర్ 30(నినాదం న్యూస్)**
రిటైర్మెంట్ నూతన జీవితానికి పునాది వంటిదని కార్యనిర్వాహణాధికారి కే మనోహర్ అన్నారు. బుధవారం నాడు చౌటుప్పల్ లోని ఇరిగేషన్ శాఖ సబ్ డివిజన్ 12లో ఆఫీస్ సబార్డినేట్ డి సుశీలకు ఉద్యోగ విరమణ కార్యక్రమంను తోటి సిబ్బంది స్థానిక వివిఆర్ రెస్టారెంట్లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్యనిర్వాహణాధికారి కె మనోహర్ హాజరై ప్రతి ఉద్యోగికి రిటైర్మెంట్ అనేది మరో జీవితమని,ఉద్యోగిగా సహచర ఉద్యోగస్తులతో గడిపిన కాలం ఎక్కువ కాలమని ఉద్యోగ విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో గడపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఇలు ఇందిరా ఉషశ్రీ,రాజవర్ధన్ రెడ్డి, ఏఇ రాజేశ్వరి, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, జూనియర్ అసిస్టెంట్ వినీత్,రహీం,రమ,ఆఫీస్ సభార్డినేట్స్ ఎండి లతీఫ్,శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దీపావళిని పురస్కరించుకుని జర్నలిస్టులకు స్వీట్ల పంపిణీ

**- మండల ప్రజలు పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి**
**- అనంతగిరి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడిమెట్ల రామకృష్ణ**



**కోదాడ (అనంతగిరి), అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**
దీపావళి పండుగ పర్వదినాన్ని పురస్కరించుకుని అనంతగిరి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు గుడిమెట్ల రామకృష్ణ తోటి జర్నలిస్టు మిత్రులకు స్వీట్ బాక్సు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బుధవారం రామకృష్ణ మాట్లాడుతూ.... అనంతగిరి మండల ప్రజలందరూ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. నిత్యం ప్రజా సమస్యల వెలిగెత్తి చాటే జర్నలిస్టుల మిత్రులకు ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడుతానని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. అనంతరం మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శిగా ఇరుగు వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.... నాపై నమ్మకంతో నాకు అవకాశం కల్పించిన జర్నలిస్టులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు కొలిచలం శ్రీనివాస్, గౌరవ సలహాదారులు బుర్రా సత్యనారాయణ గౌడ్, సీనియర్ జర్నలిస్టులు కొలిచలం నరేష్, గద్దె రాంబాబు, బెల్లంకొండ సతీష్, శ్రీరామ్ రవి, కొలిచలం హరిబాబు,ఉన్నారు.

# ఒత్తిడిని అధిగమించి పోలీసులు విధులు నిర్వహించాలి

**- పోలీసు అధికారుల నెలవారీ సమీక్ష సమావేశంలో ఎస్పీ**



**సూర్యాపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
పోలీసులు ఒత్తిడిని అధిగమించి విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీసు అధికారుల నెలవారి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒత్తిడిని అధిగమించడానికి రోజువారీ జీవితంలో కొద్ది సమయాన్ని యోగ, మెడిటేషన్ లకు కేటాయించాలని సూచించారు. పని ఒత్తిడి నుండి ఉపశమనం పొందడం కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ మెడిటేషన్ ఆధ్వర్యంలో సిబ్బంది ఒత్తిడిని అధిగమించడంపై శిక్షణను నిర్వహించడంతో పాటు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పోలీసు స్మారక 2కె పరుగులో ప్రతిభ కనబరిచిన పట్టణానికి చెందిన ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులు జి నవీన్ ,తరుణ్, హెడ్ కానిస్టేబుల్ సతీష్ లకు ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, జనార్దన్ రెడ్డి, డిఎస్పి శ్రీధర్ రెడ్డి, డిసిఆర్‌బిడి ఎస్‌పి మట్టయ్య, శ్రీనివాసరావు, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

# సమగ్ర ఇంటింటి సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

**- మండల పరిషత్ ప్రత్యేక అధికారి ద్వారక్**



**చింతపల్లి, అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
సమగ్ర ఇంటింటి కుటుంబ సభ్యుల సర్వేలు సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని మండల పరిషత్ ప్రత్యేక అధికారి ద్వారక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు ఇంటింటి సర్వేపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కుటుంబ సర్వే నవంబర్ 6 నుండి 13వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు గ్రామాలలో అధికారులకు అందుబాటులో ఉండి కుటుంబ సభ్యుల వివరాలను అందజేయాలని కోరారు. అధికారులు కూడా ప్రజలు ఇంటిదగ్గర అందుబాటులో ఉన్నప్పుడే సర్వేను సమర్థవంతంగా నిర్వహించడానికి కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుజాత, తాసిల్దార్ రమాకాంత్ శర్మ, ఎంపీ ఓ మల్లికార్జున్ రెడ్డి,ఎంపీఎస్ఓ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

# నాగరాజుకి సింగరేణి అధికారుల చేయూత



**సతుపల్లి, అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
సత్తుపల్లి సింగరేణి అతిథి గృహం నందు తొమ్మిది సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న నాగరాజు అన్నవాహికకు సంబంధించి గాలి బ్లాడెర్‌లో రాళ్ళ సమస్యలో భాదపతడున్నాడు. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ శాలెంరాజుకి నాగరాజు పరిస్థితిని ఇక్కడి అధికారులు తెలియజేశారు. సత్తుపల్లి సింగరేణి అధికారులు అందరు తమ వంతుగా రూ 47 వేలు సేకరించి బుధవారం నాడు జీ.ఎం. శాలెం రాజు చేతుల మీదిగా నాగరాజుకి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో పీ.ఓ కిష్టారం ఓ.సి నరసింహారావు, పీ.ఓ జె.వి.ఆర్. ఓ.సి ప్రహల్లాద్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ చేయూత

**- రూ.1లక్ష అందజేత**

**కాటారం, అక్టోబర్ 30, నినాదం న్యూస్**
కాటారం మండలంలో నేరాల నియంత్రణ కోసం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాల ఏర్పాటుకు కాటారం మండల ఫెర్టిలైజర్స్ అండ్ ఫెస్టిసైడ్స్ సీడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేరాల నియంత్రణ కోసం మేము సైతం అంటూ రూ.1లక్షను కాటారం సిఐ ఈ నాగార్జున రావుకు స్వచ్ఛంధంగా కాటారం ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ సభ్యులు అందజేసినట్లు బుధవారం తెలిపారు. కాటారం మండల కేంద్రంలోని ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ధృడ సంకల్పంతో ముందుకు వెళుతున్న తరుణంలో కాటారం సిఐ నాగార్జున రావు, కాటారం ఎస్సై మ్యాక అభినవ్ ఆధ్వర్యంలో అసోసియేషన్ సభ్యులు లక్ష నగదును అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వారితో పాటు ఫెర్టిలైజర్ అండ్ సీడ్స్ అసోసియేషన్ అధ్యక్షులు కవ్వాల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు కొత్త రాజేందర్, అల్లాడి చంద్రమౌళి, కోశాధికారి బచ్చు ప్రభాకర్, ప్రచార కార్యదర్శి నిడిగొండ చెన్నకేశవ్ తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం వాహనాలను తనిఖీ చేయాలి

**- సరైన పత్రాలు లేకుంటే వాహనాలు సీజ్ చేయాలి**
**- పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి.రాంపతి**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో(నినాదం):**
అంతరాష్ట్ర చెక్ పోస్టు ద్వారా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ధాన్యం వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ బి. రాంపతి సూచించారు. బుధవారం ములుగు జిల్లా వాజేడు మండలం పేరూరు గ్రామంలోని అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్ పోస్టును వాజేడు మండల తాహశీల్దార్‌తో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా చెక్ పోస్ట్ లో రెవెన్యూ వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖల సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి వరి దాన్యం తరలించే వాహనాలను తనిఖీ చేయాలని సరైన పత్రాలు ఉంటేనే అనుమతించాలని లేనిచో ఆ వాహనాలను సీజ్ చేసి వెంటనేపై అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే తెలంగాణ రాష్ట్రం నుంచి ఇతర రాష్ట్రాలకు వెళ్లే సీఎంఆర్ బియ్యం, పిడిఎస్ బియ్యం వాహనాలను తనిఖీ చేయాలన్నారు. పీడీఎస్ బియ్యం రాకపోకల వాహనాలను వెంటనే సీజ్ చేయాలనీ ఆదేశించారు. అదేవిధంగా చెక్ పోస్ట్‌లో వాహనాలు రాకపోకల సమాచారాన్ని ఒక రిజిస్టర్‌లో నమోదు చేసి జిల్లా పౌరసరఫరాల అధికారికి నిరంతరం సమాచారం ఇవ్వాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు.

# విద్యుత్ చార్జీల పెంపు విరమణ బీఆర్ఎస్ విజయం



**కారేపల్లి అక్టోబర్ 30 నినాదం న్యూస్**
రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణ బీఆర్ఎస్ విజయమని ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ముత్యాల సత్యనారాయణ, మాజీ వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావులు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ఉపసంహరణ బీఆర్ఎస్ విజయంగా అభివర్ణిస్తూ ఆ పార్టీ ఆధ్వర్యంలో కారేపల్లిలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చిన ఫలితంగా సామాన్యులపై విద్యుత్ భారం లేకుండా అయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలలో భ్రమలు తొలిగాయని, 100 రోజులలోనే ప్రజలలో తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. రైతు బంధు, రుణమాఫీ, పెన్షన్ల పెంపు, మహిళలకు రూ.2500 ఇవ్వటంలో కాంగ్రెస్ ప్రభుత్వం చతికిల పడిరదని ఎద్దేవా చేశారు. ఖరీఫ్ సీజన్ ముగిసి, రబీ సీజన్ ప్రారంభం కావస్తున్న రైతు బంధు వేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామపంచాయతీలు నిధులు లేక పనులు చేయక మురికి కూపాలుగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్‌కు తగిన బుద్ది చెప్పాలని ప్రజలను కోరారు. ఈకార్యక్రమంలో సోసైటీ ఉపాధ్యక్షులు దారావత్ మంగీలాల్, నాయకులు బానోత్ రాందాస్, జూపల్లి రాము, సిద్దంశెట్టి చిన్న నాగయ్య, బర్మావత్ రాందాస్, జాల సాంభ, పాడిత్యా. గుగులోత్ కుమార్, సురభి సాగర్, గంగరబోయిన సత్యనారాయణ, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, నవీన్, పోగాకు సాయి, అజ్మీక సుక్య తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**కారేపల్లి అక్టోబర్ 30 నినాదం న్యూస్**
కారేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఐకేపీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్పెషల్ ఆఫీసర్ నవీన్‌బాబు, ఎంపీడీవో సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్‌లు ప్రారంభించారు. ఈసందర్బంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ కారేపల్లి మండలంలో ఐకేపీ, సోసైటీల ఆధ్వర్యంలో ఐదు సన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వ్యవసాయశాఖ అధికారులు దృవీకరణతోనే తీసుకరావాలని కోరారు. సన్న రకం ధాన్యంకు ప్రభుత్వం మద్దతు ధర రూ.2320 తో పాటు అదనంగా బోనస్ రూ.500 ప్రభుత్వం ఇస్తుందన్నారు. రైతులు ధాన్యంను నాణ్యతతో కేంద్రానికి తీసుకవచ్చి బోనస్‌ను పొందాలని కోరారు. ఈకార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు, వజ్జా రామరావు, తలారి దేవప్రకాష్, కాంగ్రెస్ నాయకులు పగడాల మంజుల, ఇమ్మడి తిరుపతిరావు, మండల సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, నాయిని నాగమణి, సీసీలు చ్కైతన్య, తుమ్మలపల్లి అనిల్, పగడాల పుష్పకుమారి, గౌసియాబేదం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పని చేయాలి



**- వాహన మరమ్మతులు, చెత్త సేకరణలో వేగం పెంచాలి**
**- శానిటరీ ఇన్స్పెక్టర్లు ఇంజనీరింగ్ అధికారులతో మేయర్**

**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
ఇంజనీరింగ్ శానిటేషన్ విభాగాలు సమన్వయంతో పని చేయాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మేయర్ పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా చెత్త సేకరణ, వాహనాలకు మరమ్మతులు, వెంటనే పూర్తి చేయించి చెత్త సేకరణలో జాప్యాన్ని నివారించాలని మేయర్ సూచించారు. మరమ్మతులు వాహనాల సమాచారాన్ని ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకొని, అన్ని వాహనాలకు వారం లోగా మరమ్మతులు పూర్తి చేసి అందుబాటులో ఉండేలా చూడాలని, నగరం లోని ప్రతి ఇంటి నుండి తడి, పొడి 100% చెత్త సేకరణ జరిగేలా చూడాలని ఆదేశించారు. ప్రతి డివిజన్‌లో గార్బేజ్ వాల్నరబుల్ పాయింట్స్ గుర్తించాలని, అందుకు అనుగుణంగా కాంపాక్ట్ బిన్‌లను ఏర్పాటు చేసుకొని సిద్ధంగా ఉండాలని, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. ప్లాస్టిక్ మహమ్మారిని ఏర్పాటు చేసిన ఎన్ఫోర్స్మెంట్ టీంలు క్రియాశీలింగా పనిచేయాలని ఆదేశించారు. ఎస్ ఈ రాజయ్య, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రాజేష్, ఈఈ మహేందర్, డిఈ శివానంద్, సానిటరీ సూపర్వైజర్లు నరేందర్, భాస్కర్ పాల్గొన్నారు.

# సిసి రెడ్డిలో రిటైర్డ్ ఉద్యోగికి ఘన సన్మానం



**కోదాడ, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**
సిసి రెడ్డి విద్యా నిలయంలో ఉద్యోగ విరమణ పొందిన మంచాల మేరీ హెలెన్ విక్టర్ కుమార్‌కు బుధవారం ఘన సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు తోటి ఉపాధ్యాయులు ఆమెను ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయురాలుగా ఆమె చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి సైతం ఆమె ఎనలేని కృషి చేశారని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. రిటైర్డ్ అవుతున్న ఉపాధ్యాయులు పుట్టిన రోజు బుధవారం కావడంతో పలువురు ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సలీం షరీఫ్ పాఠశాల హెడ్మాస్టర్ సిస్టర్ ఆన్ జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు లిటిల్ ఫ్లవర్ షమ్మీ బేగం, పద్మ, అరుణ సంధ్యారాణి, స్వర్ణ, శిరీష, శిల్ప, తబిత, జయలలిత, కవిత హబీబునిస, నవీన్, గోపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సమగ్ర కుటుంబ సర్వేపై అధికారులకు శిక్షణ




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో(నినాదం):**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ 1 నుండి చేపట్టే సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో భాగంగా ములుగు మండలం పరిధిలో విధులు నిర్వహించే ఎన్యూమరేటర్స్, సూపర్‌వైజర్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్యూమరేటర్‌లుగా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్స్ ఆశా కార్యకర్తలు నియమించారు. అయితే సర్వే రెండు విడతలుగా చేయడం జరుగుతుందని, మొదట నవంబర్ 1 నుండి 3 వరకు ఎన్యూమరేటర్ బ్లాక్‌లో ఉండే ఇళ్ల జాబితాను తయారు చేయడం జరుగుతుందని, రెండవ విడతలో 6 నుండి 18 వరకు వాస్తవ కుటుంబ సర్వే చేపట్టడం జరుగుతుందని తహశీల్దార్ విజయబాస్కర్, ఎంపీడీఓ రామకృష్ణ తెలిపారు. ఈ సర్వే ద్వారా ములుగు మండలం లోని అన్ని కుటుంబాల సామాజిక,ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులంనకు సంబంధించిన సమాచారం సేకరించి కంప్యూటీకరణ చేపట్టుటకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మాస్టర్ ట్రెయినర్స్ ములుగు మండల పంచా యితీ అధికారి ఎండి రహీ ముద్దీన్, ప్రభుత్వ ఉపాద్యాయులు హమీద్, ఇతర శిక్షకులు, సూపర్ వైజర్లు, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు,పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడీ టీచర్లు, ఐకేపీ వీఓఏలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



# అజ్ఞానాంధకారాలు తొలగినప్పుడే జ్ఞాన జ్యోతులు ప్రకాశిస్తాయి



**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
మనిషిలో అలుముకున్న అజ్ఞా నాంధకారాలు తొలగినప్పుడే జ్ఞాన జ్యోతులు ప్రకాశిస్తా యని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. దీపావళి పండుగ (అక్టోబర్ 31) ను పురస్కరిం చుకుని మంత్రి సురేఖ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. దీపావళి పండుగ భారతీయ సంస్కృతికి ప్రతిబింబమని, హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగని మంత్రి అన్నారు. చీకటిని వెలుగు పారద్రోలినట్టే ఎన్నటికైనా అధర్మంపై ధర్మం విజయం సాధిస్తుందని దీపావళి పండుగ తెలియజేస్తుందని మంత్రి అన్నారు. దీపావళి రోజున వెలిగించే దీపాలు మనిషిలో జ్ఞానచైతన్యాన్ని పెంపొందించాలని మంత్రి ఆకాంక్షించారు. వెలుగులు పంచే దీపావళి పండుగను పర్యావరణహితంగా జరుపుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బాణసంచా కాల్చే సమయంలో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. దీపావళి పండుగ ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలను, సకల శుభాలను తీసుకురావాలని మంత్రి ప్రార్థించారు. సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల జీవితాల్లో వెలుగులు నింపేందుకు నిష్టతో అడుగులు వేస్తున్నదని మంత్రి స్పష్టం చేశారు.

# ట్రాఫిక్ యూనిఫారం అందజేసిన పోలీస్ కమిషనర్



**వరంగల్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 (నినాదం న్యూస్)**
వరంగల్ ట్రాఫిక్ హెూంగార్డ్ సిబ్బంది వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ జా చేతుల మీదుగా బుధవారం ట్రాఫిక్ యూనిఫారాన్ని అందజేసారు. వరంగల్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ అధ్వర్యంలో పోలీస్ కమిషనర్ కార్యాలయములో ఏర్పాటు చేసిన కార్యాక్రమములో వరంగల్ ట్రాఫిక్‌విభాగంలో నిరంతరం ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న హెూంగార్డ్స్ సిబ్బందికి వరంగల్ పోలీస్ కమిషనర్ నూతన ట్రాఫిక్ యూనిఫారాన్ని అందజేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ సిబ్బంది యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో పాటు, హెూంగార్డ్స్ పనితీరు అభినందనీయమని, నగరంలో ట్రాఫిక్ నియంత్రణలో ట్రాఫిక్ హెూంగార్డ్స్ భూమిక కీలకమని, ట్రాఫిక్, సమస్యలతో పాటు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ట్రాఫిక్ హెూంగార్డ్స్ మరింత శ్రమించాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమములో ట్రాఫిక్ ఏసిపి సత్యనారయణ పాల్గొన్నారు.

# ఐక్యతభావంకు ఉద్యోగుల వనమహోత్సవం



**కారేపల్లి అక్టోబర్ 30 నినాదం న్యూస్**
ప్రభుత్వం అన్ని శాఖల ఉద్యోగుల మధ్య ఐక్యత భావం నెలకొల్పటానికి ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో నవంబర్ 3న ఖమ్మం చెరుకూరి వారి తోటలో వనమహోత్సవం నిర్వహించటం జరుగుతుందని పంచాయతీ రాజ్ ఉద్యోగుల సంఘం జిల్లా బాధ్యులు ఎంపీవో మల్లెల రవీంద్రప్రసాద్ అన్నారు. బుధవారం కారేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ఎస్.సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్‌తో కలిసి వనమహోత్సవ వాల్‌పోస్టర్‌ను అవిష్కరించారు. ఈసందర్బంగా మల్లెల రవీంద్రప్రసాద్ మాట్లాడుతూ జేఏసీ ఆధ్వర్యంల జరిగే వనమహోత్సవానికి ఉద్యోగుల కుటుంబాలతో పాటు జర్నలిస్టు కుటుంబాలు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇంటింటా సమగ్ర సర్వే పారదర్శకంగా చేపట్టాలి



**మంగపేట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్ర సర్వేను పారదర్శకంగా చేపట్టాలని మండల స్పెషల్ ఆఫీసర్ తులా రవి సూచించారు. మంగపేట రైతు వేదికలో బుధవారం నిర్వహించిన ట్రైనింగ్ ప్రోగ్రాంలో ఆయన మాట్లాడారు. అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, ప్రభుత్వ టీచర్లు మండలంలోని గ్రామాల్లో ప్రతి ఇంట సర్వే నిర్వహించి నివేదికలు సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బద్రు, ఎమ్మార్వో రవీంద్ర, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీ సభ్యులను అభినందించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్, పద్మనగర్ ఫేస్ – 1 కాలనీ సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కాలనీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి శాలువా కప్పి సత్కరించి సంక్షేమ సంఘాలతోనే కాలనీల అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. కాలనీలో ఎటువంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, కాలనీ అభివృద్ధికి తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్తిరెడ్డి, దయాకర్, ముత్యాలు, వెంకటేశ్వరరావు, శివ నాగిరెడ్డి, ఖాసీం పీరా, జై సింహా రెడ్డి ,శ్రీకాంత్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, ప్రసాద్, అరవింద్, సత్యం, క్రిష్ణా రావ్, వేణుమోహన్, సుబ్బారెడ్డి, రంగసుబ్బయ్య, భాస్కర్ రెడ్డి, రమణారెడ్డి, సందీప్ రెడ్డి, ఠాకూర్ వినోద్ సింగ్, సుబ్బారావు, సురేందర్ రెడ్డి, సంగమేశ్వర రావు, శ్రీనివాస్, ప్రభంజన్ రెడ్డి, నరసింహారెడ్డి, భాస్కరాచారి, చంద్రశేఖర రావు, నాగరాజు, రాజేష్, వినోద్ రాజు, సుధాకర్ మరియు సీనియర్ కాంగ్రెస్ నాయకులు గడ్డం రాజేందర్ రెడ్డి, సిద్దనోళ్ల సంజీవ్ రెడ్డి, హమ్మి రెడ్డి, మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

- విజేతలను అభినందించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య




**చేవెళ్ల అక్టోబర్ 30(నినాదం న్యూస్):** విద్యార్థులు చదువుతోపాటు క్రీడలలో కూడా రాణిస్తే జీవితంలో అనతి కాలంలోనే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని ఎం జె పి టి మియాపూర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో జిల్లా స్థాయిలో అండర్ 17, 14 విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ఎం జె పి టి విద్యార్థినిలు విజయాలు సాధించడం పట్ల తన ఆనందాన్ని హర్షన్ని వ్యక్తం చేశారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన విజేతల అభినందన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... విద్యార్థినిలు చదువుతోపాటు క్రీడలు కూడా అంతే అవసరమని అన్నారు. విద్యార్థినిలకు క్రీడల్లో ప్రోత్సహిస్తున్న ప్రిన్సిపల్ నరసింహను అభినందించి సన్మానించారు. భవిష్యత్తులో విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ కు సూచించారు. విజేతలను సన్మానించి అభినందించి తన దీవెనలు ఎల్లవేళలా విద్యార్థులపై ఉంటుందని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పెంటయ్య గౌడ్, వైస్ చైర్మన్ రాములు, డిసిసి ఉపాధ్యక్షుడు ఆగి రెడ్డి, మాజీ ఎంపిటిసి గుండాల రాములు, చేవెళ్ల మాజీ ఉపసర్పంచ్ టేకులపల్లి శ్రీనివాస్ యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మల్లేష్, ఏటీపీ నీతా, సీనియర్ టీచర్ సుభాషిని, డిప్యూటీ వార్డెన్ ఫాతిమా, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజలపై విద్యుత్ ఛార్జీల బారాన్ని తప్పించిన బీఆర్ఎస్

- కేసీఆర్ చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పాలాభిషేకం



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నినాదం న్యూస్:** తెలంగాణ రాష్ట్ర ప్రజలపై 18,500/- కోట్ల విద్యుత్ చార్జీల భారం పడకుండా బిఆర్ఎస్ పార్టీ తరపున పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా వ్యతిరేకించి అదనపు విద్యుత్ ఛార్జిల పెంపు ప్రతిపాదనలను ఈఆర్సీ ఆమోదించకుండా కృషి చేసినందుకు గాను ఈరోజు వికారాబాద్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసంలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ప్రజల తరపున కెసిఆర్, కెటీఆర్ కు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి, కౌన్సిలర్ రామస్వామి, రాములు, ఆనంత్ రెడ్డి, గోపాల్, మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్, మండల పార్టీ అధ్యక్షులు కమాల్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మేక చంద్రశేఖర్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ పాండు, నాయకులు దేవదాస్, శివ కుమార్, పడిగళ్ల అశోక్, రమణ, మాజీ సర్పంచ్ జైపాల్ రెడ్డి, గౌస్, అనంతయ్య, మల్లేశం, గాండ్ల మల్లికార్జున్, ధ్యాచారం మల్లికార్జున్, ఫరీద్, మైపాల్ రెడ్డి, సత్యయ్య గౌడ్, మూర్తుజా అలీ, సోషల్ మీడియా అధ్యక్షులు మల్లేష్, అనిల్, ప్రవీణ్, కాషాయ్య, బాలు తదితరులు పాల్గొన్నారు.

## అన్ని వర్గాల అభివృద్ధి సీఎంతోనే సాధ్యం



**మహేశ్వరం, అక్టోబర్ 30 ( నినాదం న్యూస్)** : అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని టి పి సి సి ప్రధాన కార్యదర్శి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్ పేట్ లోని 20 డివిజన్ పరిధిలోని ఉద్యోగ్ నగర్ కాలనిలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం పనులను పరిశీలించిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ చిగిరింత పారిజాత నర్సింహా రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిరుపేద, అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తోనే సాధ్యమని పేర్కొన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో మేముంటా మన్ను భరోసా కల్పించారు ఈ కమ్యూనిటీ హాల్ ను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలలో అందుబాటులో తేవాలని, కాంట్రాక్టర్లకు నాణ్యత ప్రమాణాలు పాటించాలని మేయర్ సూచించారు. ప్రజల సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ప్రజలకు సూచించారు గత ప్రభుత్వం చేయలేని పనులను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేసి తెలంగాణ రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలవాలన్న దే సీఎం రేవంత్ రెడ్డి తోనే సాధ్యమన్నారు. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చెంద లేక ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉన్నది సామెత గా గత ప్రభుత్వం పూర్తి చేయలేదని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పెద్దబావి సుదర్శన్ రెడ్డి, పాండు నాయక్, నయనా చారి, కాలనీ వాసులు, అభిమానులు పెద్దలు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయనిధి

- లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల అక్టోబర్30 (నినాదం న్యూస్):-** పేద ప్రజల ఆరోగ్యానికి భరోసా సీఎం సహాయనిధి అని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు స్థానిక నాయకులతో కలిసి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చేవెళ్ల నియోజవర్గంలోని వివిధ మండలాలలోని 97 మంది లబ్ధిదారులకు 39 లక్షల 47 వేల రూపాయల సీఎం సహాయ నిధి చెక్కులను అందజేశారు. పేద మధ్యతరగతి ప్రజలకు అత్యవసరసమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ వరంలా ఉపయోగపడుతుందని పేద ప్రజల ఆరోగ్యానికి తెలంగాణ ప్రభుత్వం భరోసా కల్పిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ దేవర వెంకటరెడ్డి, ఏఎంసీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్ డిసిసి ఉపాధ్యక్షులు ఆగిరెడ్డి ఏఎంసి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బేగరి రాములు సీనియర్ నాయకులు మార్పల్లి కృష్ణారెడ్డి మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి గుండాల రాములు వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐ రజితకు ఘన సన్మానం



**మహేశ్వరం, అక్టోబర్ 30 ( నినాదం న్యూస్) :** అమ్రాబాద్ ఎస్ ఐ రజిత నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆమెను నాగర్ కర్నూల్ జిల్లా ఎం ఎస్ యు ఐ అధ్యక్షులు రామావత్ సంతోష్, తాలూకా అధ్యక్షులు లడ్డు యాదవ్, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి హన్మంతు నాయక్, అమ్రాబాద్ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎండి ఖైరత్ మంగళవారం స్థానిక నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి ఆమెకు అడ్వాన్స్ గా దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ, మిఠాయిలు పంచుతూ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భముగా ఎస్ ఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పర్యవేక్షణలో ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు. నేరాల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బందులు పలువురు సభ్యులు అభిమానులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజా సమస్యలపై పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్

- విద్యుత్ ఛార్జీల పెంపును ఈఆర్సీ తిరస్కరించడంలో కీలకపాత్ర పోషించిన బీఆర్ఎస్
- గండిమైసమ్మలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో విజయోత్సవ సంబురాలు





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్ ):**విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనను విద్యుత్ నియంత్రణ మండలి (ఈఆర్సీ) తిరస్కరించినందుకు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు ఎమ్మెల్యే కెపి.వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆదేశాల తో గండి మైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈరోజు నిర్వహించిన విజయోత్సవ సంబరాలలో ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి మిఠాయిలను తినిపించుకుంటూ సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ నిర్ణయాలు పేద ప్రజలను మరింత పేదరికంలోకి నెట్టకుండా ఉండాలే కానీ ప్రజలు ఎటు పోతే మాకేంటనేలా ఉండకూడదన్నారు. విద్యుత్ చార్జీల పెంపు ప్రతిపాదనల్లో భాగంగా దాదాపు 18,500 కోట్ల భారాన్ని ప్రజలపై మోపమంటూ విద్యుత్ నియంత్రణ మండలికి సిఫారసు చేయడం హేయమైన చర్య అని అన్నారు. కానీ బిఆర్ఎస్ పార్టీ ఈ సిఫారసులను ప్రజాభిప్రాయ సేకరణలో తీవ్రంగా వ్యతిరేకించిందని, సామాన్యుడిపై మోయలేని భారాన్ని మోపేందుకు రాష్ట్ర ప్రభుత్వ సిఫారసులను బిజెపి పార్టీ ఏ రోజు కూడా వ్యతిరేకించలేదని, పేద ప్రజల పక్షాన పోరాడే ఏకైక పార్టీ బిఆర్ఎస్ మాత్రమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కౌన్సిలర్లు, పాక్స్ చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళా నాయకురాలు, బిఆర్ఎస్ అనుబంధ సంఘాల సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే దిశగా సమగ్ర ఇంటింటి సర్వే

- జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నినాదం న్యూస్ : ప్రభుత్వ పథకాలు పేద ప్రజలకు అందే దిశగా సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సుధీర్ తెలిపారు, బుధవారం సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై కలెక్టరేట్ సమావేశ మందిరంలో వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని మెప్మా సిబ్బంది, ఆశ వర్కర్లు, రిసోర్స్ పర్సన్, అంగన్వాడి టీచర్లకు మాస్టర్ ట్రైనర్ల ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ ఎన్యుమరేటర్లకు సర్వేలో చేపట్టాల్సిన విధి విధానాలపై మార్గదర్శకాలను సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. సర్వే చేపట్టే క్రమంలో జ్ఞానము, నైపుణ్యంతో పాటు తమ ప్రవర్తన వైఖరి సున్నితంగా ఉండవలసిన అవసరం ఉందని ఆయన హితవు పలికారు. ప్రజల జీవితాలకు సంబంధించిన విషయం కాబట్టి ప్రొఫార్మాను క్షుణ్ణంగా చదివి ఎలాంటి తప్పులు లేకుండా వివరాలను పొందుపరచాలని ఆయన సూచించారు. ఏమైనా సందేహాలు ఉంటే నివృత్తి చేసుకొని ఇచ్చిన ఫారాల్లో సమాచారాన్ని క్రోడీకరించాలని ఆయన తెలిపారు. తొందరపాటుతో కాకుండా అప్రమత్తంగా వుంటూ ఓపిగ్గా, మన బాధ్యతగా విధులను నిర్వహించాలని ఆయన సూచించారు. శిక్షణ కార్యక్రమంలో సిపిఓ అశోక్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, మెప్మా పీడీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## షటిల్ బ్యాట్మెంటన్‌లో సత్తా చాటిన విద్యార్థి భాగ్యరథి



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** రంగారెడ్డి జిల్లా సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో తెలంగాణ రాష్ట్రంలోని జిల్లా స్థాయిలో జరిగిన 68వ షటిల్ బ్యాట్మెంటన్ పోటీల్లో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ భాగ్యరధి జూనియర్ కళాశాల ఎం.పీ.సీ విద్యార్థి టీ .లక్ష్మి శ్వేతన్ రాష్ట్రస్థాయి పోటీకి అర్హత సాధించాడు. ఈ పోటీల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయికి అర్హత సాధించిన విద్యార్థిని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.వెంకట్ రెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల్లో కూడా రాణించాలని, అందుకు కావలసిన ప్రోత్సాహమును తమ కళాశాల అందిస్తుందన్నారు. మా కళాశాల నుంచి నేషనల్ ప్లేయర్ ఈషా అనే విద్యార్థి, ప్రస్తుతం లక్ష్మీ శ్వేత శ్వేతన్ అనే ఇరువురు విద్యార్థులు బ్యాట్మెంటన్ లో రాణిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు సి. హెచ్ గోవిందరెడ్డి, కే.రామకృష్ణ ,జి.రమేష్ బాబు , జై శంకర్ గౌడ్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## ఏబీవీపీ పోరాటానికి బీజేపీ మద్దతు

- డిగ్రీ కళాశాలకు పక్కా భవనం నిర్మించాలని డిమాండ్



**వికారాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నినాదం న్యూస్:** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్క భవన్ ఏర్పాటు చేయాలనీ రెండవ రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులకు మద్దతు తెలిపి, విద్యా కేంద్రంగా పిలవబడే వికారాబాద్ లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఇప్పట వరకు పక్కా భవనం నిర్మించకపోవడంతో పేద విద్యార్థులు చాలా నష్టపోతున్నారని, ప్రభుత్వ యంత్రాంగం వెంటనే స్పందించి పక్క భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలనీ విద్యార్థి సమస్యల పట్ల పోరాడుతున్న ఏబీవీపీ విద్యార్థి సంఘానికి సంపూర్ణ మద్దతు తెలిపిన, వికారాబాద్ జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షులు కోకట్ మాధవ రెడ్డి, జిల్లా ధార్మిక సెల్ ఇంచార్జ్ డాక్టర్ కొప్పుల రాజశేఖర్, వికారాబాద్ టౌన్ ప్రెసిడెంట్ నరోత్తం రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు వివేకానంద రెడ్డి, బిజెపి సీనియర్ నాయకులు కెపి రాజు, ధార్మిక్ సెల్ కన్వీనర్ మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బండ్లగుడ ట్రాఫిక్ పోలీసుల ప్రత్యేక డ్రైవ్



**మహేశ్వరం, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** చంద్రయాన్ గుట్ట డివిజన్ పరిధిలో బండ్ల గుడ ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించారు. చంద్రయాన్ గుట్ట నియోజకవర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ సృష్టిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డిసిపి వెంకటేశ్వర్లు, ఏసిపి లక్ష్మణ్, సిఐ శ్రీను నాయక్, ఎస్సై రాంబాబు, అక్బర్ షరీఫ్ ఆదేశం అనుసారంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆర్ ఎస్ ఐ యన్. రాఘవేందర్ హెచ్చరించారు. ఈ డ్రైవ్ లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల, 65 ఫోర్ వీలర్, 45 ద్విచక్ర వాహనాలు,40 ఆటోల పై ఈ చలా ను మొత్తం 150 విధించినట్లు తెలిపారు. రోడ్డుపైనే ఇరువైపుల వాహనాలను నిలిపి ట్రాఫిక్ ఇబ్బందులను సృష్టిస్తున్నారని, అదే విధంగా ఫుట్ పాత్ వారికి జరిమానా విధించింది కేసులు నమోదు చేశారు. పండ్ల బండ్లు వద్ద ట్రాఫిక్ ఇబ్బందుల ఫిర్యాదులు వస్తున్నాయని దీనిపై కూడ ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహిస్తామని పేర్కొన్నారు. రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ లో పది కేసులు నమోదు అయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... లైసెన్సు, హెల్మెంట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రహదారిపై వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని సూచించారు. అలాగే వాహనాలకు సంబంధించి ఇన్సూరెన్స్ ప్రతి సంవత్సరం విధిగా రెన్యువల్ చేయించుకోవాలన్నారు. ప్రయాణం చేసేటప్పుడు అనుకోకుండా ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఇన్సూరెన్స్ లేని సమక్షంలో వారికి ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం వచ్చే అవకాశం ఉండదని అన్నారు ముఖ్యంగా మద్యం సేవించి సెల్ఫోన్ మాట్లాడుతూ.. డ్రైవింగ్ ఎట్టి పరిస్థితులు చేయకూడదని అన్నారు. ఉద్దేశపూర్వకంగా నెంబర్ ప్లేట్ కనిపిం చకుండా చేసినట్లయితే వాహన యజమాని పై మోటర్ వెహికల్ యాక్ట్ 129 (2) రూ. 2 వేలు వరకు జరిమానా లేదా నెల రోజులు జైలు శిక్ష పడే అవకాశం ఉందని తెలిపారు. ఒకవేళ బాలురు తల్లిదండ్రులతో పాటు వారికి వాహనాలు ఇచ్చి యజమాను లను కౌన్సిలింగ్ హాజరు కావాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఆ తర్వాత న్యాయస్థానం ముందు హాజరై జరిమానా కూడా చెల్లించాలన్నారు. తల్లిదండ్రులు యజమానులు ఎట్టి పరిస్థితులలో మైనర్లకు వాహనాలు ఇవ్వద్దని సూచించారు. దాడులు కొనసాగిస్తామని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్సులు ఇతర పత్రాలు లేని పలువురు వాహనాలపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ మల్లయ్య, శివకుమార్, సురేందర్, లింగారెడ్డి, రమేష్, వెంకటయ్య, రాజా వర్ధన్ రెడ్డి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కులాల పేరిట అసమానతలు చూపరాదు : ఎస్సై రవూఫ్



**కొడంగల్ నినాదం :** సమాజంలో వ్యక్తులను కులాల పేరిట అసమానత వ్యత్యాసం చూపరాదనీ బొంరాస్ సబ్ ఇనిస్పెక్టర్ రవూఫ్ తెలిపారు. తుంకిమెట్ల గ్రామంలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో పౌరహక్కుల గురించి వివరించారు. ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు గురించి వివరించారు. సైబర్ నేరాలు గురించి తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు సామరస్యంగా పరిష్కరించుకోవాలనీ,అన్నారు. ఈకార్యక్రమంలో ఎస్సై తో పాటు ఏఎస్సై రాములు, ఆర్ ఐ శిరీష తదితరులు పాల్గొన్నారు.

## అనునిత్యం ప్రజా సేవలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలువురు నాయకులు ప్రజాప్రతినిధులు పలు సంక్షేమ సంఘాల నాయకులు మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ సీనియర్ నేత కూన శ్రీశైలం గౌడ్ ను తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిసి పలు సమస్యలు ఆయనకు విన్నవించారు. వినతులు స్వీకరించిన ఆయన వాటి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని, నియోజకవర్గంలోని సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం సత్వర చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి పై రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఇంఛార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ద్వారా ప్రత్యేక నిధులు మంజూరు చేసి కాలనీలు బస్తీలు అభివృద్ధికి చర్యలు తీసుకుంటుందని అన్నారు. పలువురు పలు ఆహ్వాన పత్రికలు మాజీ ఎమ్మెల్యే కు అందజేశారు. ఈ కార్యక్రమంలో జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్, పలువురు నాయకులు, పలు సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# రోడ్లపైనే ఇష్టా రాజ్యంగా వాహనాల పార్కింగ్

- వాహనదారులకు తప్పని తిప్పలు
- చోద్యం చూస్తున్న అధికారులు
- రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు చేల్పూరి రాము



**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలో రోడ్లపైనే వాహనాలను పార్కింగ్ చేస్తున్నారని, జమ్మికుంట ప్రధాన రహదారి లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద పార్కింగ్ కు అనువైన స్థలం లేకపోవడంతో ఆసుపత్రికి వచ్చే ప్రజలు రహదారుల పైనే తమ తమ వాహనం నిలుపుతున్నారని దీంతో ఆ రహదారి గుండా వెళ్తున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా కమిటీ సభ్యులు రాము అన్నారు. జమ్మికుంటలో బుధవారం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే జమ్మికుంట పట్టణానికి వ్యాపారం కేంద్రంగా ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. నిత్యం వందలాది గ్రామాల ప్రజలు పలు అవసరాల నిమిత్తం జమ్మికుంటకు రాకపోకలు సాగిస్తుంటారని దీంతో జమ్మికుంట పట్టణంలో ఎక్కడ చూసినా వాహనాల రద్దీ ఎక్కువగా కనిపిస్తూ ఉంటుందని అన్నారు. జమ్మికుంట గాంధీ చౌక్ నుంచి మోత్కులగూడెం చౌరస్తా వరకు వాహనాల రద్దీ మరి ఎక్కువగా ఉంటుందన్నారు. ముఖ్యంగా నిత్యం రద్దీగా ఉండే రహదారి పక్కన పార్కింగ్ సౌకర్యం లేకుండా నిర్మాణం చేసుకున్న శ్రీరామ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ కు వచ్చే వారు తమ వాహనాలను రోడ్లపైనే నిలుపుతుండడం తో ఆ రహదారుల గుండా ప్రయాణం సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. మున్సిపల్ అధికారులు రోడ్లపై వాహనాలను నిలుపుతున్న విషయంపై అంటి ముట్టనట్లు వ్యవహరించడంతో పాటు పోలీస్ అధికారులు సైతం ట్రాఫిక్ నియంత్రణను గాలికి వదిలేయడంతో వాహనదారులు ఇష్టానుసారం వాహనాలను నడిరోడ్డు పైనే పార్కింగ్ చేస్తున్నారని అన్నారు. మున్సిపల్, పోలీస్ శాఖ అధికారులు స్పందించి రహదారిపై వాహనాలను పార్కింగ్ చేయకుండా నియంత్రిస్తే ఆ రహదారి గుండా ప్రయాణం సాగించే వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు.

## నిరుద్యోగ యువతకు బాసటగా నిలుస్తా

- విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి
- పలు మండలాల్లోని ప్రైవేటు పాఠశాలల్లో పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు పర్యటన




**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్ ):**'విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి. వారి ఆసక్తి ఉన్న రంగాల్లో రాణించేందుకు అవకాశాలు కల్పించాలి' అని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి యాదగిరి శేఖర్ రావు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పట్టభద్రుల ఓటు నమోదుపై అవగాహన కల్పిస్తూ బుధవారం బుధవారం జిల్లాలోని కొత్తపల్లి, గంగాధర్, రామడుగు, చొప్పదండి మండలాలలోని పలు గ్రామాలు, చొప్పదండి పట్టణం తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ముందుగా బావుపేటలోని సరస్వతి విద్యామందిర్ పాఠశాలను సందర్శించారు. ఎల్ఈడి కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులు ఏర్పాటు చేసిన తెలుగు, హిందీ, ఇంగ్లీష్, మ్యాథ్స్, సైన్స్, సోషల్ ల్యాబ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా శేఖర్ రావు మాట్లాడుతూ, విద్యార్థులలోని సృజనాత్మక శక్తికి, మేధోసంపత్తికి ఈ ల్యాబ్స్ ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ ల్యాబ్స్ రూపొందించడానికి కృషి చేసిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ఇలాంటి సృజనాత్మక అంశాలపైన అవగాహన కలిగించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహాయంతో సెమినార్లు ఏర్పాటు చేస్తానని అన్నారు. తమందరి ఆశీర్వాదంతో ఎమ్మెల్సీగా తనను పెద్దల సభకు పంపించినట్లయితే ఇలాంటి అనేక సృజనాత్మకమైన కార్యక్రమాలు ప్రతి పాఠశాలలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. గంగాధర మండలం వికాస్ పాఠశాల సహా రామడుగు, చొప్పదండి మండలాల్లోని పలు ప్రైవేటు పాఠశాలలు సందర్శించారు. ప్రైవేటు విద్యా సంస్థలలో పనిచేస్తున్నటువంటి బోధన, బోధనేతర సిబ్బందికి రూ. 10 లక్షల ఆరోగ్య, జీవిత బీమా వచ్చేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోటి చర్చించి చర్చిస్తానని తెలియజేశారు. నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి తో పాటు, ప్రతి సంవత్సరం జాబ్ కాలండర్ వచ్చే విధంగా, త్వరితగతిన ఉద్యోగ నియామకాలు జరిగే విధంగా ప్రభుత్వాలతో కొట్లాడుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి లక్ష్మణ్ రెడ్డి, పి సురేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు గాజుల తిరుపతి, గంగాధర అధ్యక్షులు రాచమల్ల శారద, రాజశేఖర్, రాజా మల్లయ్య , లక్ష్మరెడ్డి ,అనంత్ రెడ్డి , చొప్పదండి అధ్యక్షులు గుజ్జం ఆనంద రెడ్డి, కార్యదర్శి తిరుపతి, శ్రీనివాస్ , ట్రెజరర్ దేవానందం సహా ఉపాధ్యాయులు, పట్టభద్రులు, స్థానికులుపెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కార్తీక్




**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** జమ్మికుంట మండలం వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తనుగుల గ్రామములో డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 48 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఇందులో ఇద్దరు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త పూతల నామునాలను సేకరించి, వ్యాధి నిర్ధారణ పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపినట్లు వారు పేర్కొన్నారు. గ్రామమ స్తులకి మలేరియా, డెంగీ చికెన్ గున్యా మొదలగు వ్యాధులు వ్యాపించు విధానం, వ్యాధుల లక్షణాలు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి క్లుప్తంగా గ్రామ ప్రజలకు వివరించారు. అసంక్రమిత వ్యాధులు మధుమేహం, రక్తపోటు వ్యాధుల గురించి అవగహన కల్పించి, అవసరం ఉన్న వారికి మందు లు ఇవ్వడం జరిగినది. అంతేగాకుండా వారికి ఆహార అల వాట్ల గురించి అవగాహన కల్పించనైనది. వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించారు. ప్రతి మంగళవారం శుక్రవారం తప్పనిసరిగా డ్రై డే కార్యక్రమము చేపట్టి దోమల లార్వా లను నిర్మూలించాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమములో డాక్టర్ కార్తీక్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్స్ సదానందం, కుసుమకుమారి, హెల్త్ అసిస్టెంట్ నరేందర్, మణెమ్మ, సంపూర్ణ, పుష్పలత ఆశా కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు

## స్కాలర్ షిప్స్ ప్రభుత్వం పెట్టె బిక్ష కాదు, విద్యార్థుల హక్కు

- ఏబీవీపీ కరీంనగర్ జిల్లా కన్వినర్ పూసల విష్ణు



**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హుజురాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో బుధవారం పెండింగ్ లో ఉన్న ఫ్లీజ్ రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలని బిక్షాటన కార్యక్రమం చేయడం జరిగింది.రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయాలని ఏబీవీపీ హుజురాబాద్ నగర శాఖ ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ చౌరస్తా వద్ద విద్యార్థులతో కలిసి భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా కన్వినర్ పూసల విష్ణు మాట్లాడుతూ సంవత్సరాల తరబడి ఫీజు రియంబర్స్మెంట్ మరియు స్కాలర్షిప్స్ విడుదల చేయని కారణంగా దాదాపు 7,500 కోట్లకు పైగా పెండింగ్ లో ఉన్నాయని, నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం దాటుతున్న పెండింగ్ బకాయిలను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ పేద విద్యార్థుల జీవితాల పట్ల శాపంగా మారిందని మండిపడ్డారు. పేద విద్యార్థులకు సంజీవని వంటి ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ పథకానికి తూట్లు పొడుస్తూ విద్యార్థుల హక్కు అయినటువంటి రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ లను విడుదల చేయకపోవడం అనేది సిగ్గుచేటు,పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే దిశగా ప్రభుత్వం కుట్ర చేస్తుంది అన్నారు. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తిచేసిన వేలమంది విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ రాని కారణంగా యాజమాన్యాలు ఫీజు రియంబర్స్మెంట్ చెల్లిస్తే కానీ సర్టిఫికెట్స్ ఇవ్వమంటూ విద్యార్థులను ఒత్తిడికి గురి చేస్తుంటే విద్యార్థులు మానసికంగా ఇబ్బందికి గురై ఆత్మహత్యలకు పాల్పడుతున్న ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం బాధాకరం, ఒకవైపు రియంబర్స్మెంటు బకాయిలు చెల్లిస్తే తప్ప మేము కళాశాలను నడపలేని స్థితిలో ఉన్నామని ప్రైవేటు యాజమాన్యాలు మొర పెట్టుకుంటున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుందని మండి పడ్డారు తక్షణమే ఫీజు రియంబర్స్మెంట్స్ మరియు స్కాలర్ షిప్స్ విడుదల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులందరినీ కలుపుకొని మంత్రులను,ఎమ్మెల్యేలను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు ఫీజు రియంబర్స్మెంట్ పైన ఆధారపడి నడిపిస్తున్న కళాశాలలు , మధ్యలోనే కళాశాల యాజమాన్యాలు చేతులెత్తే పరిస్థితి కనిపిస్తుంది. ఇటు యాజమాన్యానికి అటు ప్రభుత్వానికి మధ్యలో బలవుతున్నది మా విద్యార్థులే. డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ పూర్తి అయిన తర్వాత కూడా సర్టిఫికెట్స్ రాక ఒకవైపు ఉన్నత విద్యకు మరొకవైపు ఉద్యోగ అవకాశాలు వచ్చినా కూడా సర్టిఫికెట్స్ లేని కారణంగా విద్యార్థుల జీవితాలు అంధకారంలోకి నెట్టి వేయబడుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్న విద్య వ్యవస్థ తీరు మారడం లేదు విద్యార్థుల జీవితాలు బాగుపడటం లేదు. ఉన్న విద్యాలయాలను విద్యావ్యవస్థను పటిష్ఠ పర్చాల్సిన ప్రభుత్వమే విద్యను అంధకారంలోకి నెట్టి వేస్తూ నూతనంగా ఇంటర్నేషనల్ స్కూల్స్ అంటూ యూనివర్సిటీలు అంటూ కొత్త హామీలతో చేతులు దులుపుకుంటుంది తప్ప ఇచ్చిన హామీలు మాత్రం అమలు చేయడం లేదు. ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న చిత్తశుద్ధి ఏంటో విద్యారంగానికి కేటాయించిన బడ్జెట్ లోనే అర్థం అవుతుంది. సంవత్సరాల తరబడి అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్న, అనేక కార్యక్రమాలు చేస్తున్న ప్రభుత్వానికి మాత్రం చీమకుట్టినట్టు కూడా లేదు. ప్రభుత్వం ఇచ్చేటటువంటి ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విద్యార్థుల యొక్క హక్కు అని జ్ఞప్తికి తెచ్చుకొని ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు గోస్కుల అజయ్, నగర సంయుక్త కార్యదర్శి రాయుడు, శివ, నగర ఉపాధ్యక్షులు అనురాగ్ అంజి నగర హాస్టల్స్ కన్వీనర్ అభిలాష్ కో కన్వీనర్ జశ్వంత్ , రాజ్ కుమార్ , మనీ, రాఘవ, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## పారమిత విద్యాసంస్థలలో ఘనంగా దీపావళి వేడుకలు




**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** స్థానిక కరీంనగర్ లోని పారమిత విద్యాసంస్థలలో ముందస్తు దీపావళి వేడుకలు నయనానందకరంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో విద్యార్థిని విద్యార్థులు దీపావళి పండుగ యొక్క ప్రాముఖ్యతను పాటల రూపంలో, నృత్య రూపంలో కళ్ళకు కట్టిన విధంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. ఈ సందర్భంగా పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, చెడు పైన మంచి సాధించిన విజయానికి ప్రతీకగ దీపావళి పండుగను ఆనందంగా నిర్వహించుకుంటామని, ఈ సంతోషకర సమయంలో తల్లి దండ్రులు చెప్పిన సూచనలకు తగ్గట్టుగా దీపాలు వెలిగించే సమయంలో టపాసులు పేల్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డా ఇనుగంటి ప్రసాదరావు తల్లిదండ్రులకు, విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కరీంనగర్ పట్టణ ప్రజలందరికీ ముందస్తు దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పారమిత విద్యాసంస్థల డైరెక్టర్లు ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, రమణ, వియుఎం. ప్రసాద్, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు బాలాజీ, ప్రశాంత్,కవిత, ప్రోగ్రామ్ హెడ్ గోపీకృష్ణ, సమన్వయ కర్తలు ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లాయర్లపై లాఠీచార్జ్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్.పి.ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్




**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్ ) :** ఉత్తర ప్రదేశ్ రాష్ట్రంలో ఘజియాబాద్ కోర్టులో న్యాయవాదులపై పోలీసులు లాఠీచార్జి చేసిన సంఘటనను,రిపబ్లికన్ పార్టీ అఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ తీవ్రంగా వ్యతిరేకించారు. ఒక న్యాయస్థానం కోర్టులో న్యాయవాదులపై పోలిసులు దాడులు చేయడం ఏమిటి అని ప్రశ్నించారు. ఈ సంఘటనా చాలా విచారకరం అని ఆయన అన్నారు.మరోసారి ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా దాడులు చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసారు. వెంటనే ఉన్నంత న్యాయస్థానం జోక్యం చేసుకుని విచారణ జరిపించి న్యాయవాదులపై దాడులు చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై అవగాహన

- సర్వే పకడ్బందీగా నిర్వహించాలి
- దుష్ప్రచారాల విషయంలో జాగ్రత్తగా ఉండాలి
- స్పెషల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాష్



**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేయబోతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే సమగ్ర కుటుంబ సర్వేపై మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ అయాజ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం మండలంలోని మండల అభివృద్ధి కార్యాలయ అధికారులు, పంచాయతి కార్యదర్శులు, అర్పిలు, అంగన్వాడి టీచర్లు, మున్సిపల్ అధికారులు పలువురికి సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ కిరణ్ ప్రకాష్, మునిసిపల్ స్పెషల్ ఆఫీసర్ ఈడి ఎస్ సి కార్పొరేషన్,తహసీల్దార్ రమేష్ బాబు,మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్ ఆయాజ్ లు మాట్లాడుతూ సర్వే చేస్తున్నప్పుడు ఎటువంటి దుష్ప్రచారాలు ప్రబలకుండా చూసుకోవాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో, మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో సిబ్బందికి దరఖాస్తులు అధికారులకు అందజేస్తారని తెలిపారు. షెడ్యూల్ ప్రకారంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి ఫోర్స్ లేకుండా, తప్పిదాలు లేకుండా సర్వేను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ అబ్దుల్ భారీ, పి ఆర్ శ్రీనివాస్, ఏ కరుణాకర్ రెడ్డి, మునిసిపల్ ఏ ఈ నరేష్, శ్రీధర్ టీపీఓ, మేనేజర్ జి రాజిరెడ్డి, వాణి, భాస్కర్, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు

## కష్టపడి పనిచేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు

- జీడి మల్లేష్ పనితీరు భేష్
- బీజేపీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్ కుమార్



**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** బిజెపి జమ్మికుంట పట్టణ అధ్యక్షుడు జీడి మల్లేష్ కరీంనగర్ జిల్లాలో అత్యధిక బిజెపి సభ్యత్వాలు చేపించడం పట్ల బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్ కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి లు బుధవారం కరీంనగర్ లో జరిగిన బిజెపి సమావేశంలో జీడి మల్లేష్ ను శాలువా కప్పి అభినందించడం జరిగింది. జమ్మికుంట పట్టణంలోని 39 బూత్ లల్లో సుమారు 11 వేల సభ్యత్వాలు చేపించినట్టు జీడి మలేష్ తెలిపారు. ఇంత పెద్ద ఎత్తున సభ్యత్వాలు కావడానికి నాతోపాటు బీజేపీ పట్టణ కమిటీ,బూత్ అధ్యక్షుల సమిష్టి కృషి అని తెలిపారు.కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పట్ల ప్రజలకు ఉన్న విశ్వాసం కారణంగానే ప్రజలు పెద్దయెత్తున, స్వచ్ఛందంగా సభ్యత్వాలు తీసుకున్నారని మల్లేష్ అన్నారు. రాబోయే రోజుల్లో కూడా పార్టీ ఆదేశాల మేరకు క్రమశిక్షణతో పనిచేసి ఇదే విధంగా ముందుకు కొనసాగుతామని ఆయన పేర్కొన్నారు. బిజెపి పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు లభిస్తుందని ఆయన అన్నారు.

## భారత ఆర్మీ అధ్వర్యంలో సైకిల్ ర్యాలీ



**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** పౌర సమాజ ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కోసం సైక్లింగ్" అనే ఉన్నత లక్ష్యంతో హైదరాబాదు నుంచి కరీంనగర్ వరకు సైకిల్ యాత్ర చేపట్టనున్నామని మేజర్ జనరల్ ఎన్. బి. పటేల్ అన్నారు. ఈ రోజు 9వ తెలంగాణ ఎన్‌సిసి బటాలియన్ ఆవరణలో సైకిల్ యాత్ర నిర్వహణ ఏర్పాట్ల సమీక్ష సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ,పాల్మెట్ బైసైక్లింగ్ క్లబ్ అఫ్ ఆర్ఎస్ఐ సికింద్రాబాదు కు చెందిన 15 మంది విశ్రాంత సీనియర్ ఆర్మీ అధికారులు డిసెంబర్ 08,2024న ఉదయం హైదరాబాదులో ప్రారంభమైన అదే రోజు మధ్యాహ్నం 3:00 గంటల వరకు కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంకు చేరతామని మేజర్ జనరల్ ఎన్. బి. పటేల్ తెలియజేశారు. సైక్లింగ్‌ను ప్రోత్సహించడం, వ్యక్తిగత ఆరోగ్యాన్ని పొందడం, పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇవ్వడం మనందరి బాధ్యత అని అంటూ ప్రతి ఒక్కరు, ముఖ్యంగా నేటి డిజిటల్ యుగపు యువత సైక్లింగ్‌ను హాబీ గా చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కెప్టెన్ డా: బుర్ర మధు సూదన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక భారత ఆర్మీకి చెందిన సీనియర్ అధికారుల నేతృత్వంలో సైక్లింగ్ యాత్ర నిర్వహించడం హర్షదాయకమని, ఈ యాత్ర కరీంనగర్ చేరుకునే సందర్భంలో పెద్ద ఎత్తున ఎన్‌సిసి కెడెట్లు, విద్యార్థి నీవిద్యార్థులు, సైక్లింగ్ అభిమానులు, నగర పౌరులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాదరంగా ఆహ్వానం పలుకుతామని తెలిపారు. ఆర్మీ అధికారులు చేపట్టనున్న సైక్లంగ్ యాత్రకు సంబంధించిన వివరాలతో కూడిన పత్రాన్ని కెప్టెన్ డా బుర్ర మధుసూదన్ రెడ్డి, మహేశ్‌లకు అందజేశారు. ఈ సమావేశంలో సీనియర్ సైక్లిస్ట్ మహేష్, బటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీఎస్ఆర్ ఐటీఐలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

- బంగారు భవిష్యత్ కొరకు ఐటీఐలో చేరండి
- కళాశాల ప్రిన్సిపల్ ముష్క వీర రాజు






**జమ్మికుంట, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** జమ్మికుంట జి ఎస్ ఆర్ ప్రైవేట్ ఐటిఐ లో బుధవారం ఫ్రెషర్స్ డే అదే విధంగా కాన్వకేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు ఐటిఐ ప్రిన్సిపల్ వీర్రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏర్పాటు ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జిఎస్సార్ ప్రైవేట్ ఐటిఐ ప్రిన్సిపల్ శ్రీముష్క వీర రాజు మాట్లాడుతూ ఉపాధికి దగ్గర దారి ఐటిఐ అని విద్యార్థిని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు అదేవిధంగా అనేక ప్రభుత్వ ప్రైవేటు రంగాలలో వందలాది మంది విద్యార్థులు తన ఐటిఐ లో పూర్తి చేసుకొని ఈరోజు జేఎల్ఎం లుగా ఆర్టీసీ డిపార్ట్మెంట్లో రైల్వే డిపార్ట్మెంట్లో ఉద్యోగాలు చేస్తున్నారని అది మాకు గర్వంగా ఉందని ఆయన తెలిపారు.ఇలా మీరందరూ కూడా మంచి ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని మీరు ఏది కోరుకుంటే అది మన ఐటిఐ లో అందించడానికి మేము సిద్ధంగా ఉన్నామని విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ప్రస్తుతం ఐటిఐ చదివిన విద్యార్థులకు వివిధ శాఖలలో మంచి ఉద్యోగాలు ఉన్నాయని మీకు అందుబాటులో నాణ్యమైన ఐటిఐ విద్యను అన్ని రకాల కోర్సులను అందించడానికి జి ఎస్ ఆర్ ఐ టి ఐ అందుబాటులో ఉందని నాణ్యమైన విద్యను అందించడం లో ఎలాంటి కాంప్రమైజ్ కామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి వరుణ్ మోటార్స్ హెచ్ ఆర్ ప్రవీణ్ గాయత్రి డిగ్రీ పీజీ కళాశాల ప్రిన్సిపల్ కుమారస్వామి అధ్యాపకులు సతీష్ రంజిత్ కుమార్ అంజిబాబు సాగర్ మధుకర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో ఘనంగా దీపావళి వేడుకలు




**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** దీపావళి పండుగ వెలుగులు నింపే పండుగని ప్రపంచమంతా చాలా గొప్పగా వివిధ సాంప్రదాయాలను పాటిస్తూ మహాలక్ష్మి మాతను కొలుస్తూ పండుగను చాలా సంతోషంగా కుటుంబ సభ్యుల సమక్షంలో చాలా వేడుకగా నిర్వహించుకుంటారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా. వి. నరేందర్ రెడ్డి స్థానిక భగత్నగర్లోని అల్ఫోర్స్ ఇ టెక్నో పాఠశాలలో నిర్వహించినటువంటి ముందస్తు దీపావళి వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దీపావళి పండుగకు చాలా ప్రత్యేకత ఉన్నదని మరియు ఎంతో చరిత్ర గల విశిష్టమైన పండుగ అని వారు తెలిపారు. దీపావళి పండుగను పురస్కరించుకొని అందరూ కూడా లక్ష్మీమాత పూజలు ఆచరించి చాలా శుభఫలాలు పొందుతారని వారు చెప్పారు. ఈ పండుగ సమయాన అందరూ కూడా వివిధ రకాల పూజలు నిర్వహిస్తూ అష్టశ్వర్యాలతో పాటు ఆయురారోగ్యాలు సిద్ధించాలని ప్రార్థిస్తారని చెప్పారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ప్రదర్శించినటువంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యంగా మహాలక్ష్మి రావమ్మా,మా కోరికలు తీర్చవమ్మా. నృత్యం చాలా ఆకట్టుకున్నది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఆయుష్మాన్ భారత్‌తో ప్రయోజనం



**కరీంనగర్, అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య యోజన 70 ఏళ్ల పైబడిన వృద్ధులకు వర్తింపజేయడం హర్షణీయం వృద్ధులు ఆన్లైన్లో నమోదు చేసుకుని ఆరోగ్య ప్రయోజనాలు పొందాలి – సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి ప్రధాన మంత్రి నరేంద్రమోడీ మంగళవారం 70 ఏళ్లు పైబడిన వృద్ధుల కోసం ఆయుష్మాన్ భారత్ ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన కింద కొత్త ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య యోజన పథకాన్ని ప్రారంభించడం హర్షణీయమని సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పెండ్యాల కేశవరెడ్డి తెలిపారు. గురువారం కరీంనగర్లోని ప్రెస్భవన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఈ పథకం వృద్ధులకు సమగ్ర ఆరోగ్య సంరక్షణ విస్తరిస్తుందన్నారు. ఈ పథకం కింద ఆయుష్మాన్ కార్డును పొందేవారు ఏదైనా ఆసుపత్రులలో రూ 5 లక్షల వరకు ఉచిత చికిత్సను పొందవచ్చని, అన్ని సామాజిక, ఆర్థిక వర్గాలకు వృద్ధులకు వైద్య బీమా లభిస్తుందన్నారు.వయో వృద్ధులు ఈ కార్డును ఆన్లైన్లో నమోదు చేసుకుని ఆరోగ్య ప్రయోజనాలను పొందాలని కోరారు.ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే వుచ్చిడి మోహన్ రెడ్డి, అధ్యక్షులు సముద్రాల నార్ధన్ రావు, కోశాధికారి చింతల సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శి శ్రీధరస్వామి, కార్యవర్గ సభ్యులు ఎలాసరి లింగయ్య, రాజారాం, నర్సింహారెడ్డి, మల్లయ్య, మధుసూదన్, నీలం జగదీశ్వర్రెడ్డి, బూరు జగదీశ్వర్ గౌడ్, మరిపల్ల మహేందర్ పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయాలి

## ఎంపీ, దిశ కమిటీ చైర్ పర్సన్ డీకే అరుణ



**నారాయణపేట జిల్లా ప్రతినిధి, (నినాదం న్యూస్) అక్టోబర్ 30:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో అమలు అవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాజకీయాలకు అతీతంగా క్షేత్ర స్థాయిలో సక్రమంగా, పారదర్శకంగా అమలు చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యురాలు, దిశ కమిటీ చైర్ పర్సన్ డి.కె.అరుణ అన్నారు. బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో జిల్లా అభివృద్ధి,సమన్వయ మరియు పర్య వేక్షణ కమిటీ (దిశ) మొదటి సమావేశం మహబూబ్ నగర్ పార్లమెంటు సభ్యులు డి.కె. అరుణ అధ్యక్షతన నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాటా నిధులతో,కేంద్ర ప్రభుత్వ నిధులతో వివిధ శాఖల ద్వారా అమలు జరుగుతున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల గురించి సమావేశంలో సమీక్షించారు. మొత్తం 44 ప్రభుత్వ శాఖల పరిధిలో కేంద్ర ,రాష్ట్ర నిధులతో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీ డీకే అరుణ అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలలో లోటు పాట్లు ఉంటే సరి చేసుకుని పూర్తి స్థాయిలో అమలు జరిగి ప్రజలకు ఉపయోగ పడేలా సమావేశంలో సమీక్షించి పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు మేలు చేసే ఉద్దేశంతో ఆయా పథకాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయని, పథకాల అమలు తీరు దిశ సమావేశం లో సమీక్షించి ఆదేశాలు జారీ చేయనున్నట్లు తెలిపారు. కేంద్ర పథకాలు ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టంగా అమలుకు అధికారులు అంకిత భావంతో అభివృద్ధికి కృషి చేయాలని,పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని సూచించారు. ముందుగా వైద్యశాఖ పరంగా జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ఏఏ పనులు చేస్తున్నారని, పెండింగ్ లో ఉన్న పనులేవీ? ఎన్ని నిధులు రావాల్సి ఉందని వైద్య శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి కేంద్రం అమలు చేస్తున్న పథకాలను రైతులకు అమలు చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని ఆమె ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో పంచాయతీ, అంగన్ వాడి భవనలను నిర్మించాలన్నారు. జిల్లాలో సొంత భవనాలు లేని పంచాయతీలు, అంగన్ వాడి కేంద్రాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో అవసరం ఉన్నచోటనే సిసి రోడ్లు నిర్మించాలని సూచించారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మరుగుదొడ్డి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలాన్నారు. సెర్ఫ్ కార్యక్రమాలలో మహిళలను భాగస్వాములు చేసి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు గ్రామాలలో కల్వర్టుల నిర్మాణాలు చేపట్టాలన్నారు. ధన్వాడ – పాత పల్లికి వెళ్ళే మార్గంలో పురాతన బ్రిడ్జి స్థానంలో కొత్త బ్రిడ్జిని నిర్మించాలని పీఆర్ ఈఈ నీ ఆదేశించారు. అలాగే నారాయణపేట – వల్లంపల్లి రోడ్డు, జాజా పూర్ – శేర్నపల్లి వంతెన నిర్మాణం చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకాన్ని అర్హులందరికీ లబ్ధి చేకూర్చాలన్నారు. విద్యాశాఖ పై ఆమె సమీక్షిస్తూ డిఈవో పై అసహనం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి వచ్చిన నిధుల ద్వారా జిల్లాలో చేపట్టే నిర్మాణ పనులను ఎవరు ప్రారంభిస్తున్నారని?, ఎంపీగా తనకు ముందస్తు సమాచారం ఇవ్వారా అని డీఈవోను ప్రశ్నించారు. కేంద్ర నిధుల ద్వారా చేపట్టే అభివృద్ధి నిర్మాణ పనులు ప్రారంభానికి తనకు సమాచారం ఇవ్వాలని, ఏదో మొక్కుబడిగా రేపు పనులు ప్రారంభిస్తున్నట్లు ఈ రోజు సాయంత్రం తనకు ఫోన్ చేసి చెప్తే ఎలా వస్తామని, ముందస్తుగా సమాచారం ఇవ్వాలని డీఈవోను ఆదేశించారు. అభివృద్ధి నిర్మాణ పనులలో రాజకీయాలకు తావివ్వొద్దని ఆమె పునరుద్ఘాటించారు. సమావేశానికి గనుల శాఖ అధికారి హాజరు కాకపోవడంపై వివరణ కోరారు. జిల్లాలో ఇసుక, మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. ప్రజారోగ్య శాఖ అధికారి నారాయణపేట జిల్లాలోని మూడు మున్సిపాలిటీల అభివృద్ధి పనుల గురించి వివరిస్తూ అమృత్ 2.0 కింద నారాయణపేట మున్సిపాలిటీలో నీటి సరఫరా మెరుగుదల పథకం 2023 సంవత్సరంలో రూ.27.66 కోట్ల అంచనా మొత్తానికి మంజూరు చేయబడిందని, కేంద్ర వాటా: 12.58 కోట్లు కాగా రాష్ట్రం, యు ఎల్ బి వాటా: 15.08 కోట్లు ఉందని తెలిపారు. సర్వే , డిజైన్ పని పురోగతిలో ఉందని,పని గ్రౌండ్ చేయబడాలన్నారు నీటి సరఫరా పథకంలో అమలు చేయవలసిన ప్రాథమిక భాగాలుగా 2500 కేఎల్ సర్వీస్ రిజర్వియర్‌లు మూడు ఉన్నాయని తెలిపారు. అమృత్ 2.0 కింద కోస్గి మున్సిపాలిటీలో నీటి సరఫరా మెరుగుదల పథకం అంచనా మొత్తానికి రూ. 2023లో 12.53 కోట్లు ఉండగా, కేంద్ర వాటా: 5.70 కోట్లుబీ రాష్ట్రం, యు ఎల్ బి వాటా: 6.83 కోట్లు ఉందన్నారు. సర్వే %ధ% డిజైన్ పని పురోగతిలో ఉందని,పని గ్రౌండ్ చేయాల్సి ఉందన్నారు. నీటి సరఫరా పథకంలో అమలు చేయవలసిన ప్రాథమిక అంశాలుగా 1400 కే ఎల్ సర్వీస్ రిజర్వియర్‌లు 4 ఉన్నాయని తెలిపారు. ఇక అమృత్ 2.0 కింద మక్తల్ మున్సిపాలిటీలో నీటి సరఫరా మెరుగుదల పథకం 2023 సంవత్సరంలో రూ.15.38 కోట్ల అంచనా మొత్తానికి మంజూరు చేయబడిందని,దీనిలో కేంద్ర వాటా: 6.99 కోట్లు కాగా, రాష్ట్రం, యు ఎల్ బి వాటా: 8.39 కోట్లు ఉన్నట్లు చెప్పారు. సర్వే, డిజైన్ పని పురోగతిలో ఉందని, పని గౌండింగ్ చేయాల్సి ఉందన్నారు. ఇక్కడా నీటి సరఫరా పథకంలో అమలు చేయవలసిన ప్రాథమిక అంశాలుగా 1250 కే ఎల్ 3 సర్వీస్ రిజర్వియర్‌లు ఉన్నాయని ప్రజారోగ్య శాఖ అధికారి వివరించారు. అలాగే మూడు మున్సిపాలిటీల కమిషనర్లు ఆయా మున్సిపాలిటీలలో 15 ఆర్థిక సంఘం నిధుల వినియోగం, పీ ఏం విశ్వకర్మ పథకం వివరాలను తెలిపారు. నేషనల్ హైవే రహదారి 150,167,167ఎన్ పనుల పై ఆమె సమీక్షించారు. అలాగే జిల్లాలో ఆర్ అండ్ బి శాఖ రూ.36 కోట్ల తో ప్రతిపాదించిన పెద్ద జట్రం నుంచి జక్లేర్ డబుల్ లైన్ రహదారి నిర్మాణ పనులపై ఎంపీ ఆరా తీశారు. ముద్ర రుణాలు, పిఎం విశ్వకర్మ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని లీడ్ బ్యాంకు మేనేజర్ ను ఆమె ఆదేశించారు. అటవీ శాఖ అధికారి ఎక్లాస్ పూర్‌లో ఏర్పాటు చేసిన ఏకో పార్కు గురించి తెలిపారు. చేనేత జౌళి శాఖ పై సమీక్షిస్తూ శాఖ పరమైన కార్యక్రమాల సమాచారం తనకు ఇవ్వాలని, ప్రజా ప్రతినిధులకు గౌరవం ఇవ్వాలన్నారు. ఇటీవలే చేనేత జౌళి శాఖకు సంబంధించి లబ్ధిదారులకు ఇచ్చే చెక్కులను ఎమ్మెల్యే పీ.ఏ. ఎలా అందజేస్తారని? ఎమ్మెల్యే లేకపోతే మున్సిపల్ చైర్ పర్సన్ తో చెక్కులు ఇప్పించాలని, పీ.ఏ.కు ఏం అధికారం ఉందని ఆయనతో చెక్కులు ఇప్పిస్తారని జౌళి శాఖ అధికారిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఐసిడిఎస్, ఎస్సీ కార్పొరేషన్, సివిల్ సప్లై, నాబార్డు, పశుసంవర్ధక, భూగర్భ జలవనరులు, మార్కెటింగ్, ఉద్యానవన, సర్వే ల్యాండ్, జిల్లా పరిషత్, ఇరిగేషన్, పోస్టల్, జిల్లా యువజన సర్వీసులు, జిల్లా ఆస్పత్రి, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా మెడికల్ కళాశాల, కార్మిక శాఖలలో కొనసాగుతున్న పనులు,అమలవుతున్న కేంద్ర పథకాల గురించి ఆయా శాఖల అధికారులతో పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. చివరగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ జిల్లాకు వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించుకునేలా దిశ సమావేశంలో చర్చించుకోవడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ దిశ సమావేశం ప్రతి మూడు నెలలకొకసారి నిర్వహించ వలసి ఉంటుందని,తదుపరి సమావేశం జనవరి లో ఉంటుందని తెలిపారు. వచ్చే సమావేశం లో ఆయా పథకాలలో సాధించిన ప్రగతిపై సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధికారులు, ప్రజలకు ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ దీపావళి పండగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, నారాయణపేట మున్సిపల్ చైర్ పర్సన్ గందె అనసూయ, డిఆర్డిఓ మొగులప్ప, ఇన్చార్జి జిల్లా అటవీశాఖ అధికారి నవీన్ రెడ్డి, ఆర్డిఓ రామచంద్రనాయక్, జెడ్పి సీఈవో జ్యోతి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ సౌభాగ్య లక్ష్మి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాన్ సుధాకర్, డీపీఆర్ వో, మైనార్టీ సంక్షేమ అధికారి ఎం.ఏ. రషీద్, జిల్లా మత్స్యశాఖ అధికారి రెహమాన్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఉమాపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఖలీల్, సివిల్ సప్లై డిఎం దేవదాస్, జిల్లా అధికారి సుదర్శన్, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, డిడబ్లుఓ జయ, పిఆర్ ఈ ఈ హీర్యా నాయక్, ఆర్అండ్ బి డీ.ఈ రాములు, ఆయా ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## అవని

# పనస పాయసం



**కావలసిన పదార్థాలు...**
తరిగిన పనస తొనలు: ఒక కప్పు, బెల్లం తురుము: అర కప్పు, కొబ్బరి పాలు: ఒక కప్పు, యాలకుల పొడి: అర టీస్పూన్, నెయ్యి: ఒక టేబుల్ స్పూన్, డ్రై ఫ్రూట్స్: అర కప్పు, పచ్చికొబ్బరి ముక్కలు: ఒక టేబుల్ స్పూన్.

**తయారీ విధానం...**
స్టవ్‌మీద పాన్‌పెట్టి నెయ్యివేసి, వేడయ్యాక తరిగిన డ్రై ఫ్రూట్స్, కొబ్బరి ముక్కలు వేసి వేయించి పక్కన పెట్టాలి. అదే పాన్‌లో తరిగిన పనస తొనలు వేసి రెండు నిమిషాల పాటు వేయించి అరకప్పు నీళ్లుపోసి, మూతపెట్టి ఐదు నిమిషాలు సన్నని మంటపై ఉడికించాలి. మెత్తగా అయిన మిశ్రమంలో యాలకుల పొడి, బెల్లం వేసి మరో ఐదు నిమిషాలు కలుపుతూ సన్నని మంటపై ఉడికించాలి. కొబ్బరిపాలు, వేయించిన డ్రై ఫ్రూట్స్ కూడా జోడించి.. దగ్గరపడే వరకు సన్నని మంటమీద పెడితే పనస పాయసం సిద్ధం.

# తామర గింజలతో ఆరోగ్యం



మఖానా, ఫాక్స్ నట్స్, లోటస్ సీడ్స్‌గా పేరొందిన తామర గింజలతో బోలెడు ఆరోగ్య ప్రయోజనాలున్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. సమతులాహారంలో భాగంగా వీటిని పరిమిత మోతాదులో తీసుకుంటే శరీరానికి ఎంతో మేలు చేస్తుంది. మఖానా లో క్యాలరీ స్నాక్‌గా పేరొం దడంతో బరువు తగ్గాలనుకునేవారికి ఇది దివ్యౌషధంగా ముందుకొస్తుంది. మఖానాలో సంతృప్త కొవ్వులు తక్కువగా ఉండటంతో పాటు కొలెస్ట్రాల్‌ను దరిచేరనివ్వ. హార్ట్ హెల్తీ స్నాక్‌గా కూడా మఖానా ఎంతో శ్రేష్టమని న్యూట్రిషియన్లు చెబుతున్నారు. ఇందులో ప్లాంట్ బేస్డ్ ప్రొటీన్ అధికంగా ఉండటంతో శక్తిని, ఉత్తేజాన్నీ అందిస్తుంది. శరీర పనితీరుకు, కండపుష్టికీ మఖానా స్నాక్స్ మేలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇక మఖానాలో అత్యధిక ఫైబర్ ఉండటంతో మలబద్ధకాన్ని నివారించి జీర్ణక్రియ సాఫీగా సాగేందుకు ఉపకరిస్తుంది. మఖానాను రోస్ట్, వేపుడు వంటి పలు రూపాల్లో స్నాక్స్‌గా తీసుకోవడంతో పాటు కూరలు, డెజర్ట్స్‌లో వాడుకోవచ్చు. ఎంతో రుచిగా ఉండే మఖానాలో కేమ్ప్‌ఫెరోల్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉండటంతో ఇవి ఆక్సిడేటివ్ స్ట్రెస్ నుంచి కణాలను కాపాడుతూ తీవ్ర అనారోగ్యాలు, వ్యాధుల బారినపడకుండా కాపాడతాయి.

## మార్కెట్

### భారీగా పెరిగిన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

# బంగారం నిల్వలు



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బంగారం నిల్వలు భారీగా పెరిగాయి. మార్చి నుంచి సెప్టెంబర్ మధ్య బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషల్ సెటిల్‌మెంట్స్ నుంచి 102 టన్నుల బంగారాన్ని బదిలీ చేసుకుంది. దీంతో ఆర్‌బీఐ బంగారం నిల్వలు 855 మెట్రిక్ టన్నులకు చేరాయి. ఈ విషయాన్ని ఆర్‌బీఐ హాఫ్ ఇయర్ నివేదిక వెల్లడించింది. ఇందులో స్వదేశంలో 510.5 టన్నులు, బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద 324 మెట్రిక్ టన్నుల నిల్వ ఉన్నది. ఇక మరో 20.26 టన్నుల బంగారం డిపాజిట్ల రూపంలో ఆర్‌బీఐ వద్ద ఉందని నివేదిక పేర్కొంది. మొత్తం విదేశీ మారక నిల్వలలో బంగారం వాటా మార్చి 2024 చివరి నాటికి 8.15 శాతం నుంచి సెప్టెంబర్ 2024 చివరి నాటికి దాదాపు 9.32 శాతానికి పెరిగింది. మార్చి 2024 నాటికి ఆర్‌బీఐ వద్ద 822.10 టన్నుల బంగారం ఉన్నది. ఇందులో దేశీయంగా 408.31 టన్నులు, 387.26 టన్నులు బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఫర్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ ఉన్నది. 26.53 టన్నుల బంగారం డిపాజిట్ల రూపంలో ఉంది. ఈ సంవత్సరం ప్రారంభంలో బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్ నుంచి ఆర్‌బీఐ వంద టన్నుల బంగారాన్ని భారత్‌కు దిగుమతి చేసుకున్నది. గత ఆర్థిక సంవత్సరంలో ఆర్బీఐ వద్ద 822.10 టన్నుల గోల్డ్ నిల్వలు ఉన్నాయి. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తత కారణంగా ఆర్బీఐ విదేశాల్లో ఉంచిన బంగారం నిల్వలను భారత్‌కు దిగుమతి చేసుకుంటున్నది. దాంతో బంగారం సేఫ్‌గా ఉంటుందని అంచనా వేస్తున్నారు. సెప్టెంబర్ 2022 నుంచి భారత్ ఇప్పటి వరకు 214 టన్నుల బంగారాన్ని ఆర్‌బీఐ భారత్‌కు తరలించింది.

# ఒక్కరోజులోనే రూ.60వేల కోట్ల విలువైన బంగారం కొనుగోళ్లు!

ఈ సంవత్సరం దీపావళి సందర్భంగా మార్కెట్‌లో షాపింగ్ జోరందుకుంది. నిన్ననే ధన్తేరస్ పండుగ గడిచిపోయింది. ధన్‌తేరస్ రోజున ఢిల్లీలోనే కాకుండా దేశవ్యాప్తంగా ఉన్న మార్కెట్‌లలో అర్థరాత్రి వరకు దుకాణాలు కొనుగోలు చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా మార్కెట్లలో సుమారు రూ.60 వేల కోట్ల టర్నోవర్ జరిగింది. ఈ మొత్తం పండగల సీజన్‌లో దాదాపు రూ.4.25 లక్షల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. అయితే.. ఈఏడాది.. దీపావళిలోనే చైనాకు రూ.1.25 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది.

**ధన్‌తేరస్‌పై రూ.60,000 కోట్ల వస్తువుల విక్రయం..** ఈ ఏడాది ధన్‌తేరస్ సందర్భంగా దేశవ్యాప్తంగా పండగ వస్తువులకు సంబంధించి దాదాపు రూ.60 వేల కోట్ల వ్యాపారం జరిగిందని అంటున్నారు. మంచి విషయం ఏమిటంటే, ఈ దీపావళికి "వోకల్ ఫర్ లోకల్" అనే ఫిలాసఫీ మార్కెట్‌లలో కనిపిస్తుంది. ప్రస్తుతం మార్కెట్‌లో కొనుగోళ్లన్నీ దాదాపు భారతీయ వస్తువులే. దీపావళికి సంబంధించి చైనా వస్తువులను విక్రయించకపోవడం వల్ల దాదాపు రూ.1 లక్షా 25 వేల కోట్ల వ్యాపారంలో చైనా నష్టపోతోందని ఓ అంచనా.

**రూ. 20 వేల కోట్ల విలువైన బంగారం...** ఓ జాతీయ మీడియా అంచనాల ప్రకారం.. ఈ ధన్‌తేరస్‌లో దేశవ్యాప్తంగా సుమారు రూ. 20,000 కోట్ల విలువైన బంగారం, రూ. 2,500 కోట్ల విలువైన వెండి కొనుగోలు చేయబడింది. ఈ ఏడాది ధన్‌తేరస్‌లో బంగారం, వెండి విక్రయాలు పెరిగాయి. దేశంలో దాదాపు నాలుగు లక్షల మంది చిన్నా పెద్దా నగల వ్యాపారులు పనిచేస్తున్నారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌లో నమోదైన దాదాపు 2 లక్షల మంది నగల వ్యాపారులు నిన్న 25 టన్నుల బంగారాన్ని విక్రయించారు. దీని విలువ రూ.20 వేల కోట్లు. అదేవిధంగా దేశవ్యాప్తంగా 250 టన్నుల వెండి విక్రయాలు జరగగా, దీని విలువ సుమారు రూ.2,500 కోట్లు.

ఒక్క ఏడాదిలోనే భారీగా పెరిగిన ధరలు..
గతేడాది ధన్‌తేరస్ సందర్భంగా 10 గ్రాముల బంగారం ధర రూ.60 వేలు పలికింది. ఈ ఏడాది రూ.81,211కి పెరిగింది. అదేవిధంగా గతేడాది వెండి ధర కిలో రూ.70 వేలు ఉండగా, ప్రస్తుతం రూ.లక్షకు చేరుకుంది. అందువల్ల, బరువులో అమ్మకాలు క్షీణించినప్పటికీ, కరెన్సీ పరంగా అమ్మకాలు పెరిగాయి.

**హస్తకళాకారులు మంచి ప్రోత్సాహం..** ఈ ఏడాది మట్టి దీపాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. స్థానిక స్థాయిలో రూ.10కి 12 మట్టి దీపాలు, రూ.20కి 25 మట్టి దీపాలు చిల్లరగా లభిస్తున్నాయి. ఒక పెద్ద దీపం 10 రూపాయలకు లభిస్తుంది. అయితే దీపావళి సందర్భంగా ప్రతి ఇంట్లో మట్టి దీపాలు, బొమ్మలు, అలంకరణ వస్తువులు వంటివి కొనుగోలు చేస్తారు. దీంతో కుమ్మరులు, ఇతర కళాకారుల ఆదాయం పెరుగుతుంది. దీంతో వారి ఇళ్లలో కూడా దీపావళి జరిపిన వాళ్లమవుతున్నాము.

# బ్యాంకింగ్, ఐటీ షేర్ల అమ్మకాలు..

## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు..



దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం నష్టాలను మూటగట్టుకున్నాయి. బ్యాంకింగ్ షేర్ల అమ్మకాలతో మార్కెట్లు ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల పవనాలతో ఈక్విటీ మార్కెట్లు బుధవారం నష్టాల్లో మొదలయ్యాయి. ఆ తర్వాత ఏ దశలోనూ మార్కెట్లు కోలుకోలేదు. చివరి సెషన్‌లో మార్కెట్లు మరింత నష్టాల్లోకి జారుకున్నాయి. ఉదయం సెన్సెక్స్ 80,237.85 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 80,435.61 పాయింట్ల గరిష్ఠాన్ని తాకిన సెన్సెక్స్.. అత్యల్పంగా 79,821.99 పాయింట్లకు పతనమైంది. చివరకు 426.85 పాయింట్లు పతనమై.. 79,942.18 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 126 పాయింట్లు పతనమై.. 24,340.80 వద్ద ముగిసింది. దాదాపు 2,787 షేర్లు లాభాల్లో కొనసాగగా.. 978 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సిప్లా, శ్రీరామ్ ఫైనాన్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ట్రెంట్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ టాప్ లూజర్‌గా నిలిచాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా కన్స్యూమర్, హీరో మోటోకార్ప్, బ్రిటానియా ఇండస్ట్రీస్, మారుతీ సుజుకీ లాభపడ్డాయి. సెక్టోరల్‌లో ఎఫ్‌ఎంసీజీ, క్యాపిటల్ గూడ్స్, మీడియా 0.5 నుంచి 2శాతం పెరిగాయి. బ్యాంక్, ఫార్మా, ఐటీ ఒకశాతం వరకు పతనమయ్యాయి. బీఎస్‌ఈ మిడ్‌క్యాప్ ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగియగా, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.5 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇదిలా ఉండగా.. దీపావళి రోజున ఎన్‌ఈసీ, బీఎస్‌ఈలతో పాటు కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఎంసీఎక్స్‌లో నవంబర్ ఒకటో తేదీన ముహరత్ ట్రేడింగ్ జరుగనున్నది. ముహురత్ ట్రేడింగ్ అనేది భారతీయ స్టాక్ మార్కెట్లలో దీపావళి రోజున నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. దాదాపు గంట పాటు స్పెషల్ ట్రేడింగ్ కొనసాగుతున్నది. శుభ సమయంలో జరిగే ఈ ప్రత్యేక సెషన్‌లో పెట్టుబడిదారులు, వ్యాపారులు కొనుగోళ్లు చేస్తుంటారు. ఈ సమయంలో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో స్టాక్స్, కమోడిటీలను కొనుగోలు చేస్తుంటారు.

# దీపావళికి చైనాకు రూ.1.25 లక్షల కోట్ల నష్టం...

గత కొన్ని సంవత్సరాలుగా.. దీపావళి, ధన్‌తేరస్‌లలో భారతీయ మార్కెట్లలో చైనా ఉత్పత్తులకు డిమాండ్ తగ్గుతోంది. ముఖ్యంగా అలంకరణ వస్తువుల విక్రయాలు గతంతో పోలిస్తే ఈ సారి గణనీయంగా తగ్గాయి.
తక్కువ డిమాండ్ కారణంగా.. దిగుమతులు కూడా తగ్గుతున్నాయి. దీని కారణంగా దేశీయ వస్తువుల అమ్మకాలు పెరుగుతున్నాయి. నిజానికి ప్రధాని నరేంద్ర మోడీ చేపట్టిన 'వోకల్ ఫర్ లోకల్' ప్రచార ప్రభావం ఇప్పుడు దేశంలో కనిపిస్తోంది. దేశీయ వస్తువులనే కొనుగోలు చేయాలన్న ఆయన నినాదం చైనాపై తీవ్ర ప్రభావం చూయించింది. ఈ ఏడాది దీపావళిన ముఖ్యంగా 'మేడ్ ఇన్ ఇండియా' చూసిన తర్వాతే ఎలక్ట్రానిక్స్, డెకరేషన్ వస్తువులను కొనుగోలు చేస్తున్నారు.

**చైనా ఉత్పత్తులకు వ్యతిరేకత:** ఓ నివేదిక ప్రకారం.. దీపావళికి సంబంధించి చైనా వస్తువుల విక్రయాలు భారీగా క్షీణించడంతో చైనా దాదాపు రూ.1 లక్షా 25 వేల కోట్ల మేర నష్టాన్ని చవిచూస్తోంది. ఎందుకంటే గతంలో చైనా వస్తువుల డిమాండ్ భారీగా ఉండేది. కానీ ప్రస్తుతం వాటికి ఆదరణ కరువైంది. మట్టి దీపాలు, అలంకార వస్తువులను కుమ్మరుల నుంచి కొనుగోలు చేస్తూ.. మంచి సందేశాన్ని అందిస్తున్నారు. దీపావళికి సంబంధించిన వస్తువులను తయారు చేసే తమ ప్రాంతంలోని మహిళలు, కుమ్మరులు, చేతివృత్తులు, ఇతరులకు సహాయం చేయాలని దేశవ్యాప్తంగా వ్యాపార సంస్థలను సీఏఐటీ కోరింది. దీంతో ప్రజల్లో అవగాహన పెరిగి ఇప్పుడు దేశీయ ఉత్పత్తులకే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆయా కార్మికుల ఇళ్లలో కూడా దీపావళి వెలుగులు నింపుతున్నారు. ఇదిలా ఉండగా.. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ (క్యాట్) ప్రకారం.. ఈ ఏడాది ధన్‌తేరస్‌పై దాదాపు రూ.60 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. దీపావళి నాటికి ఈ సంఖ్య లక్ష కోట్లు దాటుతుంది. ఈ కాలంలో బంగారం, వెండితో



పాటు ఇత్తడితో చేసిన పాత్రల కొనుగోలు కూడా భారీగానే జరిగింది. ఈసారి దాదాపు రూ.2500 కోట్ల విలువైన వెండిని కొనుగోలు చేశారు. ఒక్కరోజులో రూ.20 వేల కోట్ల విలువైన బంగారం అమ్ముడుపోయింది.

# సమగ్ర కుటుంబ సర్వేపై అవగాహన సదస్సు



**సుల్తానాబాద్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):** సుల్తానాబాద్ మండల కేంద్రంలోని యశోద నర హరి ఫంక్షన్ ప్యాలెస్ లో సమగ్ర కుటుంబ సర్వే లో భాగంగా ఎన్యూమ రేటర్లకు, సూపర్ వైజర్లకు బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య,తాహసిల్దార్ మధుసూదన్ రెడ్డి, ఎంపీడీవో దివ్యదర్శనరావు హాజరై మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో నవంబర్ 6 వ తేది నుం డి సమగ్ర కుటుంబ సర్వే కార్యక్రమం ప్రారంభించి 18 వ తేదివరకు ముగించాలిసిఉంటుందన్నారు. పదమూడు రోజుల పాటు ఈ సమగ్ర కుటుంబ స ర్వే కొనసాగుతుందన్నారు. ప్రతి పది మంది ఎ న్యూ మరేటర్ల పై ఒక సూపర్వైజర్ పరిశీలకులు గా వ్యవహరిస్తారని వెల్లడించారు. మండలంలో సుమారు 97 మంది ఎన్యూమరేటర్లకు సూపర్ వైజర్స్ ఈ సర్వే కార్యక్రమంలో బాధ్యతలు నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఈ సర్వే ప్రక్రియ ప్రారంభానికి ముందు నవంబర్ 1, 2, 3 తేదీలల్లో గ్రామాల్లో ఎన్యూమరేటర్లు ఇంటిం టికి తిరుగుతూ వివరాల సేకరణతో పాటు ఇంటిం టికి స్టిక్కర్స్ అంటించే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఎన్యూమరేటర్ 150 ఇండ్లకు సంబంధించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రక్రి య నిర్వహించాలిసి ఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, మేనేజర్ అలీముద్దీన్,ఎంఈఓ ఆరెపల్లి రాజయ్య , పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ వార్డు ఆ ఫీసర్లు,ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

## మంథని ఆర్డీవోగా సురేష్




**మంథని అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** మంథని ఆర్డీవో గా కాశబోయిన సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతం లో పని చేసిన ఆర్డీవో హనుమాన్ నాయక్ ను రాష్ట్ర భూ పరిపాలన కమిషనర్ కు జిల్లా కలెక్టర్ సరేందర్ చేశారు. ఇటీవల డిప్యూటీ కలెక్టర్ లను బదిలీ లో భాగంగా ఆర్డీవో లను సైతం బదిలీ చేయడం తో సురేష్ మంథనికి బదిలీ పై వచ్చారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీవో కు డిఏవో తూము రవీందర్ తో పాటు పలువురు సిబ్బంది పుష్ప గుచ్చం ఇచ్చి స్వాగతం పలికారు.

## మద్యానికి బానిసై యువకుడు మృతి



**మంథని అక్టోబర్ 30( నినాదం న్యూస్) :** మద్యానికి బానిసై యువకుడు మృతి చెందిన సంఘటన ముత్తారం మండలం లో చోటుచేసుకుంది. కేశనపల్లి గ్రామానికి చెందిన ఆలువోజు వెంకటేష్ (24) కొంతకాలంగా లారీడ్రైవర్ పనిచేసుకుంటూ జీవిస్తున్నాడు. మంగళవారం రాత్రి మద్యం తాగి వచ్చి అర్ధరాత్రి సమయంలో మద్యం మత్తులో ఇంట్లో దూలానికి చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుని తండ్రి ఆలువోజు స్వామి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముత్తారం ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.

## దాడికి పాల్పడిన వ్యక్తులపై కేసు నమోదు

**బెల్లంపల్లి అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** బెల్లంపల్లి మండలం బుచ్చయ్యపల్లి కి చెందిన కచ్చు రాజ్ కుమార్ పై అతని భార్య,అత్త దాడి చేసినందుకు కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి రూరల్ సిఐ అఫ్జలుద్దీన్ తెలిపారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం గత 6నెలల క్రితం కుటుంబ గొడవల కారణంగా భార్య కచ్చు మనిషా ఆమె తల్లిదండ్రుల వద్దనే ఉంటుంది.ఇదే క్రమంలో బుధవారం ఉదయం ఫిర్యాదుదారుడు తన ఇంటి పక్కనే ఉండే తన కూతురు సహన్ని ని పిలవడంతో తన కూతురు తన వద్దకు రాగా భార్య మనిషా,అత్త రాజేశ్వరి లు ఫిర్యాదుదారుడిని తిట్టడంతో అక్కడే ఉన్న ఫిర్యాదుదారుని తల్లి ఎందుకు తిడుతున్నావు అని అడుగగా మనిషా బండరాయితో ఫిర్యాదారుని తల్లిపై దాడి చేసింది,అంతేకాకుండా అత్త కూడా బూతులు తిడుతు కొట్టిందని తెలిపారు.గొడవ జరుగుతుండగా అక్కడే ఉన్న ఫిర్యాదుదారుని తమ్ముడు మహేష్,గ్రామస్తురాలైన కొమురక్క లు ఆపడానికి ప్రయత్నం చేయగా వారిని సైతం బూతులు తిట్టి, దాడికి ప్రయత్నించినట్లు తెలిపారు.బాదితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

## ఎమ్మెల్యేని మర్యాదపూర్వకంగా కలిసిన మండల వ్యవసాయ మార్కెట్ నూతన పాలకవర్గం



**సుల్తానాబాద్, అక్టోబర్ 30(నినాదం న్యూస్):** నూతనంగా నియమితులైన సుల్తానాబాద్ మం డల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ మినుపాల ప్ర కాష్ రావు, వైస్ చైర్మన్ గణేష్ ,నూతన డైరెక్టర్లు బుధవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఎ మ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పెద్దపల్లి ఎమ్మె ల్యే చింతకుంట విజయరమణరావు ని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సత్క రించి తమ పై నమ్మకం తో సుల్తానాబాద్ వ్యవ సాయ మార్కెట్ నూతన పాలకవర్గంలోకి నియ మించి న సందర్భంగా గౌరవ పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణరావుకి కృతజ్ఞతలుతెలియజేశారు. అనంతరం పెద్దపల్లి ఎమ్మెల్యే నూతన చైర్మన్ మి నుపాల ప్రకాష్ రావు, వైస్ చైర్మన్ ఉస్తాం గణేష్ కి పాలకవర్గ సభ్యులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే రైతు సంక్షే మానికి కృషి చేయాలని సుల్తానాబాద్ మండల వ్యవసాయ మార్కెట్లో రైతులకు ఎలాంటి ఇబ్బం దులూ లేకుండా చూసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా గ్రంధాలయం చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, సింగిల్ విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్, ప్రకాష్ రావు, సాయిరి మహేందర్, అబ్బయ్య గౌడ్, చిలుక సతీష్,జానీ,సంతోష్ రావు మరియు డైరెక్టర్లు,కాంగ్రెస్ పార్టీప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులే వంట మనుషులుగా మారిన వేళ

- విద్యార్థులతో వంట సామాన్లు మోయిస్తున్న సిబ్బంది



**బెల్లంపల్లి అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** కళాశాలలో విద్యనభ్యసించే విద్యార్థులే వంట మనుషులుగా మారిన సంఘటన అందరిని ఆశ్చర్యానికి గురి చేసింది.వివరాల్లోకి వెళితే మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణం శివాలయం సమీపంలోని కాసిపేట ఎస్ సి బాలుర సంక్షేమ గురుకుల కళాశాలలో ఉపాధ్యాయలు,సంబంధిత సిబ్బంది విద్యార్థులతో నిత్యం వంటపనులు చేయిస్తు వేదింపులకు గురిచేస్తున్న సంఘటన చోటు చేసుకుంది.బుధవారం కళాశాలలో విద్యార్థులతో వంట పనులు చేయిస్తున్న విషయం ఓ వ్యక్తి ద్వారా వెలుగు చూసింది.కళాశాలలో విద్యార్థులతో పెద్ద పెద్ద వంట సామాగ్రిని మోయించడం,వంట పనులు చేయిస్తుండడం రహస్యంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో వైరల్ చేశారు.కళాశాలలో రోజుకొక తరగతి విద్యార్థులను వంట పనులకు కేటాయిస్తున్నారని,ప్రతినిత్యం తమతో వంట పనులు చేయించడంతోపాటు,బరువైన వంట సామాగ్రి గిన్నెలను మోయిస్తున్నారని కొంతమంది విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయం రహస్యంగా విద్యార్థి సంఘాల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.కళాశాల ప్రిన్సిపల్ సంతోష్ కుమార్,అసిస్టెంట్ కేర్ టేకర్ వెంకటేష్ లపై గురుకుల సంక్షేమ అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు.

## విధి నిర్వహణలో పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



**బెల్లంపల్లి అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్,మంచిర్యాల డిసిపి ఎ భాస్కర్ ల ఆదేశాల మేరకు,బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ ల ఆధ్వర్యంలో బెల్లంపల్లి మండలంలోని కాశిరెడ్డి పల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా వివిధ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సిఐ అఫ్జలుద్దీన్ మాట్లాడుతు విధి నిర్వహణలో భాగంగా ఎంతో మంది పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల రక్షణకై అమరులయ్యారని అన్నారు.వారి ప్రాణ త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేము అని అన్నారు.ఈ సందర్భంగా కళాబృందంచే గ్రామస్తులకు డయల్100,సైబర్ క్రైమ్స్,షీ టీమ్స్ పనితీరు,మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాలు,నూతన పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు.తాళ్ల గురజాల టూ టౌన్ ఎస్ఐలు రమేష్, మహేందర్ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

- బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి



**మంథని అక్టోబర్ 30 (నినాదం ) :** ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులు అస్వస్థతకు గురి కావడంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు ఆయన వినతి పత్రాన్ని అందజేశారు .అనంతరం ఆయన మట్లడుతూ ఆదివారం సుమారు 53 మంది విద్యార్థినీలు అస్వస్థతకు గురయ్యారని, వారి అస్వస్థతకు గల కారణాలను దాచి పెట్టి విషయాన్ని తప్పుదోవ పట్టించి అందుకు బాధ్యులైన వారిని కాపాడే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. 6,7, తరగతులు, ఇంటర్ విద్యార్థులతో హాస్టల్ ఆవరణలో గల గడ్డిని కోయించారని, అయితే గడ్డికి రెండు రోజుల క్రితమే గడ్డి మందు (స్ప్రే) చేయడంతో గడ్డి కోసిన విద్యార్థినీలు విపరీతమైన దగ్గుతో అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. ఇప్పటికైనా దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులైన వారిపై చర్యల తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపిలు జక్కుల ముత్తయ్య, అత్తె చంద్రమౌళి, మాజీ వైస్ ఎ పిపి సుదాటి రవీందర్ రావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ గుజ్జుల రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ నూనె కుమార్, మాజీ వ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య తదితరులున్నారు.

**ప్రిన్సిపాల్, ఇంచార్జ్ఎస్ వెంటనే విధుల నుంచి తొలగించాలి..**

ముత్తారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రిన్సిపల్, ఇన్చార్జి ఎస్ ఓ, ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకొని వారిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షకు ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన బొల్లంపల్లి సంతోష్ కుమార్ గౌడ్ వినతి పత్రాన్ని బుధవారం అందజేశారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం విద్యార్థులతో ప్రిన్సిపల్, ఇన్చార్జి ఎఓ, ఉపాధ్యాయులు గడ్డి మందు (స్ప్రే) చేయించడమే కాకుండా (స్ప్రే చే యబడ్డ గడ్డిని సైతం కోయించారని, దీని కారణంగా విద్యాలయంకు చెందిన 53 మంది విద్యార్థినీలు తీవ్రమైన దగ్గుతో అస్వస్థతకు గురాయ్యరని ఆరోపించారు. వెంటనే బాధ్యులైన ప్రిన్సిపల్, ఇన్చార్జి ఎని, బాధ్యులైన ఉపాధ్యాయులను విధుల నుంచి శాశ్వతంగా తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

## అదనపు కలెక్టర్‌ను కలిసిన గెజిటెడ్ అధికారుల సంఘం



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్30 (నినాదం) :** పెద్దపల్లి అదనపు కలెక్టర్( రెవెన్యూ ) గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన డి. వేణును తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు తూము రవీందర్, కార్యదర్శి బ్రహ్మానంద రెడ్డి లు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. పుష్పగుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ ప్రెసిడెంట్ అలివేణి, కుమార్, షాజీద్ అలీ, అంజని, శ్రీనివాస్, మధు, శంకర్ యాదవ్, గంగా ప్రణవ్, సతీష్ పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని అసిస్టెంట్ లేబర్ అధికారి



**బెల్లంపల్లి అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** బెల్లంపల్లి పట్టణంలోని అసిస్టెంట్ లేబర్ అధికారి సమయపాలన పాటించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడని ఆయన వెంటనే సస్పెండ్ చేయాలని ఎంసిపిఐయు పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ డిమాండ్ చేశారు.బుధవారం ఆయన కార్యాలయ హరణలో మాట్లాడుతు గతంలో అసిస్టెంట్ లేబర్ అధికారిపై ఎన్నోసార్లు ఫిర్యాదులు చేసినప్పటికి ఆయన తీరు మాత్రం మారడం లేదని అన్నారు.రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేదలు,కూలి నాలి చేసుకునే ప్రజలు లేబర్ ఆఫీసుల చుట్టు తిరుగుతు నరకయాతన అనుభవిస్తున్నారని,రెన్యువల్,కొత్త లేబర్ కార్డుల కోసం,డెత్ స్కీమ్స్,మ్యారేజ్ గేమ్స్,డెలివరీ స్కీమ్స్ అప్లై చేసుకున్న వారు కూడా ఎంతోమంది వస్తుపోతు ఉంటారు కాని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మాత్రం అందుబాటులో ఉండక జూనియర్ అసిస్టెంట్ అందుబాటులో ఉండేసరికి అతడిని సమాధానం అడుగుతే మేడం రాలేదు మేడం దగ్గర ఫైల్స్ ఉన్నాయి మేడంను అడుక్కోండి అని అతను పొంతనలేని సమాధానం చెప్పడం జరుగుతుందని ఆయన అన్నారు.నిరుపేదల కోసం పెట్టిన స్కీం లను కూడా బయటకు ప్రచారం చేయకుండా అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కార్యాలయంలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని,అదేవిధంగా ఒక అటెండర్ ను నియమించాలని, అంతేకాకుండా లేబర్ ఆఫీసర్ కూడా అందుబాటులో ఉంటు,సమయపాలన పాటించేటట్లు చూడాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఎంసిపిఐ యు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

## కూరగాయల మార్కెట్‌కు గుండా మల్లేష్ పేరు నామకరణం చేయాలి



**బెల్లంపల్లి అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ కు మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ పేరు నామకరణం చేయాలని పట్టణ సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో బెల్లంపల్లి ఎసిపి,ఆర్ డి ఓ,తహసీల్దార్,మున్సిపల్ కమిషనర్,మున్సిపల్ చైర్మన్ లకు బుధవారం వినతి పత్రాలు అందజేశారు.ఈ సందర్భంగా పట్టణ కార్యదర్శి ఆడేపు రాజమౌళి మాట్లాడుతు గుండా మల్లేష్ 4పర్యాయాలు సిపిఐ ఎమ్మెల్యేగా ఎన్నికై బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని,ఆయన కృషి వల్లే బెల్లంపల్లికి పాలిటెక్నిక్ కళాశాల,ఆర్ టి సి బస్టాండ్,ప్రభుత్వ పాఠశాలలకు భవన నిర్మాణాలు,ప్రహరీ గోడలు,ప్రభుత్వ కార్యాలయాల భవనాలు వచ్చాయని అన్నారు.సిపిఐ పార్టీ ద్వారా బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం అనేక పోరాటాలు చేశారని తెలిపారు.ముఖ్యంగా1999లో కూరగాయల మార్కెట్లోని షాపులు అగ్నికి ఆహుతైనప్పుడు కూరగాయల వ్యాపారులు అందరు అన్ని కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉండగా గుండా మల్లేష్ వారికి అండగా నిలబడి తన స్వంత ఖర్చులతో కూరగాయల వ్యాపారం చేసుకోడానికి వీలుగా షెడ్డులు నిర్మించి ఇచ్చి ఆదుకున్న మహనీయుడు అని అన్నారు.అలాంటి మహనీయుని పేరు కాకుండా బెల్లంపల్లి పట్టణానికి,మార్కెట్ కు సంబంధంలేని కాక వెంకటస్వామి పేరును ప్రతిపాదిస్తు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానించడాన్ని సిపిఐ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు.నిజాయితీకి మారుపేరుగా అక్రమార్జనకు తావు లేకుండా ప్రజలకు సేవ చేసిన ఆయన పేరు పెట్టడానికి ఎమ్మెల్యే,మున్సిపల్ చైర్ పర్సన్,కౌన్సిలర్లు మరోసారి కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసి మార్కెట్ కు తమ నాయకుడి పేరు నామకరణం చేయాలని కోరారు.లేనిపక్షంలో తీర్మానాన్ని నిరసిస్తు దశల వారి ఆందోళనలు, పోరాటాలు, ధర్నాలు, రాస్తారోకోలు,రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు.



## గ్రంథాలయ చైర్మన్‌ను గజమాలతో ఘనంగా సన్మానించిన కొదురుపాక గౌడ సంఘం

**సుల్తానాబాద్, అక్టోబర్ 30(నినాదం న్యూస్) :** పెద్దపల్లి గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌ డ్ ను కొదురుపాక గౌడ సంఘం భూషణ వేణి రా జ గౌడ్ ఆధ్వర్యంలో గజ మాలతో ఘనంగా సన్మా నించారు. బుధవారం సుల్తానాబాద్ మండలం కొ దురుపాక గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దే వాలయం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో గ్రంథాల య చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ కు గజమాల వేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కా ర్యక్రమంలో రాజా గౌడ్ తోపాటు గౌడ సంఘ నా యకులు శ్రీధర్ గౌడ్, నంబయ్య గౌడ్, మల్లయ్య గౌడ్ ,లక్ష్మయ్య గౌడ్ ,కనకయ్య గౌడ్, రాములు గౌడ్, శ్రీహరి గౌడ్, బాలాజీ గౌడ్ తో పాటు గౌడ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## టాస్క్ సీఓఓగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి




**మహేశ్వరం, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ మంత్రి వర్యులు శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు అమెరికాలోని లాస్ వేగాస్ లో జరిగిన “ఐటి సర్వ్ సినర్జీ సమ్మిట్” లో తెలంగాణ రాష్ట్రం నుంచి అధికారికంగా పాల్గొన్న ఐటీ ప్రిన్సిపల్ సెక్రటరీ జయే శ్ రంజన్ టాస్క్ సి. ఓ. ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఐటీ సినర్జీ సమ్మిట్ ప్రాంగణంలో వివిధ కంపెనీల ప్రతినిధులను కలిసి తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో తెలంగాణ డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ లక్ష్యాల సాధన, స్మార్ట్ గవర్నెన్స్ కోసం తెలంగాణ ప్రభుత్వం రూపొందిస్తున్న ప్రణాళికల అమలు, ఎఐ ఇన్నోవేషన్ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ ను మార్చాలన్న తెలంగాణ ప్రజా ప్రభుత్వ ఆశయం,తెలంగాణ రాష్ట్రంలో పబ్లిక్ సర్వీసెస్ డెలివరీ సిస్టమ్, డిజిటల్ గవర్నెన్స్ మెరుగుదల,ఈ-గవర్నెన్స్ కార్యకమాలు,స్కిల్ డెవలప్మెంట్, యంగ్ ఇండియా స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ లక్ష్యాలు గురించి వివిధ కంపెనీల ప్రతినిధులతో చర్చించి, వారి నిబద్ధత, శ్రద్ధ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల సాధనకు ఉపయోగపడుతుందని, తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను పరిశీలించాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ దివాళి

**భీమదేవరపల్లి అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** హనుమకొండ జిల్లా భీమదేవర పల్లి మండలం మల్కనూర్ లోని ఎ కె వి ఆర్ జూనియర్ అండ్ డిగ్రీ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ఆధ్వర్యంలో గ్రీన్ దీవాలి నిర్వహించడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గ్రీన్ దీవాలి నిర్వహించడం జరుగుతుంది అని కళాశాల ప్రిన్సిపల్ భూపతి శ్రీకాంత్ అన్నారు. ఈ కార్య క్రమంలో కళాశాల అధ్యాపకులు నిజమేనా గుంటి ఓదెలు శ్రీదర్ల భారతి ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.




## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్



**మహేశ్వరం, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** దీపావళి పండుగ సందర్భముగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలుపుతున్న సంతోష్ నగర్ ఐ ఎస్ సదన్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక ప్రఖ్యాతిగాంచిన దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, కుటుంబ సభ్యుల బంధువులమిత్రుల ఆనందత్సాహాలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా దీపావళి ఘనంగా జరుపుకోవాలన్నారు. నినాదం న్యూస్ జర్నలిస్టుతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాల్లో ఈ పండుగ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్నా మత బేధాలు లేకుండా చిన్న పిల్లలం నుండి పెద్దవారి వరకు వీధిలోకి వచ్చి దీపావళినాడు దీపాలు పెట్టడం, ప్రజలు అందరూ టపాకాయలు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, బాంబులు కాల్చడం మాయంగా ఉంటుందనీ పేర్కొన్నారు. టపాకాయలు కాల్చడం పిల్లలను దూరంగా ఉంచి ఆనంద ఉత్సాహాలతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పండుగ ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు ముఖ్యంగా పెద్ద పెద్ద నగరాల్లో తెలుగు వారు దీపావళి సంబరాలు అంబరాన్ని సంబరాలగా జరుపుకుంటాయన్నారు. జీవితంలో ఆనందం కలిగిస్తుందని మీకు మీ కుటుంబ సభ్యులకు దీపావళి శు భాకాంక్షలు తెలియజేశారు.

## ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపిన భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుదూ చౌహాన్



**మహేశ్వరం, అక్టోబర్ 30 (నినాదం న్యూస్) :** దీపావళి పండుగ సందర్భముగా తెలంగాణ రాష్ట్ర ప్రజలందరికీ శు భాకాంక్షలు తెలుపుతున్న భగవాన్ ఫౌండేషన్ చైర్మన్ దుదూచౌహాన్ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రపంచంలో అత్యధిక ప్రఖ్యాతిగాంచిన దీపావళి పర్వదినాన్ని పురస్కరించు కుని ప్రజలందరూ సుఖసంతోషాలతో, సిరిసంపదలతో, కుటుంబ సభ్యుల బంధువులమిత్రుల ఆనందత్సాహాలతో ఎంతో ప్రతిష్టాత్మకంగా దీపావళి ఘనంగా జరుపుకోవాలన్నారు. నినాదం న్యూస్ జర్నలిస్టుతో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రపంచ దేశాల్లో ఈ పండుగ సందర్భంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ అన్నా మత బేధాలు లేకుండా చిన్న పిల్లల నుండి పెద్దవారి వరకు వీధిలోకి వచ్చి దీపావళినాడు దీపాలు పెట్టడం, ప్రజలు అందరూ టపాకాయలు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, బాంబులు కాల్చడం మాయంగా ఉంటుందనీ పేర్కొన్నారు. టపాకాయలు కాల్చడం పిల్లలను దూరంగా ఉంచి ఆనంద ఉత్సాహాలతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ పండుగ ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటున్నారు ముఖ్యంగా పెద్ద పెద్ద నగరాల్లో తెలుగు వారు దీపావళి సంబరాలు అంబరాన్ని సంబరాలగా జరుపుకుంటాయన్నారు. జీవితంలో ఆనందం కలిగిస్తుందని మీకు మీ కుటుంబ సభ్యులకు దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు.

# అన్నదాతకు 'అకాల' ఆందోళన

## కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం, పత్తి నిల్వలు - వర్షం కొనసాగితే తీవ్రంగా నష్టపోయే అవకాశం





**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్ 30( నినాదం):** రాష్ట్రంలో ఒక్క సారిగా వాతావరణం మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బుధవారం ఉదయం కురిసిన అకాల వర్షం రైతులు ఆందోళనకు గురిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా పది రోజుల క్రితం నుంచి వరి కోతలు మొదలయ్యాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు చేరుతోంది. పత్తి చేతికందుతోంది. ఈ సమయంలో వాతావరణంలో అనూహ్య మార్పులు రైతులకు కలవరం పుట్టించాయి. కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం కొన్నిచోట్ల తడిసింది. అందుబాటులో ఉన్న రైతులుధాన్యం తడవకుండా ట్రాక్టర్ల సాయంతో కుప్పలు చేసి టార్పాలిన్లు కప్పేశారు. వర్షం కొనసాగితే తాము తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఉదయం నుంచి చాలాచోట్ల ఆకాశం మేఘావృతమై ఉంది. పలు జిల్లాలో ఉదయం భారీ వర్షం కురిసింది. మళ్లీ సాయంత్రం మబ్బులు కమ్మేశాయి. వర్షం కొనసాగే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలు ఇప్పుడే చేతికొస్తున్నాయి. వర్షం అధికంగా కురిస్తే వరి నేలవాలి దెబ్బ తినే అవకాశం ఉంది. అలాగే చేతికందే దశలో చేలలో ఉన్న పత్తి తడిసిపోయి రంగు మారి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉంది. బుధవారం కురిసిన వర్షానికి పలు ప్రధాన మార్కెట్లతో అమ్మకానికి ఉంచిన పత్తి తడిసిపోయింది.

# జిల్లాలో మావోయిస్ట్ లేఖ కలకలం

- బిఆర్ఎస్ నాయకులకు మావోయిస్ట్ అధికార ప్రతినిధి హెచ్చరింపులు
- దోచుకున్న సొమ్మును వెంటనే చెల్లించాలని డిమాండ్
- లేకుంటే ప్రజాక్షేత్రంలో శిక్ష తప్పదని హెచ్చరిక
- తీరుమార్చుకోని ప్రజల మధ్యలో సన్నిహితంగా ఉండాలని సూచన



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 30 నినాదం న్యూస్ :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మావోయిస్ట్ లేఖ కలకలం రేపుతోంది. భారత కమ్యూనిస్ట్ పార్టీ (మావో యిస్ట్) తెలంగాణ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పేరిట బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఏర్పాటైన దళితబంధు విషయంలో బిఆర్ఎస్ నాయకులు అడ్డగోలు దోపిడికి గురయ్యారని లేఖలో ఆరోపించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పేరుతో అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి దళిత బంధు ఇప్పిస్తామని ఆశలు చూపి మొదటి, రెండవ విడత లక్షల రూపాయలు తీసుకొని ప్రజలను మోసం చేసి ఇబ్బందులకు గురి చేస్తున్న రాజకీయ బ్రోకర్స్ ను ఖబర్దార్ అని హెచ్చరిం చినట్లు ప్రకటనలో. పేర్కొన్నారు. తీరు మార్చు కొని ప్రజల దగ్గర తీసుకున్న రూపాయలను వెంటే ఇవ్వాలని హెచ్చరించినట్లు లేఖలో పేర్కొన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం కాటారం మండలం, మహదేవపూర్, మల్హర్రావు, పలిమెల, భూపాలపల్లి మండలాలతో పాటు ఇతర మండలాలకు సంబంధించిన నాయకులు పేదల దగ్గర దళిత బంధు పేరుతో తీసుకొని ఆన్యాయం చేసిన వారు తిరిగి వెంటనే వారికి తీసుకున్న సొమ్మును చెల్లించాలని డిమాండ్ చేశారు. లేని యెడలో ప్రజల చేతిలో శిక్ష తప్పదని హెచ్చరించారు.

# పన్ను బకాయిదారులపై కొరడా

## రెవెన్యూ రికవరీ యాక్ట్ కింద రూ. 20.24 లక్షలు వసూలు: జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి ప్రతినిధి, అక్టోబర్30(నినాదం):** రామగుండం కార్పొరేషన్‌లో పన్ను బకాయిదా రులపై జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష కొరడా జులిపిస్తున్నారు. రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయో గించి బకాయిలు వసూలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే రామగుండంలోని సింధూర ఇంజనీరింగ్ కళాశాల నుంచి రూ.20,24,140 లను వసూలు చేసినట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామగుండం కార్పొరేషన్‌లో ఉన్న సింధూర ఇంజనీరింగ్ కళాశాల ఆస్తి పన్ను గత 5 సంవత్సరాల నుండి చెల్లించలేదని తెలిపారు. రామగుండం మున్సిపల్ కమిషనర్ చేసిన ఫిర్యాదు మేరకు రామగుండం తహసీల్దార్ కుమారస్వామి చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. దీంతో సింధూర ఇంజనీరింగ్ కళాశాల ప్రతినిధులు బకాయి ఉన్న ఆస్తిపన్ను రూ.20. 24 లక్షలు బుధవారం చెల్లించారని తెలిపారు. అలాగే రామగుండం కార్పొరేషన్ కు ఆస్తి పన్ను బకాయి ఉన్న మరో తొమ్మిది మందికి తహసీ ల్దార్ నోటీసులు జారీ చేశారని పేర్కొన్నారు. వెంటనే చెల్లించకుంటే చట్టప్రకారం ఆస్తులను స్వాధీన పర్చుకుని వేలం ద్వారా బకాయిలు వసూలు చేస్తామని తెలిపారు. ఓ సినిమాథియేటర్ యజమాని హైకోర్టును ఆశ్రయించి స్టే పొందేందుకు ప్రయత్నం చేసినప్పటికీ సకాలంలో తహసిల్దార్ రామగుండం హై కోర్టు లో కౌంటర్ దాఖలు పర్చి వారికి స్టే రాకుండా అడ్డుకోవడం జరిగిందన్నారు. జిల్లాలో వివిధ స్థానిక సంస్థలకు ఆస్తి పన్ను దీర్ఘ కాలికంగా ఆస్తి పన్ను బకాయిదారులు వీలైనంత త్వరగా చెల్లించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే



**సుల్తానాబాద్, అక్టోబర్ 30 (నినాదం న్యూస్):** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పె ద్దపల్లి ఎమ్మెల్యే చింత కుంట విజయరమణారా వు స్పష్టం చేశారు. బుధవారం సుల్తానాబాద్ మం డలం దేవునిపల్లి, కొదురుపాక, నారాయణపూర్, చిన్న బొంకూర్, మియాపూర్, పెరకపల్లి గ్రామాల్లో బుధవారం సింగిల్ విండో, ఐకెపి ఆధ్వర్యంలో ఏ ర్పాటుచేసిన వడ్ల కొనుగోలు కేంద్రాలను స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల కోసం మొసలి కన్నీరు కారుస్తూ ఇటీవల కాలంలో బీఆర్ఎస్ లీడర్లు ధర్నాలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రైతులకు సంపూర్ణంగా రుణమాఫీ చేయకుండా వారిని వడ్డీల పాలు చేసింది గత బీ ఆర్ఎస్ ప్రభుత్వం కాదా అని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం కాంగ్రెస్ ప్రభుత్వం ఏక కాలంలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని వివరించారు. అలాగే, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.5 వందల చొప్పున బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. ఎన్ని క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మితే రైతులకు పరిమితి లేకుండా క్విం టాల్‌కు రూ. 500 చొప్పున బోనస్ ఇవ్వడం జ రుగుతుందన్నారు. ఈ విషయంలో కూడా రైతుల ను బీఆర్ఎస్ నేతలు అయోమయానికి గురిచే స్తున్నారని మండిపడ్డారు. రైతులు ఎలాంటి అపోహ లకు గురికా వద్దని ఆయన కోరారు. వచ్చే యాసంగి పంట నుండి రైతులకు రైతు భరోసా చెల్లించడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా జిల్లా యూనిట్ కాకుండా మండలాన్ని యూనిట్‌గా తీసుకొని పంటల భీమా పకడ్బందీగా అమలు చే యడం జరుగుతుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా రైతు పక్షపాత ప్రభు త్వమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పె ద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అ న్నయ్య గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ మినుపాల ప్రకాష్ రావు, సింగిల్ విండో చైర్మన్ మోహన్ రావు, సింగిల్ విండో చైర్మన్ సిరిగిరి శ్రీనివాస్, సాయిరి మ హేందర్, చిలుక సతీష్, అబ్బయ్య గౌడ్, మండల రమేష్, ఎనగందుల ప్రదీప్, గిరేనేని సంపత్ రావు, అంజన్ రావు, కొండల్ రావు, మాధవ రావు, మో హన్ రెడ్డి, పన్నాల రాములు,శ్యాం సుందర్ రెడ్డి, సాగర్, కర్ణకర్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# హిందీలో మరో ఛాన్స్ కొట్టేసిన రష్మిక



దక్షిణాదితోపాటు ఉత్తరాదిలోనూ వరుస చిత్రాలు చేస్తూ కెరీర్‌లో దూసుకెళ్తున్నారు నటి రష్మిక గతేడాది 'యానిమల్'తో విజయాన్ని అందుకున్న ఆమె ప్రస్తుతం చేతి నిండా చిత్రాలతో వరుస షూటింగ్స్‌తో గ్యాప్ లేకుండా గడుపుతున్నారు. తాజాగా బాలీవుడ్‌లో మరో ప్రాజెక్ట్ ఓకే చేశారు. 'స్త్రీ', 'బేడియా', 'ముంజ్య' క్రియేటర్స్ దీనిని తెరకెక్కించను న్నారు. విభిన్న కాన్సెప్ట్‌తో రూపుదిద్దుకోనున్న ఈ చిత్రానికి 'థమా' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ రష్మిక తాజాగా ఓ పోస్ట్ పెట్టారు. ఈ యూనివర్స్ ఒక ప్రేమ కథ కోరుకుంటుంది. దురదృష్టవశాత్తూ అది చాలా ఉద్వేగంతో కూడుకున్నదని టీమ్ పేర్కొంది. ఆయుష్మాన్ ఖురానా, నవాజుద్దీన్ సిద్ధిఖీ, పరేశ్ రావల్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. 'ముంజ్య' దర్శకుడు ఆదిత్య సర్పోత్థార్ దీనికి దర్శకత్వం వహించనున్నారు.

# నయనతారపై నెట్‌ఫ్లిక్స్ డాక్యుమెంటరీ



అగ్ర కథానాయిక నయనతార జీవితంపై డాక్యుమెంటరీ ఫిల్మ్ సిద్ధమైంది. ఆమె వృత్తి, వ్యక్తిగత జీవితంపై ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ దీనిని రూపొందించింది. ఇప్పటికే విడుదలైన ప్రోమో సినీప్రియులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈనేపథ్యంలో తాజాగా ఈ డాక్యుమెంటరీకి సంబంధించిన పలు విశేషాలను ఓటీటీ సంస్థ ప్రకటించింది. 'నయనతార: బియాండ్ ది ఫెయిరీ టేల్' అనే టైటిల్ ఫిక్స్ చేశారు. నవంబర్ 18 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. అనుకోకుండా సినిమాల్లోకి అడుగుపెట్టారు నయనతార. కాలేజీ రోజుల్లో ఆమె పార్ట్‌టైమ్ మోడల్‌గా వర్క్ చేశారు. ఓ సందర్భంలో ఆమెను చూసిన దర్శకుడు సత్యన్ అంతికాడ్.. 'మనస్సిక్కరే'లో నటిగా అవకాశం ఇచ్చారు. తొలుత దానిని తిరస్కరించిన ఆమె చివరకు ఓకే చెప్పారు. 2003లో పరిశ్రమలోకి వచ్చిన నయన్.. మలయాళం, తమిళం, తెలుగులో వరుస చిత్రాల్లో యాక్ట్ చేశారు. స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్నారు. 'నేను రౌడీనే' సమయంలో దర్శకుడు విఘ్నేశ్ శివన్‌తో పరిచయం ఏర్పడింది. కొంతకాలానికి వీరి మధ్య ప్రేమ మొదలైంది. కొన్నేళ్లపాటు ప్రేమించుకున్న నయన్ - విఘ్నేశ్ పెద్దల అంగీకారంతో 2022లో వైవాహిక బంధంలోకి అడుగుపెట్టారు. నయనతార చిన్నప్పటినుంచి పెళ్లివరకూ సాగే ప్రయాణాన్ని ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నారు. పెళ్లి వేడుక డిజిటల్ రైట్స్ కోసం నెట్‌ఫ్లిక్స్ రూ.25 కోట్లు చెల్లించినట్లు సమాచారం. రెండేళ్ల క్రితం దీని ప్రోమో విడుదల చేశారు. నయన గొప్ప నటి మాత్రమే కాదని.. మంచి మనసున్న వ్యక్తి అందులో విఘ్నేశ్ తెలిపారు.

## కెన్యాలో ప్రిపరేషన్
# వర్క్‌లో రాజమౌళి

సినిమా నినాదం



ప్రముఖ దర్శకుడు రాజమౌళి ప్రస్తుతం కెన్యాలో ఉన్నారు. ఇందులోభాగంగా మంగళవారం అంబోసెలి నేషనల్ పార్క్‌లో తీసిన ఓ ఫొటోని షేర్ చేసిన ఆయన తాజాగా ఇన్‌స్టా వేదికగా మరో పోస్ట్ పెట్టారు. అడవికి రారాజుగా పిలిచే సింహం ఫొటోని షేర్ చేశారు. 'క్రిస్ ఫాలోస్ తీసిన సెరెంగేటి (టాంజానియాలోని ఒక ప్రాంతం) రాజు ఫొటో ఇది. ప్రస్తుతం ఇది నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తోంది. తన తదుపరి సినిమా లొకేషన్స్ సెర్చ్‌లో భాగంగానే జక్కన్న అక్కడికి వెళ్లారని పలువురు భావిస్తున్నారు. దీంతో ఎంబి 29పై సినీప్రియుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. 'బాక్సాఫీస్ రికార్డులు తిరగరాయడం పక్కా', 'షూటింగ్ అప్‌డేట్‌లు కూడా ఇవ్వగలరు', 'మేము కూడా మీతోనే వచ్చేస్తాం సర్' అని కామెంట్స్ పెడుతున్నారు. ఇక మూవీ విషయానికి వస్తే.. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. విజయేంద్రప్రసాద్ కథ అందించారు. భారీ డ్జెట్‌తో యాక్షన్ అడ్వెంచర్ మూవీగా ఇది సిద్ధం కానుంది. అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కని పించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జనవరి నుంచి ఈ సినిమా షూట్ మొదలుకానుందని ఇప్పటికే చిత్ర రచయిత ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే చిత్రబృందం లొకేషన్స్ వేటలో పడినట్లు తెలుస్తోంది. గత కొంతకాలంగా కెన్యాలో పర్యటిస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో మహేశ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం ఆయన ఇప్పటికే సన్నద్ధమయ్యారు. ఈ సినిమాను ప్రకటించినప్పటినుంచి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు. దీనికి 'గరుడ' అనే టైటిల్ ప్రచారంలో ఉంది.

# లక్కీ భాస్కర్ ఓ మంచి సందేశాత్మక చిత్రం

## నిర్మాత నాగవంశీ వెల్లడి





దుల్కర్ సల్మాన్, మీనాక్షి చౌదరి జంటగా వెంకీ అట్లూరి తెరకెక్కించిన చిత్రం 'లక్కీ భాస్కర్' సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నాగవంశీ దీనిని నిర్మించారు. దీపావళి సందర్భంగా అక్టోబర్ 31న విడుదల కానుంది. ఈనేపథ్యంలో నాగవంశీ సినిమా గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇది తప్పకుండా ప్రేక్షకులకు నచ్చుతుందని తాము విశ్వసిస్తున్నామన్నారు. కొన్ని సినిమాలు తెరకెక్కించిన తర్వాత ఆనందకం మైన ఫీలింగ్ వస్తుంది. అలాంటి ఓ సినిమా ఇది. సినిమా చూసిన తర్వాత బాగా తీశామనే ఫీలింగ్ వచ్చింది. అందుకే దీనిపై గట్టి నమ్మకంతో ఉన్నాం. ఈరోజు ప్రీమియర్ వేస్తున్నాం. దర్శకుడు వెంకీ అట్లూరితో మాకు మంచి అనుబంధం ఉంది. ఒక దర్శకుడితో రిలేషన్ సెట్ అయితే హిట్లు, ఎ÷-లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తాం కదా. అదేవిధంగా వెంకీతో నాకు మంచి ఫ్రెండ్‌షిప్ ఉంది. హిట్ లేదా ఎ÷-లాప్ ఏదైనా మా జర్నీ అలాగే కంటిన్యూ అవుతుంది. థ్రిల్లర్ జానర్‌లో ఉండే ఫ్యామిలీ సినిమా ఇది. బ్యాంకింగ్ సెక్టార్‌లో ఉండే లోపాలు వాడుకొని హీరో ఎదిగే క్రమాన్ని దీనిలో చూపించాం. 1980-90లో ముంబయి ఎలా ఉంది? అప్పటి రోజుల్లో బ్యాంక్స్ ఎలా వర్క్ చేశాయి? స్టాక్ మార్కెట్ ఎలా ఉంది? ఇలాంటి విషయాలతో కొత్త ప్రపంచాన్ని సృష్టించాం. సినిమా మొదలైన 15 నిమిషాల్లోనే ప్రేక్షకులు భాస్కర్‌తో కనెక్ట్ అవుతారు. అతడు గెలవాలని కోరుకుంటారు. ఆ విషయంలో నేను గ్యారెంటీ ఇవ్వగలను. డబ్బు సంపాదించాలనిపించినప్పుడు మనిషి ఎంత దూరమైనా వెళ్తాడు అనేది ఈ సినిమా. కంటెంట్‌ను బాగా నమ్మాం. విభిన్నమైన కంటెంట్‌కు కమర్షియల్ హంగులు జోడించాం. ఈ మధ్యకాలంలో ఇలాంటి సినిమా చూడలేదు. ప్రేక్షకులకు ఎక్కడా బోర్ కొట్టదు. థియేటర్ నుంచి బయటకు వచ్చేటప్పుడు ఒక ఫీల్‌తో వస్తారని నాగవంశీ చెప్పారు. థియేటర్ల సమస్య గురించి మాట్లాడుతూ.. ఈ పండుగకు చాలా సినిమాలు విడుదలవుతున్నాయి. దానివల్ల మల్టీప్లెక్సులు దొరకడం కష్టంగా ఉంది. అన్నిచోట్లా ఇదే పరిస్థితి ఉంది. పరిస్థితులకు అనుగుణంగా సెట్ చేసుకొని ముందుకు సాగాలని అన్నారు. కిరణ్ అబ్బవరం 'క', 'అమరన్' కూడా విజయం అందుకోవాలని కోరుకున్నారు.

××లోలీజ్లో)జఅవి.(12లొఛ్ట)గకాఖీష్ర్తఅఈ0చీ.
ఆ్ఖఆ్ఖకాూఅశీఎవ్రాష్ట్రశీశింష్ట్రశీజూ
7.02024:10:30
19:40:44ద?ఇజూఖుఎఎవ్ ఎవష్ర్తఅత్తో'ఃః
అనాఃఔ5వీ0వీజూజవష్త్రఅఓటీమాఓచీఎిఓఎ
ఎ9ఎః?గద?ఖుఎశీఎవ-ఇఖుజూ-టఅశ్రీవతీం

# ఎన్టీఆర్ ఫ్యామిలీ నుంచి మరో ఎన్టీఆర్

## తెరకు పరిచయం చేస్తున్న వైవిఎస్ చౌదరి



సీతారామరాజు, లాహిరి లాహిరి లాహిరిలో, సీతయ్య లాంటి సినిమాలతో డైరెక్టర్‌గా సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న వైవీఎస్ చౌదరి ఇప్పటికే పలువురు యాక్టర్లను ఇండస్ట్రీకి పరిచయం చేసాడు. తాజాగా సీనియర్ ఎన్టీఆర్ కుటుంబం నుంచి మరో కొత్త నటుడిని అందరికీ పరిచయం చేస్తున్నాడు. దివంగత సీనియర్ ఎన్టీఆర్ కుమారుడు నందమూరి హరికృష్ణ మనవడు (జానకిరామ్ కుమారుడు) నందమూరి తారకరామారావు ఫస్ట్ దర్శన్ వీడియోను వైవీఎస్ చౌదరి షేర్ చేశాడు. ప్రొడక్షన్ నంబర్ 1గా రాబోతున్న ఈ చిత్రాన్ని వైవీఎస్ చౌదరి సతీమణి యలమంచిలి గీత నిర్మిస్తుండటం విశేషం. నందమూరి తారకరామారావు హీరోగా గ్రాండ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్టు ఫస్ట్ దర్శన్ వీడియో చెప్పకనే చెబుతోంది. నటుడిగా అందరినీ ఇంప్రెస్ చేసేందుకు యాక్టింగ్, ఫైట్స్‌లో శిక్షణ తీసుకోవడంతో పాటు మేకోవర్ కూడా మార్చుకున్నట్టు తాజా లుక్స్‌తో తెలిసిపోతుంది. ఈ చిత్రానికి లెజెండరీ డైరెక్టర్ ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తుండగా.. సాయి మాధవ్ బుర్రా సంభాషణలు సమకూరుస్తున్నారు. చంద్రబోస్ పాటలు అందిస్తున్నాడు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలపై స్పష్టత రావాల్సి ఉంది. తాజాగా వైవిఎస్ చౌదరి ప్రెస్ మీట్ ఏర్పాటుచేసి ఎన్టీఆర్‌ను పరిచయం చేశారు. దీంతో ఈ అప్‌కమింగ్ హీరోకు సోషల్ మీడియాలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. అతని ఎంట్రీని స్వాగతిస్తూ .. జూనియర్ ఎన్టీఆర్ ఆల్ ది బెస్ట్ చెబుతూ పోస్ట్ చేశారు. 'రామ్ సినీ ప్రపంచంలోకి నీ మొదటి అడుగుకు అభినందనలు. సినిమా ప్రపంచం నిన్ను ఆదరించడానికి ఎదురుచూస్తోంది. నువ్వు చేసే ప్రతి ప్రాజెక్ట్ విజయం సాధించాలని కోరుకుంటున్నా. ముత్తాత ఎన్టీఆర్, తాత హరికృష్ణ, నాన్న జానకిరామ్‌ల ప్రేమ, ఆశీస్సులు నీకు ఎప్పుడూ ఉంటాయి. నువ్వు ఉన్నత శిఖరాలకు చేరుకుంటావనే నమ్మకం ఉంది. నీ భవిష్యత్తు దేదీప్యమానంగా ఉండాలి మై బాయ్' అంటూ జూనియర్ ఎన్టీఆర్ అభినందనలు తెలిపారు. 'డియర్ రామ్.. నీకు శుభాకాంక్షలు. నువ్వు నీ తొలి సినిమాతోనే అందరూ గర్వపడేలా చేస్తావనే నమ్మకం ఉందని కల్యాణ్ రామ్ తెలిపారు. ఇక వాగ్దానం, ప్రతిజ్ఞ, ప్యాషన్.. సీనియర్ ఎన్టీఆర్ ఆశీస్సులతో నందమూరి తారక రామారావు ఇండియన్ సినిమాలోకి పవర్‌ఫుల్ ఎంట్రీ ఇస్తున్నారని వైవీఎస్ చౌదరి తెలిపారు.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Sree Seshasai EnterprisesPlot no. 98/1, Co-operative Industrial Estate,Gandhi Nagar, near Balanagar Medchel -Malkajgiri Dist.Hyderabad 500037 (T.S).
Published at Plot S11, 3rd Floor, Ballard estate Margadarshi building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B. Srinivas, RNI NO. APTEL /2003/11288, Gmail: ninadamnews@gmail.com, CELL : +91 80742 79741